


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

GSTIN 37AMRPM5719R1ZX


**15 ఏళ్ల వైభవ్‌ను స్టార్‌గా తీర్చిదిద్దుతున్న టీమిండియా.. మొర్కెల్ చెప్పిన మాస్టర్ ప్లాన్!**




ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | No: KNL/3-77(D)/2026-2028 | సంచిక : 268 | మంగళవారం 06 - 10 -2026 | పేజీలు : 12 | వెల-3




# ఇంటింటికీ తాగునీరు

## రూ.30,156 కోట్లతో 'అమరజీవి జలధార'కు శ్రీకారం

పార్టీ కాదు.. ప్రాంతం కాదు.. ప్రజలే ముఖ్యం

తాగు నీటి విషయంలో రాజకీయాలకు తావు లేదు

ప్రతి ఇంటికీ సురక్షిత నీరు.. ప్రతి గ్రామానికి నీటి భద్రతే అమరజీవి జలధార లక్ష్యం

-పులివెందులకు రూ.280 కోట్లుతో 299 గ్రామాల తాగు నీటి సమస్యకు పరిష్కారం

3.27 కోట్ల మందికి సురక్షిత తాగునీరు అందించేలా భారీ ప్రణాళిక

గత ఏడు దశాబ్దాల్లో నిర్మించిన వసతులకు మించి ఈ ఐదేళ్లలోనే భారీ నీటి మౌలిక వసతులు

రాయలసీమ నుంచి ఉద్దానం వరకు ప్రతి ప్రాంతానికీ సురక్షిత తాగునీరు 2లో

ప్రొద్దుటూరులో జల్ జీవన్ మిషన్ అమరజీవి జలధార ప్రాజెక్టుల శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

తాగు నీటి విషయంలో రాజకీయాలకు తావు లేదని, అభివృద్ధి విషయంలో ప్రాంతం, పార్టీ అనే తేడా లేకుండా ప్రజలందరికీ సమాన ప్రాధాన్యత ఇవ్వడమే కూటమి ప్రభుత్వ విధానమని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. ప్రజలు ఏ ప్రాంతానికి చెందిన వారైనా, ఏ పార్టీకి మద్దతు ఇచ్చినా వారి సమస్యలను పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యతని స్పష్టం చేశారు. ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగు నీరు, ప్రతి గ్రామానికి నీటి భద్రత కల్పించడమే 'అమరజీవి జలధార' లక్ష్యమని తెలిపారు. సోమవారం కడప జిల్లా పొద్దుటూరులో నిర్వహించిన జల్ జీవన్ మిషన్ అమరజీవి జలధార ప్రాజెక్టుల శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడితో కలిసి రూ.30,156 కోట్ల విలువైన తాగునీటి పనులకు శంకుస్థాపన చేశారు.

**గోదావరి, కావేరి అనుసంధానం నా కోరిక**

ప్రొద్దుటూరు బ్యూరో చీఫ్ అక్టోబర్ 5 నంది పత్రిక









## మంత్రి లోకేశ్ ను కలిసిన ఆసియా క్రీడల స్వర్ణ విజేత ఆర్చర్ జ్యోతి సురేఖ



ఏషియన్ గేమ్స్-2026లో స్వర్ణం సాధించిన సురేఖను అభినందించిన లోకేశ్

2028 ఒలింపిక్స్‌లో పతకమే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచన

ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ 2లో

ఏషియన్ గేమ్స్‌లో ఇప్పటివరకు 6 పతకాలు సాధించిన సురేఖ

అంతర్జాతీయ వేదికలపై పతకాల పంట పండిస్తూ దేశానికి, రాష్ట్రానికి గర్వకారణంగా నిలుస్తున్న ప్రఖ్యాత ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ సోమవారం రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌తో భేటీ అయింది. ఇటీవల జపాన్‌లో జరిగిన ఏషియన్ గేమ్స్-2026లో స్వర్ణ పతకం సాధించిన ఆమెను మంత్రి లోకేశ్ ఘనంగా అభినందించారు. భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశిస్తూ, 2028 ఒలింపిక్స్‌లో పతకం సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని, ఇందుకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సోమవారం ఉండవల్లిలోని మంత్రి నివాసంలో ఈ భేటీ జరిగింది. తన తండ్రి సురేంద్ర కుమార్‌తో కలిసి జ్యోతి సురేఖ, మంత్రి లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా, జపాన్‌లో జరిగిన ఏషియన్ గేమ్స్-2026 ఆర్చరీ కాంపౌండ్ మహిళల టీమ్ విభాగంలో స్వర్ణం గెలుచుకున్న జ్యోతి సురేఖను మంత్రి ప్రత్యేకంగా ప్రశంసించారు. అంతర్జాతీయ క్రీడా వేదికపై భారత మువ్వన్నెల పతాకాన్ని రెపరెపలాడించడం గర్వంగా ఉందని కొనియాడారు. ఏషియన్ గేమ్స్ చరిత్రలో జ్యోతి సురేఖ ఇప్పటివరకు నాలుగు స్వర్ణ పతకాలతో సహా మొత్తం ఆరు పతకాలు సాధించి అరుదైన రికార్డు సృష్టించింది. ఆమె నిలకడైన ప్రతిభ, పట్టుదల యువ క్రీడాకారులకు స్ఫూర్తిదాయకమని లోకేశ్ అన్నారు. ఈ ప్రయాణంలో ప్రభుత్వం తరఫున అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని ఆయన స్పష్టమైన హామీ ఇచ్చారు.

## రాయలసీమ పౌరుషమంటే గొడ్డలి పోట్లు కాదు.. అభివృద్ధి

రాయలసీమ పౌరుషమంటే గొడ్డలి పోట్లు కాదని, అభివృద్ధి అని పవన్ కల్యాణ్ వ్యాఖ్య

ప్రొద్దుటూరులో రూ.30,156 కోట్లతో అమరజీవి జలధార పథకానికి శ్రీకారం

గత ప్రభుత్వం జలజీవన్ మిషన్ నిధులను నిర్వీర్యం చేసిందని తీవ్ర విమర్శ

పులివెందుల, అరకులోనూ వివక్ష లేకుండా అభివృద్ధి పనులు చేస్తున్నామని వెల్లడి

ఇది కక్షసాధింపుల ప్రభుత్వం కాదు, ప్రజాభివృద్ధి ప్రభుత్వమని స్పష్టీకరణ 2లో





## సీఈసీ జ్ఞానేశ్ కుమార్ నిర్ణయాలపై పిటిషన్లు.. కేంద్రం, ఈసీకి సుప్రీంకోర్టు నోటీసులు

సీఈసీ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారంటూ దాఖలైన పిటిషన్లపై సుప్రీం విచారణ

కేంద్ర ప్రభుత్వం, ఈసీకి వారం రోజుల్లో సమాధానం ఇవ్వాలని నోటీసులు

ఓటర్ల జాబితా సవరణ వంటి అంశాల్లో సీఈసీ ఒంటరిగా నిర్ణయాలు తీసుకున్నారని ఆరోపణ

చట్టవిరుద్ధమైన నిర్ణయాలు ఉంటే రద్దు చేస్తామన్న సుప్రీంకోర్టు ధర్మాసనం

సీఈసీ విధులకు ఆటంకం కలిగించేలా మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు నిరాకరణ 2లో

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ అధికారాల వినియోగంపై దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు నేడు విచారణ చేపట్టింది. ఇతర కమిషనర్లతో సంప్రదించకుండా సీఈసీ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్లను

## పవన్ కల్యాణ్ ఆదేశాలతో ఇంద్రకీలాద్రిపై ప్రధాని మోదీ పేరిట పూజలు

మోదీ 25 ఏళ్ల ప్రజా ప్రస్థానం పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమం

పవన్ కల్యాణ్ ఆదేశాలతో ఎంపీ లింగమనేని రమేశ్ పూజల నిర్వహణ

అమ్మవారికి విశిష్టమైన ఖడ్గమాల అర్చన జరపనున్న ఎంపీ

ప్రధానికి ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు కలగాలని ఆకాంక్ష



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంటున్న చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని విజయవాడ ఇంద్రకీలాద్రిపై

## మాజీ మంత్రి కారుమూరిని హైదరాబాద్ జైలు నుంచి విజయవాడ తరలింపు



మద్యం రవాణా స్కాంలో మాజీ మంత్రి కారుమూరికి సిట్ కస్టడీ 2లో

కుమారుడికి సబ్ కాంట్రాక్టు ఇప్పించి నిధులు స్వాహా చేశారని ఆరోపణలు

కుమారుడు, కోడలి ఖాతాల్లోకి 85 శాతం నిధులు మళ్లినట్లు గతంలో ఈడీ గుర్తింపు

ఈ నెల 9 వరకు కారుమూరిని ప్రశ్నించనున్న సిట్ అధికారులు

ఏపీ మద్యం రవాణా కుంభకోణం కేసులో విచారణ వేగవంతమైంది. ఈ కేసులో కీలక ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావును ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు తమ కస్టడీలోకి తీసుకున్నారు. హైదరాబాద్ జైలులో ఉన్న ఆయన్ను సోమవారం విజయవాడకు తరలించారు. విజయవాడలో వైద్య పరీక్షలు పూర్తి చేసిన అనంతరం, ఈ నెల 9వ తేదీ వరకు జైలులో ఆయనను ప్రశ్నించనున్నారు. ఈ కుంభకోణానికి సంబంధించి మరిన్ని కీలక వివరాలు రాబట్టడమే లక్ష్యంగా సిట్ అధికారులు కారుమూరిని కస్టడీలోకి తీసుకున్నారు. ఈ కేసుపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా దర్యాప్తు చేపట్టింది. మంత్రిగా తన అధికారాన్ని దుర్వినియోగం చేసి కారుమూరి నాగేశ్వరరావు, మద్యం రవాణా సబ్ కాంట్రాక్టును తన కుమారుడు కారుమూరి సునీల్‌కు ఇప్పించారని ఈడీ తన దర్యాప్తులో గుర్తించింది. దీనికోసం 'సుదర్శన్ కన్‌స్ట్రక్షన్స్' అనే ఒక

## 2029 నాటికి 4-స్టార్.. ప్రభుత్వ స్కూళ్లపై మంత్రి లోకేశ్ సమీక్ష..



ఏడాదిలోగా వన్-స్టార్ స్కూళ్లను టూ-స్టార్‌గా మార్చాలని ఆదేశం 2లో

2029 నాటికి రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో 4-స్టార్ సదుపాయాల కల్పన లక్ష్యం

ఈ ఏడాది 5 లక్షల మంది విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని నిర్ణయం

ఏజెన్సీ ప్రాంత పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచన




పెన్షన్ కార్డు వెరిఫికేషన్.. లైఫ్ సర్టిఫికెట్.. సీనియర్ సిటిజన్ కార్డు.. ట్రాఫిక్ చలానా.. క్రెడిట్ కార్డు అప్‌డేట్.. ఇలా ఏదో ఒక సాకుతో ఫోన్ చేసి ఓ యాప్ డౌన్‌లోడ్ చేయిస్తున్నారు. ఆ తర్వాత బాధితుల ఖాతాల్లోని డబ్బు మాయమవుతోంది. ఇలాంటి సైబర్ మోసాలకు ఉపయోగించిన 2,805 హానికర ఆప్రాఖ ఫైళ్లను రూపొందించి విక్రయించిన వ్యక్తిని ముంబయి క్రైమ్ బ్రాంచ్ ప్రాపర్టీ సెల్ పోలీసులు అరెస్టు చేశారు. అతడి యాప్స్‌ను ఉపయోగించి దేశవ్యాప్తంగా జరిగిన మోసాల విలువ రూ.150 కోట్లకు పైగానే ఉండొచ్చని దర్యాప్తు అధికారులు అంచనా వేస్తున్నారు. బైకుల్లాకు చెందిన ఓ వృద్ధుడు ఇదే తరహా మోసానికి గురై రూ.5.62 లక్షలు కోల్పోయిన ఘటనపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడి ఆచూకీని గుర్తించారు. ఈ కేసు ఆగస్టు 13న నమోదైంది.

**వెరిఫికేషన్ పేరుతో వల** నిందితుడు రూపొందించిన ఆప్రాఖ ఫైళ్లను చూస్తే అవి సాధారణ సేవలకు సంబంధించిన యాప్స్‌లా కనిపిస్తాయి. పెన్షన్ కార్డు వెరిఫికేషన్, లైఫ్ సర్టిఫికెట్, సీనియర్ సిటిజన్ కార్డు, ట్రాఫిక్ చలానా, క్రెడిట్ కార్డు వివరాల అప్‌డేట్ వంటి పేర్లతో వీటిని తయారు చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఆండ్రాయిడ్ ఫోన్లలో యాప్స్‌ను ఇన్‌స్టాల్ చేయడానికి ఫైళ్లను ఉపయోగిస్తారు. అయితే నిందితుడు రూపొందించిన ఫైళ్లలో హానికరమైన సాఫ్ట్‌వేర్‌ను నిక్షిప్తం చేసి, వాటిని సైబర్ మోసాలకు ఉపయోగించినట్లు

# ఇంటింటికి తాగునీరు

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "శ్రీరామచంద్రుని పాదస్పర్శతో పునీతమైన నేల. మహాత్మా గాంధీ నడయాడిన నేల. తెలుగు సాహిత్యాన్ని తన అక్షరాలతో సుసంపన్నం చేసిన సరస్వతీపుత్ర పుట్టపర్తి నారాయణాచార్యులకు జన్మనిచ్చిన నేల ప్రొద్దుటూరు. బంగారం, వస్త్ర వ్యాపారంలో మినీ ముంబై గా, దసరా ఉత్సవాల్లో రెండో మైసూరు గా ప్రొద్దుటూరుకు ప్రత్యేక గుర్తింపు ఉంది.

**రూ.30,000 కోట్లతో భారీ తాగు నీటి ప్రణాళిక**

రాష్ట్రంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో రూ.30,156 కోట్లతో 50,315 పనులను శ్రీకారం చుడుతున్నాం. 24,601 ఆవాసాల్లో ఇప్పటికే ఉన్న 61.60 లక్షల కుళాయి కనెక్షన్ల సామర్థ్యాన్ని పెంచి స్థిరీకరించడంతో పాటు, మరో 27.36 లక్షల కొత్త కుళాయి కనెక్షన్లను అందిస్తున్నాం. మొత్తంగా 3.27 కోట్ల మంది ప్రజలకు సురక్షితమైన తాగు నీరు అందేలా కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నాం. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన 'హర్ ఘర్ జల్' జల్ జీవన్ మిషన్‌కు గత ప్రభుత్వం తగిన ప్రాధాన్యత ఇవ్వలేదు. 2019-24 మధ్య కేంద్రం ఆంధ్రప్రదేశ్‌కు దాదాపు రూ.26 వేల కోట్లు అందించినప్పటికీ, గత ఐదేళ్లలో రూ.2,700 కోట్లు మాత్రమే ఖర్చు చేసి, అక్కడక్కడ పైపులైన్లు, చిన్నచిన్న పనులు చేసి వదిలేశారు. 2024తో పథకం గడువు ముగుస్తుందని, నిధులు వెనక్కి వెళ్లే పరిస్థితి వస్తుందని, ప్రజల తాగునీటి కష్టాలు ఎప్పటికీ తీరవని తెలిసినా కూడా పట్టించుకోలేదు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే, జల్ జీవన్ మిషన్‌ను కొనసాగించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , నేను - ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ని కలిసి విజ్ఞప్తి చేశాము. అలాగే, కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్. పాటిల్ గారు, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సహకారంతో జలజీవన్ మిషన్ పథకాన్ని 2028 వరకు పొడిగించుకుని, వెంటనే పనులు ప్రారంభించాం. ఇప్పటికే రూ.4,500 కోట్ల విలువైన పనులు పూర్తి చేశాము.

**గత మౌలిక వసతులకు భారీగా అదనపు సామర్థ్యం**

1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి 2024 వరకు రాష్ట్రంలో తాగు నీటి మౌలిక వసతుల అభివృద్ధి క్రమంగా జరిగింది. ఈ కాలంలో 816 ఎం.ఎల్.డి సామర్థ్యం కలిగిన వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, 1,072 ఓవర్ హెడ్ బ్యాలెన్స్ జలాశయాలు, 28,086 ఓవర్ హెడ్ నిల్వ జలాశయాలు, 1.18 లక్షల కిలోమీటర్ల మేర పైప్‌లైన్లు ఏర్పాటు చేయబడ్డాయి. అయితే, 'అమరజీవి జలధార' కార్యక్రమం ద్వారా కేవలం ఐదేళ్లలోనే ఈ మౌలిక వసతులకు భారీగా అదనపు సామర్థ్యాన్ని జోడిస్తున్నాం. ఇందులో భాగంగా 1,426 ఎం.ఎల్.డి సామర్థ్యం కలిగిన నీటి శుద్ధి కేంద్రాలు, 494 ఓవర్ హెడ్ బ్యాలెన్స్ జలాశయాలు, 13,075 ఓవర్ హెడ్ నిల్వ జలాశయాలు, 77 వేల కిలోమీటర్ల పైప్‌లైన్లను ఏర్పాటు చేస్తున్నాం. అంటే, గత ఏడు దశాబ్దాల్లో నిర్మించిన మౌలిక వసతులతో పోలిస్తే, కేవలం ఈ ఐదేళ్లలోనే 50 శాతం నుంచి 175 శాతం వరకు అదనపు సామర్థ్యాన్ని సృష్టిస్తున్నాం. రూ.9 వేల కోట్లతో 50,283 సింగిల్ విలేజ్ స్కీమ్స్, రెట్రోఫిట్టింగ్ పనులు, రూ.19,500 కోట్లతో 32 మల్టీ విలేజ్ స్కీమ్స్ చేపడుతున్నాం. నీటి నాణ్యత పర్యవేక్షణ కోసం రూ.1,624 కోట్లు కేటాయించాము. ఉద్దానం నుంచి డోన్ వరకు, కర్నూలు నుంచి కుప్పం వరకు, గండికోట, పీఏబీఆర్, ఏలేరు, తాండవ, హిరమండలం, ధవళేశ్వరం తదితర జలాశయాల ఆధారంగా తాగు నీటి పథకాలను చేపడుతున్నాం. ఉద్దానం, ఏ.కొండూరు వంటి కిడ్నీ సమస్యలు అధికంగా ఉన్న ప్రాంతాలతో పాటు, రాయలసీమలోని కరువు ప్రభావిత ప్రాంతాలు, పులివెందుల, పుంగనూరు, పలమనేరు, గోదావరి ప్రాంతాల్లోని కాలుష్య ప్రభావిత ప్రాంతాలు, మార్కాపురం వంటి ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాల్లోనూ సురక్షితమైన తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం.

**నీటి నాణ్యతపై ప్రత్యేక దృష్టి** నీటి వనరులకు కొరత లేని ఉమ్మడి గోదావరి జిల్లాల్లో కూడా తాగు నీటి భద్రతను దృష్టిలో పెట్టుకుని రూ.6 వేల కోట్లతో జల్ జీవన్ మిషన్ పనులు చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆక్వా సాగు, పారిశ్రామిక కాలుష్యం కారణంగా కొన్ని ప్రాంతాల్లో భూగర్భ, ఉపరితల నీటి వనరులు కలుషితమవుతున్నాయి. అందుకే నీటి నమూనాలను ఎప్పటికప్పుడు సేకరించి పరీక్షిస్తున్నాం. కాలుష్యానికి కారణమవుతున్న ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్లపై కఠిన చర్యలు తీసుకుంటూ షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నాం. అదే సమయంలో, తాగునీటి పథకాల్లో నీటి శుద్ధికి కీలకమైన ఫిల్టర్ బెడ్స్ నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నాం. ఇప్పటి వరకు రూ.35 కోట్లతో 340 ఫిల్టర్ బెడ్స్‌ను పునరుద్ధరించాం. మరో 552 ఫిల్టర్ బెడ్స్‌ను రూ.88 కోట్లతో పునరుద్ధరిస్తున్నాం. పంప్ హౌస్‌లు, రిజర్వాయర్లు, పైప్‌లైన్ల నిర్వహణతో పాటు నీటి నాణ్యతను నిరంతరం పర్యవేక్షించడం, ఇతర అవసరమైన సహాయక కార్యకలాపాల కోసం రూ.1,600 కోట్లు కేటాయించాం. నీటి శుద్ధి కేంద్రాలు, పంప్ హౌస్‌లలోని ఓపెనింగ్స్‌కు రక్షణ వలలు ఏర్పాటు చేసి బల్లులు, పురుగులు వంటి జీవులు లోపలికి ప్రవేశించకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించాం.

**తాళ్లమాపురానికి రూ.3.5 కోట్ల అభివృద్ధి పనులు**

ప్రొద్దుటూరు నియోజక వర్గంలోని తాళ్లమాపురం పంచాయతీ ప్రజలు గత ప్రభుత్వ హయాంలో తమ సమస్యల పరిష్కారం కోసం అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని స్థానికులు చెబుతున్నారు. దాదాపు 6 వేల జనాభా ఉన్న ఈ గ్రామంలో రోడ్లు, తాగు నీరు వంటి కనీస మౌలిక వసతుల కోసం ప్రజలు పలుమార్లు వినతులు సమర్పించినా, తగిన స్పందన లభించలేదనే ఆవేదన ఉంది. సమస్యలను ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించిన యువత కూడా ఇబ్బందులు ఎదుర్కొన్న పరిస్థితులు ఉన్నాయి. ఇకపై ఇలాంటి పరిస్థితులకు తావులేకుండా తాళ్లమాపురం, సాగిలి గొడ్డుపల్లి, ములవారిపల్లి గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. దాదాపు రూ.1.5 కోట్లతో రెండు కిలోమీటర్ల సీసీ రోడ్లు, మ్యాజిక్ డ్రైన్లు నిర్మించడంతో పాటు, మరో రూ.2 కోట్లతో 90 కిలోలీటర్ల సామర్థ్యం కలిగిన ఓవర్‌హెడ్ రిజర్వాయర్, నాలుగు కిలోమీటర్ల పైప్‌లైన్లు, ప్రత్యేక బోర్‌వెల్ ఏర్పాటు చేయనున్నాం. మొత్తం రూ.3.5 కోట్ల విలువైన ఈ పనులను తక్షణమే చేపట్టాలని అధికారులను ఆదేశిస్తున్నాను. ప్రజల సమస్యలను పరిష్కరించే విషయంలో కూటమి ప్రభుత్వం ప్రాంతం, పార్టీ అనే తేడా చూడదు. ప్రతి గ్రామానికి సమానంగా అభివృద్ధి ఫలాలు అందాలన్నదే మా లక్ష్యం. అందుకు నిదర్శనంగా పులివెందులలో అసంపూర్తిగా ఉన్న తాగునీటి పథకానికి రూ.280 కోట్లు కేటాయించి, ఏడు మండలాల్లోని 299 గ్రామాల తాగు నీటి సమస్యకు పరిష్కారం చూపించే చర్యలు చేపట్టాం. అదేవిధంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకు, పాడేరు నియోజకవర్గాల్లోనూ ఎలాంటి ప్రాంతీయ భేదాలు లేకుండా దాదాపు రూ.2,500 కోట్లతో 'పల్లె పండుగ', 'అడవితల్లి బాట' వంటి అభివృద్ధి పనులను చేపడుతున్నాం.

**కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లుల చెల్లింపు**

గత ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ, జల జీవన్ మిషన్ వంటి కార్యక్రమాల కింద పనులు చేపట్టిన చిన్న, మధ్యతరహా కాంట్రాక్టర్లకు బిల్లులు పెండింగ్‌లో ఉండిపోయాయి.

దీంతో పనులు చేసిన కాంట్రాక్టర్లు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాం. ఎఫ్.ఐ.ఎఫ్.ఓ. విధానంలో బిల్లులను సకాలంలో చెల్లిస్తూ, కాంట్రాక్టర్లకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నాం. అదే విధంగా 15వ ఆర్థిక సంఘం నిధులను కూడా పంచాయతీలకు ఎప్పటికప్పుడు విడుదల చేస్తున్నాం. ఇప్పటి వరకు రూ.4,200 కోట్లను విడుదల చేశాం. పంచాయతీలకు నిధుల కొరత లేకుండా చూడటం, అభివృద్ధి పనులు నిరంతరాయంగా కొనసాగించడం, పనులు చేసిన వారికి సకాలంలో చెల్లింపులు చేయడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్నాం" అన్నారు. అంతకు ముందు వేదిక వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక ర్యాంప్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ కలిసి నడుస్తూ సభకు తరలివచ్చిన ప్రజలకు అభివాదం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమం, జౌళి శాఖ, జిల్లా ఇంఛార్జ్ మంత్రి ఎస్. సవిత , మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ , రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్థనరెడ్డి ప్రొద్దుటూరు శాసన సభ్యులు నంద్యాల వరదరాజులు రెడ్డి పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల ముఖ్య కార్యదర్శి శ్రీ కాంతిలాల్ దండే గారు, కడప జిల్లా కలెక్టర్ శ్రీ చెరుకూరి శ్రీధర్ గారు, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణ తేజ, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇ.ఎన్.సి. గాయత్రి దేవి కూటమి పార్టీలకు చెందిన శాసన మండలి సభ్యులు, శాసన సభ్యులు, వివిధ కార్పోరేషన్ల ఛైర్మన్లు, నాయకులు పాల్గొన్నారు.

## సైబర్ మాయ,,!

దర్యాప్తులో తేలింది. ముందుగా బాధితులకు ఫోన్ కాల్స్ లేదా మెసేజ్‌లు వస్తాయి. కార్డు ఇప్పిస్తామని, ఏదో ఒక సేవ అందిస్తామని, లేదంటే వెరిఫికేషన్ పూర్తి చేయాలని చెబుతారు. మాటలతో నమ్మించిన తర్వాత ప్రత్యేక యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచిస్తారు. బాధితుడు ఆ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసిన వెంటనే సైబర్ నేరగాళ్లకు కావాల్సిన సమాచారం అందుబాటులోకి వచ్చేదని పోలీసులు చెబుతున్నారు. ఈ మోసాల కోసం నిందితుడు ప్రత్యేకంగా సర్వర్ స్పేస్‌ను కూడా అద్దెకు తీసుకున్నట్లు దర్యాప్తులో బయటపడింది.

**సైబర్ నేరగాళ్లతో పరిచయం** విచారణలో నిందితుడి నేర కార్యకలాపాల తీరు కూడా వెలుగులోకి వచ్చింది. తొలుత యాప్స్, వెబ్‌సైట్ల అభివృద్ధి సేవలు అందించే వ్యక్తిగా అతడు పనిచేసేవాడని పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో ఓ సైబర్ నేరగాడు అతడిని సంప్రదించాడు. తాను ఇూఖ దెవలపర్‌నని పరిచయం చేసుకున్న నిందితుడు.. తన సేవలను అందించేందుకు అంగీకరించాడు. ఆ పరిచయం క్రమంగా విస్తరించి దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సైబర్ నేరగాళ్లతో అతడికి సంబంధాలు ఏర్పడ్డాయి. చివరకు వారి అవసరాలకు అనుగుణంగా మోసపూరిత ఇూఖ యాప్స్‌ను తయారు చేసి విక్రయించడం ప్రారంభించినట్లు పోలీసులు వెల్లడించారు.

**రూ.150 కోట్లకు పైగా మోసాలు?** నిందితుడు రూపొందించి విక్రయించిన యాప్స్‌ను ఉపయోగించి జరిగిన సైబర్ మోసాల విలువ రూ.150 కోట్లను దాటినట్లు దర్యాప్తు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. అయితే దేశవ్యాప్తంగా మరిన్ని కేసులను పరిశీలిస్తున్నందున ఈ మొత్తం మరింత పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. అయితే ఈ రూ.150 కోట్లు నిందితుడు సంపాదించిన మొత్తం కాదని పోలీసులు స్పష్టం చేస్తున్నారు. అతడు రూపొందించిన హానికరమైన యాప్స్ ద్వారా బాధితులు కోల్పోయిన మొత్తాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ అంచనాకు వచ్చినట్లు తెలిపారు.

**కొనుగోలుదారులెవరు?** ప్రస్తుతం నిందితుడిని విచారిస్తున్న పోలీసులు.. అతడి వద్ద నుంచి ఈ యాప్స్‌ను కొనుగోలు చేసిన సైబర్ నేరగాళ్లు ఎవరన్న దానిపై దృష్టి సారించారు. దేశవ్యాప్తంగా విస్తరించిన నెట్‌వర్క్‌లో ఇంకా ఎంతమంది ఉన్నారు? ఎన్ని మోసాలు జరిగాయి? ఏయే ప్రాంతాల్లో బాధితులు ఉన్నారు? అన్న కోణాల్లో దర్యాప్తు సాగుతోంది.

**ఆసియా సంస్కృతి** ఒక డెవలపర్ చేతిలో తయారైన ఓ ఇూఖ ఫైల్.. సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లి వందలాది మంది బాధితుల ఖాతాలను ఖాళీ చేసిందా? రూ.150 కోట్లకు పైగా జరిగినట్లు అనుమానిస్తున్న ఈ సైబర్ మోసాల వెనుక ఉన్న అసలు నెట్‌వర్క్‌ను ఛేదించడమే ఇప్పుడు పోలీసులకు సవాల్‌గా మారింది

## 2029 నాటికి 4-స్టార్.. ప్రభుత్వ స్కూళ్లపై మంత్రి లోకేశ్ సమీక్ష..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఈ విషయంలో నిర్దేశిత లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా చేరుకోవాలని రాష్ట్ర ఐటీ, విద్య, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో వసతుల కల్పన, నైపుణ్యాభివృద్ధి అంశాలపై సోమవారం ఉండవల్లిలోని తన నివాసంలో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. ఏడాదిలోగా రాష్ట్రంలోని వన్-స్టార్ పాఠశాలలన్నింటినీ టూ-స్టార్ స్థాయికి అప్‌గ్రేడ్ చేయాలని స్పష్టం చేశారు. అలాగే, ప్రస్తుత విద్యా సంవత్సరంలోగా జీరో-స్టార్ రేటింగ్ ఉన్న పాఠశాలలన్నింటినీ కనీసం వన్-స్టార్ స్థాయికి చేర్చాలని సూచించారు. 2029 నాటికి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను 4-స్టార్ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని, కనీసం వెయ్యి పాఠశాలలను 5-స్టార్ స్థాయికి చేర్చేలా పటిష్ఠ ప్రణాళికలు రూపొందించాలని దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా ఏజెన్సీ, వెనుకబడిన ప్రాంతాల్లోని పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున 175 "లీప్ స్కూళ్లను" అభివృద్ధి చేసేందుకు అవసరమైన కార్యాచరణ సిద్ధం చేయాలని కోరారు. ప్రస్తుతం రాష్ట్రంలో 1,685 వన్-స్టార్... 15,618 టూ-స్టార్... 19,099 త్రీ-స్టార్... 7,172 ఫోర్-స్టార్ పాఠశాలలు ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల పురోగతిపై డీఈవోలు, ఎంఈవోలు, సీఆర్పీలకు బాధ్యతలు అప్పగించాలని లోకేశ్ సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 7 వేల హైస్కూళ్లలో పూర్తిస్థాయిలో కంప్యూటర్ ల్యాబ్స్, అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అకడమిక్ సంస్కరణలు పూర్తయినందున, ఇకపై అధికారులు, ఉపాధ్యాయులు పూర్తిగా అభ్యసన ఫలితాల మెరుగుదలపైనే దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.

**నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట** విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందించేందుకు కేంద్ర ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని మంత్రి లోకేశ్ ఆదేశించారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై) ద్వారా ఈ ఏడాది 5 లక్షల మంది విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించారు. ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్, నేషనల్ అప్రెంటిస్‌షిప్ స్కీమ్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. నిరుద్యోగ యువతను "నైపుణ్యం పోర్టల్" పరిధిలోకి తీసుకువచ్చి, ఏఐ సాంకేతికత ద్వారా వారికి ఇంటర్వ్యూలు నిర్వహించాలన్నారు. సీడాప్, ఓంక్యాప్‌ల ద్వారా జర్మన్, జపనీస్ వంటి విదేశీ భాషల్లో శిక్షణనిచ్చి, విదేశాల్లో ఉపాధి అవకాశాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మానవ వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి జె. శ్యామలరావు, ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ రంజిత్ బాషా, రాష్ట్ర విద్యా మౌలిక సదుపాయాల సంస్థ ఎండీ దీవెన్ రెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ సీఈవో నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

## 15 ఏళ్ల వైభవ్‌ను స్టార్‌గా తీర్చిదిద్దుతున్న టీమిండియా.. మోర్కెల్ చెప్పిన మాస్టర్ ప్లాన్!

టీమిండియాలోకి వచ్చిన యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీని పెద్ద ఆటగాడిగా తీర్చిదిద్దేందుకు జట్టు మేనేజ్‌మెంట్ ప్రత్యేక దృష్టి పెడుతోంది. సీనియర్ ఆటగాళ్ల మధ్య ఉండటం, వాళ్లను గమనించడం, ప్రశ్నలు అడగడం ద్వారా 15 ఏళ్ల వైభవ్ ఎంతో నేర్చుకోగలడని భారత బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ చెప్పాడు. వెస్టిండీస్‌తో మంగళవారం ప్రారంభమయ్యే ఐదు టీ20ల సిరీస్‌కు ముందు అతను ఈ వ్యాఖ్యలు చేశారు.

వైభవ్‌కు తుది జట్టులో అవకాశం వచ్చినా.. రాకపోయినా అతడి ఎదుగుదల ఆగదని మోర్కెల్ అన్నారు. మ్యాచ్ ఆడకపోయినా డ్రెస్సింగ్ రూమ్‌లో సీనియర్ ఆటగాళ్లతో గడపడం, వాళ్లు ప్రాక్టీస్‌కు ఎలా సిద్ధమవుతున్నారు? ఇన్నింగ్స్‌ను ఎలా ప్లాన్ చేస్తున్నారు? పరిస్థితులకు తగ్గట్టుగా ఎలా స్పందిస్తున్నారు? అన్నది గమనించడం ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. "ప్రాక్టీస్‌లో ఈ ఆటగాడు ఏం చేస్తున్నాడో చూడు. అతడు తొలి 15 బంతులను ఎలా ఎదుర్కొంటున్నాడు? పిచ్ నుంచి సహకారం లభిస్తే ఎలా ప్లాన్ చేస్తున్నాడు? అని యువ ఆటగాళ్లను ఆలోచించేలా చేస్తాను" అని మోర్కెల్ తెలిపాడు. ప్రతి ప్రాక్టీస్ సెషన్ తర్వాత వైభవ్ ఏం నేర్చుకున్నాడో అడుగుతానని చెప్పాడు. "నేను ఫాస్ట్ బౌలర్‌ను. బ్యాటింగ్ గురించి ఎక్కువగా చెప్పలేను. కానీ బస్సులో అతడిని 'ఈ రోజు ఏం నేర్చుకున్నావు? ఆ ఆటగాడి బ్యాటింగ్‌లో ఏం గమనించావు?' అని అడుగుతాను. ఇలా అడగడం వల్ల అతడు ఆలోచిస్తాడు. తర్వాత నెట్స్‌లోకి

వచ్చినప్పుడు ఆ విషయాలను గమనించి తన ఆటకు తగ్గట్టుగా మార్చుకుంటాడు" అని వివరించాడు. ఇక భారత్-వెస్టిండీస్ టీ20 సిరీస్ తొలి మ్యాచ్ లక్నోలోని ఏకానా స్టేడియంలో జరగనుంది. ఆసియా క్రీడల నుంచి తిరిగొచ్చిన ఆటగాళ్ల ఫిట్‌నెస్, ప్రయాణ అలసటను పరిశీలించిన తర్వాత తుది జట్టును ఎంపిక చేస్తామని మోర్కెల్ తెలిపాడు. గాయంతో కొంతకాలం దూరమైన మయాంక్ యాదవ్ తిరిగి జట్టులోకి రావడం కూడా భారత్‌కు కీలకమేనన్నారు. అతడి వేగం ప్రత్యేక ఆయుధమని చెప్పాడు. నెట్ బౌలర్‌గా మొదలై ఇప్పుడు భారత్ తరఫున ఆడే స్థాయికి చేరుకున్న ప్రిన్స్ యాదవ్ కష్టపడిన తీరును మోర్కెల్ ప్రశంసించాడు.

## పవన్ కళ్యాణ్ ఆదేశాలతో ఇంద్రకీలాద్రిపై ప్రధాని మోదీ పేరిట పూజలు

ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అక్టోబర్ 7వ తేదీన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో ప్రధాని మోదీ పేరిట ఈ పూజా కార్యక్రమాలను చేపట్టనున్నారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు రాజ్యసభ సభ్యులు లింగమనేని రమేశ్ ఈ పూజలను నిర్వహిస్తున్నారు. 2001లో గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రధాని మోదీ ప్రజా ప్రస్థానం ప్రారంభమైంది. అప్పటి నుంచి 2014లో దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టి, 25 ఏళ్లుగా తన సేవలను దిగ్విజయంగా కొనసాగిస్తున్నారు. ఈ మైలురాయిని పురస్కరించుకుని, ప్రధాని మోదీకి అమ్మవారి సంపూర్ణ ఆశీస్సులు లభించాలని, ఆయనకు ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు ప్రసాదించాలని ఆకాంక్షిస్తూ ఈ పూజలు జరపనున్నారు. దేశాన్ని 'వికసిత్ భారత్' లక్ష్యం వైపు నడిపిస్తున్న ఆయన నాయకత్వం మరింత బలోపేతం కావాలన్నది ఈ పూజల ముఖ్య ఉద్దేశం. ఈ సందర్భంగా అక్టోబర్ 7వ తేదీ తెల్లవారుజామున బ్రహ్మ ముహూర్తంలో అమ్మవారి అంతరాలయంలో అత్యంత విశిష్టమైన 'ఖడ్గమాల అర్చన'ను ప్రధాని పేరిట జరపనున్నారు. జగద్గురువు ఆది శంకరాచార్యులు ఇంద్రకీలాద్రిపై ప్రతిష్ఠించిన శ్రీచక్రానికి ఖడ్గమాల స్తోత్రంతో పూజలు నిర్వహిస్తే అమ్మవారి అనుగ్రహంతో పాటు ఆధ్యాత్మిక శక్తి, రక్షణ, శాంతి, సంకల్పసిద్ధి కలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ప్రధాని మోదీ నిరంతర దేశ సేవకు కనకదుర్గమ్మ ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని, ఆయన నాయకత్వంలో భారతదేశం మరింత సుసంపన్నమైన, ఆత్మనిర్భర దేశంగా ఎదగాలన్న సంకల్పంతో ఎంపీ లింగమనేని రమేశ్ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ పూజల ద్వారా ప్రధానికి సంపూర్ణ ఆరోగ్యం, శక్తి సామర్థ్యాలు లభించాలని ఆకాంక్షించారు.

## రాయలసీమ పౌరుషమంటే గొడ్డలి పోట్లు కాదు.. అభివృద్ధి: పవన్ కళ్యాణ్

"యుద్ధం వచ్చినప్పుడు, హద్దులు దాటినప్పుడు నా గొంతు ఎలా ఉంటుందో మీకు తెలుసు. కానీ ఇది శాంతి సమయం. ప్రజలకు అభివృద్ధి చేయాల్సిన సమయం. అందుకే రాయలసీమ పౌరుషానికి తగిన స్పీచ్ మాట్లాడట్లేదు. రాయలసీమ అభివృద్ధికి అవసరమైన విధంగా మాట్లాడుతున్నా. గొడవలు, కొట్లాటలు, గొడ్డలి పోట్లు కాకుండా అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్దాం" అంటూ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రాయలసీమ పౌరుషాన్ని ప్రస్తావిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గొడవలకు, పౌరుషానికి ప్రతీకగా నిలిచిన ఈ నేల రూపురేఖలను అభివృద్ధి పథంలో మార్చాలని ఆయన పిలుపునిచ్చారు. కడప జిల్లా ప్రొద్దుటూరులో ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి రూ.30,156 కోట్ల విలువైన 'అమరజీవి జలధార' పథకానికి శంకుస్థాపన చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పవన్ కళ్యాణ్ తనదైన శైలిలో ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు పేరు మీద ఈ బృహత్తర తాగునీటి పథకాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందని పవన్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 3.27 కోట్ల మంది ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించే లక్ష్యంతో 24,601 ఆవాసాల్లో 50,315 పనులను ఈ పథకం కింద చేపట్టనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన 'హర్ ఘర్ జల్ - జలజీవన్ మిషన్'కు 2019-24 మధ్య అధికారంలో ఉన్న ప్రభుత్వం తూట్లు పొడిచింది. రూ.26,000 కోట్ల విలువైన పనులకు ప్రతిపాదనలు పంపి, ఐదేళ్లలో కేవలం రూ.2,700 కోట్లు మాత్రమే ఖర్చు చేసి ఏ ఒక్క ప్రాజెక్టునూ పూర్తి చేయలేదు. ప్రజల తాగునీటి కష్టాలను ఏమాత్రం పట్టించుకోలేదు" అని దుయ్యబట్టారు. 2024లో ఈ పథకం ముగిసిపోవాల్సిన తరుణంలో, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తాను, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలిసి ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు సి.ఆర్. పాటిల్, నిర్మలా సీతారామన్‌లను కలిసి విజ్ఞప్తి చేశామని గుర్తుచేశారు. వారి సహకారంతో ఈ పథకాన్ని 2028 వరకు పొడిగించుకుని, పనులను వేగవంతం చేశామని తెలిపారు. "గత ప్రభుత్వం ఖర్చు చేయగా మిగిలిన పనులతో పాటు, ఇప్పటికే మేము రూ.4,500 కోట్ల విలువైన పనులను పూర్తి చేశాం. మీరు మాపై ఉంచిన నమ్మకమే మాకు శ్రీరామరక్ష" అని పవన్ పేర్కొన్నారు. తమది కక్షసాధింపుల ప్రభుత్వం కాదని, ప్రజాభివృద్ధిని మాత్రమే లక్ష్యంగా పెట్టుకుందని పవన్ స్పష్టం చేశారు. "దశాబ్దాలుగా తాగునీటి సమస్యతో అల్లాడుతున్న పులివెందుల నియోజకవర్గంలో అసంపూర్తిగా నిలిచిపోయిన పథకాలకు రూ.280 కోట్లు కేటాయించి 7 మండలాల్లోని 299 గ్రామాలకు నీరందిస్తున్నాం. అలాగే, వైసీపీ ఎంపీ ఉన్నప్పటికీ అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకు, పాడేరు నియోజకవర్గాల్లో రూ.2,500 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం. మాకు పార్టీలు కాదు, ప్రజల సమస్యలే ముఖ్యం" అని ఉద్ఘాటించారు. గత ప్రభుత్వ హయాంలో తమ పార్టీకి మద్దతిచ్చారనే కారణంతో ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని తాళ్లమాపురం గ్రామ ప్రజలను నాటి శాసనసభ్యుడు తీవ్రంగా అవమానించారని, వారి వినతిపత్రాన్ని కళ్లెదుటే నలిపి పడేశారని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ గ్రామాల అభివృద్ధి కోసం తక్షణమే రూ.3.5 కోట్లతో సీసీ రోడ్లు, తాగునీటి పథకాలను మంజూరు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి సమక్షంలో ప్రకటించారు. రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా మౌలిక వసతులను కల్పిస్తున్నామని గణాంకాలతో వివరించారు. "రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి 2024 వరకు నిర్మించిన వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్లు, రిజర్వాయర్ల సామర్థ్యానికి అదనంగా 50 శాతం నుంచి 175 శాతం వరకు కేవలం ఈ ఐదేళ్లలోనే నిర్మించబోతున్నాం" అని తెలిపారు. నీటిని అందించడం ప్రభుత్వ బాధ్యత అయితే, దాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సీఈసీ జ్ఞానేశ్ కుమార్ నిర్ణయాలపై పిటిషన్లు.. కేంద్రం, ఈసీకి సుప్రీంకోర్టు నోటీసులు

స్వీకరించిన సర్వోన్నత న్యాయస్థానం, ఈ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వానికి, భారత ఎన్నికల సంఘానికి (ఈసీఐ) నోటీసులు జారీ చేసింది. వారం రోజుల్లోగా తమ స్పందన తెలియజేయాలని ఆదేశించింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్లపై విచారణ జరిపింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, ఫారం 6లో మార్పులు వంటి పలు కీలక నిర్ణయాలను సీఈసీ జ్ఞానేశ్ కుమార్ మిగతా ఇద్దరు కమిషనర్ల ఆమోదం లేకుండా ఏకపక్షంగా తీసుకున్నారని పిటిషనర్లు ఆరోపించారు. ఎన్నికల సంఘం వంటి బహుళ సభ్యుల కమిషన్‌లో నిర్ణయాలు ఏకగ్రీవంగా లేదా మెజారిటీ ప్రాతిపదికన జరగాలని, కానీ ఇక్కడ అలా జరగలేదని వారు కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, ఈసీ తీసుకున్న నిర్ణయాలకు సంబంధించిన రికార్డులను పరిశీలిస్తామని స్పష్టం చేసింది. "రాజ్యాంగబద్ధమైన సంస్థలు చట్టానికి లోబడి పనిచేయాలి. ఒకవేళ తీసుకున్న నిర్ణయాలు చట్టవిరుద్ధమని తేలితే, వాటిని రద్దు చేస్తాం" అని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. అయితే, సీఈసీగా జ్ఞానేశ్ కుమార్ విధులకు ఆటంకం కలిగించేలా లేదా ఆయనను సస్పెండ్ చేసేలా ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడానికి కోర్టు నిరాకరించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం ఎన్నికల సంఘానికి ఉన్న అధికారాలను సీఈసీ ఒక్కరే కాకుండా, ముగ్గురు సభ్యుల కమిషన్ సంయుక్తంగా వినియోగించేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్లు తమ పిటిషన్‌లో కోరారు. ప్రస్తుతం సుప్రీంకోర్టు నోటీసులతో ఈ వ్యవహారంపై కేంద్రం, ఈసీ ఎలాంటి వివరణ ఇస్తాయనేది ఆసక్తికరంగా మారింది.

## మాజీ మంత్రి కారుమూరిని హైదరాబాద్ జైలు నుంచి విజయవాడ తరలింపు



ముసుగు సంస్థను ఏర్పాటు చేసి, 'సిగ్మా లాజిస్టిక్స్'తో ఒప్పందం కుదిర్చింది కూడా నాగేశ్వరరావేనని ఈడీ తేల్చింది. ఈ కుంభకోణం ద్వారా అక్రమంగా సంపాదించిన సొమ్ములో ఏకంగా 85 శాతం ఆయన కుమారుడు సునీల్, కోడలు కీర్తి బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా జమ అయినట్లు ఈడీ ఆధారాలు సేకరించినట్టు తెలుస్తోంది. ఈ నిధులను విజయవాడ, తణుకు నియోజకవర్గాల్లోని కారుమూరి క్యాంపు కార్యాలయాల నిర్వహణ, వాహనాలకు డీజిల్, ఇతర ప్రయాణ ఖర్చులకు వినియోగించినట్లు కూడా గుర్తించింది. ఈడీ దర్యాప్తులో వెల్లడైన అంశాలపై మరింత లోతుగా విచారణ జరిపేందుకు సిట్ అధికారులు ఇప్పుడు కారుమూరిని ప్రశ్నించనున్నారు.

# నంద్యాల పట్టణంలో పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసిన రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్





## విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, మౌలిక వసతుల పరిశీలన మంత్రి ఫరూక్ ప్రశ్నలకు చక్కగా సమాధానమిచ్చిన 10వ తరగతి విద్యార్థిని లక్ష్మీ ప్రసన్న కు సన్మానం

**నంద్యాల సిటీ బ్యూరో అక్టోబర్ 05 ( నంది పత్రిక )** రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి మరింత బలోపేతం చేసే కార్యాచరణలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్ సోమవారం నంద్యాల పట్టణంలోని పలు పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.

పట్టణంలోని హోలీ క్రాస్ హైస్కూల్, ఖలీల్ సిద్ధికి హైస్కూల్, సిద్ధికి ఎయిడెడ్ ప్రైమరీ స్కూల్ తదితర మూడు పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదులు, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి మౌలిక సదుపాయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులతో మాట్లాడి విద్యార్థుల హాజరు, పాఠశాల రోజువారీ నిర్వహణ మరియు ఎదుర్కొంటున్న సమస్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లోని విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడిన మంత్రి ఫరూక్ , వారి అభ్యసన స్థాయిలను తెలుసుకునేందుకు పలు ప్రశ్నలు వేశారు. ఖలీల్ సిద్ధికి హైస్కూల్ సందర్శన సందర్భంగా పదో తరగతి చదువుతున్న విద్యార్థిని లక్ష్మీ ప్రసన్నను మంత్రి ఫరూక్ పలు ప్రశ్నలు అడగగా, ఆ విద్యార్థిని ఏమాత్రం తడబడకుండా పుస్తకంలోని అంశాలను సమగ్రంగా వివరించింది. విద్యార్థిని ప్రతిభకు, ధైర్యానికి ముగ్ధుడైన మంత్రి ఫరూక్ , ఆమెను ప్రత్యేకంగా అభినందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం మధ్యాహ్నం భోజన పథకాన్ని పరిశీలించి నాణ్యమైన భోజనం విద్యార్థినిలకు అందిస్తున్నారా లేదా అని పరిశీలించాడు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగ సమగ్ర అభివృద్ధికి, నాణ్యమైన విద్యాబోధనకు కట్టుబడి ఉందని, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచడమే లక్ష్యంగా ఇటువంటి క్షేత్రస్థాయి పర్యవేక్షణలు నిరంతరం కొనసాగుతాయని మంత్రి ఫరూక్ తెలిపారు . పాఠశాలల సమస్యలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ సకాలంలో తగిన దిద్దుబాటు చర్యలు చేపడతామని ఆయన స్పష్టం చేశారు.

# వెంకట సుబ్బమ్మ మృతికి మన్నె సుబ్బారెడ్డి సంతాపం

### భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులు.. కుటుంబ సభ్యులకు పరామర్శ



**డోన్ – నంది పత్రిక అక్టోబర్ 5**డోన్ మండలం చిన్నమల్కాపురం గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు క్రిష్ణారెడ్డి సతీమణి, మాజీ సర్పంచ్ వెంకట సుబ్బమ్మ మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి చిన్నమల్కాపురం గ్రామానికి వెళ్లి ఆమె భౌతికకాయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వెంకట సుబ్బమ్మ భౌతికకాయంపై పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వెంకట సుబ్బమ్మ మృతి కుటుంబ సభ్యులతో పాటు గ్రామ ప్రజలకు తీరని లోటని మన్నె సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామ ప్రముఖులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపుతాం

### ఆళ్లగడ్డ పట్టణ సీఐ రాము



**ఆళ్లగడ్డ ప్రతినిధి అక్టోబర్ 5 నంది పత్రిక** ఆళ్లగడ్డ పట్టణంలో శాంతి భద్రతల సంరక్షణ, అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపుతామని ఆళ్లగడ్డ టౌన్ సీఐ రాము హెచ్చరించారు. సోమవారం ఆయన నూతన టౌన్ సీఐ గా పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ రోజు ఆళ్లగడ్డ సీఐగా భాధ్యతలు స్వీకరించడం జరిగిందన్నారు. గతంలో ఆత్మకూరు సీఐ గా పని చేసినప్పుడు పోలీసు ఉద్యోగాల కోసం శిక్షణ ఇవ్వగా ఐదు మంది అభ్యర్థులకు పోస్టింగ్ రావడం జరిగిందన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలో కూడా మంచి క్రీడా మైదానం ఉండడంతో తాము భవిష్యత్తులో ఇక్కడ కూడా పోలీస్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇచ్చి తీర్చిదిద్దుతామని సిఐ రాము తెలిపారు. ప్రజలు కేసుల విషయంలో ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా తమను సంప్రదిస్తే న్యాయం జరుగుతుందని సిఐ రాము వివరించారు.

# డ్రోన్ సిటీ ఫేజ్1 పనులను వేగవంతంగా పూర్తి చేయాలి :

### జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి



**నంది పత్రిక కర్నూలు బ్యూరో :** డ్రోన్ సిటీ ఫేజ్1 పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి ఏపిఐఐసి అధికారులను ఆదేశించారు.సోమవారం ఓర్వకల్లు మండలం కొమరోలు గ్రామంలో ఏర్పాటు చేయనున్న డ్రోన్ సిటీ మొదటి దశ పనులను కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డ్రోన్ సిటీ ఫేజ్1 కు సంబంధించి రోడ్లు, డ్రైయిన్ల నిర్మాణ పనులు ఒప్పందం ప్రకారం నెలాఖరులోగా పూర్తి చేయాలని కలెక్టర్ కాంట్రాక్టర్లను, సంబంధిత అధికారులను ఆదేశించారు.నీటి సరఫరా పనులను కూడా సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం, సంప్ పనులను మరో నెలన్నరలోగా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా నిర్దేశిత గడువులను పాటిస్తూ నాణ్యతతో పనులు పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, ఏపిఐఐసి జెడ్ ఎం మధుసూదన్ రెడ్డి, పరిశ్రమల శాఖ అధికారి సంజీవ రాజు, ఏపిఐఐసి అధికారి సందీప్ , ఓర్వకల్లు తహసిల్దార్ విద్యా సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను పై అధికారుల దృష్టికి తీసుకెళ్తాం

### జి జి హెచ్ సూపరింటెండెంట్ కె. వెంకటేశ్వర్లు



**కర్నూలు సిటీ నందిపత్రిక** కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో కాంట్రాక్ట్ ఉద్యోగులు తమ సమస్యలను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకెళ్లారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సూపరింటెండెంట్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు ఉద్యోగుల సమస్యలను సానుకూలంగా విని, వారి సమస్యలను పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# ఆసుపత్రి సేవలకు అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు

### జి జి హెచ్ సూపరింటెండెంట్ కె వెంకటేశ్వర్లు



**కర్నూలు సిటీ నందిపత్రిక** కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యల నేపథ్యంలో వారు ఆందోళనకు వెళ్లే అవకాశం ఉన్నందున, ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు అడ్మినిస్ట్రేషన్‌లోని వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అత్యవసర విభాగంతో పాటు అన్ని విభాగాల్లో వైద్య సేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. రోగులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.

# తోటి వారికి సహాయం చేయడమే మానవత్వానికి అసలైన నిదర్శనం.. ఎంపీ బస్తిపాటి నాగరాజు



**కర్నూలు సిటీ నందిపత్రిక** తోటి వారికి సహాయం చేయడమే మానవత్వానికి అసలైన నిదర్శనమని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. కల్లూరు ఫోటో అండ్ వీడియో ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత 13 సంవత్సరాలుగా 60 మందికి ప్రతి నెల 200 రూపాయలు చొప్పున కల్లూరులోని ఆదిత్య పాఠశాలలోఅందిస్తున్నారు. ఈనెల పింఛన్లను ఎంపీ నాగరాజు చేతుల మీదుగా అందించారు.. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ దివ్యాంగులకు ఫోటో మరియు వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ నాయకులు ప్రతినెల పింఛన్ అందిస్తూ సామాజిక కార్యక్రమం చేయడం హర్షించదగ్గ విషయం అన్నారు..13 సంవత్సరాలుగా ఈ కార్యక్రమం చేయడంతో పాటు కరోనా సమయంలో సైతం ఈ కార్యక్రమం నిర్వహించినందుకు ఫోటోగ్రాఫర్లను అభినందించిన ఎంపీ, ఈ కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకుపోయేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమం లో డిఎస్పీ మహబూబ్ బాష, కల్లూరు మండల ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.కే. బాష మరియు సభ్యులు పాల్గొన్నారు.



# మాజీ సర్పంచ్ వెంకట సుబ్బమ్మ మృతికి కోట్ల సుజాతమ్మ సంతాపం

### కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపిన మాజీ ఎమ్మెల్యే



**డోన్ – నంది పత్రిక అక్టోబర్ 5**డోన్ మండలం చిన్నమల్కాపురం గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి సతీమణి, మాజీ సర్పంచ్ వెంకట సుబ్బమ్మ మృతి పట్ల డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆమె మృతిచెందిన విషయం తెలుసుకున్న కోట్ల సుజాతమ్మ చిన్నమల్కాపురంలోని వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.అనంతరం వెంకట సుబ్బమ్మ మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను ఓదార్చి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. గ్రామానికి మాజీ సర్పంచ్‌గా వెంకట సుబ్బమ్మ అందించిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఆమె మృతి కుటుంబానికి, గ్రామ ప్రజలకు తీరని లోటని పేర్కొన్నారు.ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. వెంకట సుబ్బమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కోట్ల సుజాతమ్మ వెంట వలస రామకృష్ణ,లక్ష్మి నారాయణ,టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు తదితరులు ఉన్నారు.

# దసరా నవరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ



**రుద్రవరం ప్రతినిధి అక్టోబర్ 05 (నంది పత్రిక):** రుద్రవరం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో సోమవారం దసరా నవరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రికను ఆర్యవైశ్యులు ఆవిష్కరించారు. అంతకుముందు పూజారి విశ్వనాథ శర్మ పత్రికను అమ్మవారి వద్ద ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 11 నుంచి 21 వరకు శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది ప్రత్యేకంగా బిందె సేవ, పండుగ రోజే అమ్మవారి మెరువని ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వంకదార శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు నల్లగట్ల వెంకటేశ్వర్లు, కార్యదర్శి పాలూరి వెంకట సుబ్రహ్మణ్యం, కమిటీ సభ్యులు వెంకట సుబ్బ నరసయ్య, రమణ, సురేష్, కృష్ణమూర్తి, మోహన్ కృష్ణ, గిరి ప్రసాద్, సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ సర్పంచ్ వెంకట సుబ్బమ్మ మృతి పట్ల వై సి పి నేతల సంతాపం



**డోన్ – నంది పత్రిక అక్టోబర్ 5** డోన్ మండలం చిన్న మల్కాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి సతీమణి, మాజీ సర్పంచ్ వెంకట సుబ్బమ్మ మృతి పట్ల పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మాజీ ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ రాజకుమార్, బేతంచెర్ల మాజీ ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ మల్లంపల్లి రామచంద్రుడు, పీఏ ఉమామహేశ్వరరెడ్డి తదితరులు ఆమె మృతికి సంతాపం తెలిపారు.ఈ సందర్భంగా వారు చిన్న మల్కాపురంలోని కృష్ణారెడ్డి నివాసానికి వెళ్లి వెంకట సుబ్బమ్మ మృతదేహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వెంకట సుబ్బమ్మ మృతి పట్ల తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. వెంకట సుబ్బమ్మ గ్రామ సర్పంచ్‌గా పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశారని, గ్రామ అభివృద్ధిలో ఆమె సేవలు గుర్తుండిపోతాయని నాయకులు పేర్కొన్నారు. ఆమె మృతి కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్థులకు తీరని లోటని తెలిపారు.

# డోన్‌లో మెగా హెల్త్ క్యాంపు

**డోన్ – నంది పత్రిక అక్టోబర్ 5** డోన్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ నెల 6న మెగా హెల్త్ క్యాంపును నిర్వహించనున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హనీఫ్, డాక్టర్ రమ్య శిల్ప తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.ఈ క్యాంపులో వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు, నిపుణులైన వైద్యులచే ఉచితంగా వైద్య సలహాలు అందించనున్నట్లు తెలిపారు. సాధారణ ఆరోగ్య పరీక్షలు, రక్తపోటు, మధుమేహం, రక్తహీనత తదితర సమస్యలకు సంబంధించిన పరీక్షలు నిర్వహించే అవకాశం ఉందన్నారు. అవసరమైన వారికి తదుపరి చికిత్సపై సూచనలు, మందుల వినియోగంపై అవగాహన కల్పిస్తామని చెప్పారు. డోన్ పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు కోరారు. క్యాంపుకు వచ్చే వారు తమ పాత వైద్య నివేదికలు, ఉపయోగిస్తున్న మందుల వివరాలు వెంట తీసుకురావాలని సూచించారు. ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్యులను సంప్రదించడం ద్వారా అనేక అనారోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి చికిత్స పొందవచ్చని తెలిపారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఇలాంటి వైద్య శిబిరాలను భవిష్యత్తులో కూడా నిర్వహించనున్నట్లు ఆసుపత్రి అధికారులు వెల్లడించారు.

# రోడ్ ట్యాక్స్ చెల్లించని నాలుగు బస్సులపై చర్యలు

### నాలుగు బస్సులకు రూ.6.18 లక్షల జరిమానా.. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరిక

**డోన్ – నంది పత్రిక అక్టోబర్ 5** సాధారణ వాహనాల తనిఖీల్లో భాగంగా రోడ్ ట్యాక్స్ చెల్లించకుండా ఆంధ్రప్రదేశ్‌లో తిరుగుతున్న నాలుగు బస్సులను డోన్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా పన్నులు చెల్లించకుండా వాహనాలను నడుపుతున్నట్లు గుర్తించిన అధికారులు వాటిపై చర్యలు చేపట్టారు.తనిఖీల్లో పట్టుబడిన నాలుగు బస్సులకు కలిపి రూ.6,18,000 జరిమానా విధించినట్లు ఎంవీఐ క్రాంతికుమార్ తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వాహన యజమానులు నిర్ణీత రోడ్ ట్యాక్స్‌ను సకాలంలో చెల్లించి వాహనాలను నడపాలని సూచించారు. వాహనాల తనిఖీల సందర్భంగా రిజిస్ట్రేషన్ పత్రాలు, పన్నుల చెల్లింపు వివరాలు, అనుమతులు, ఫిట్‌నెస్ ధ్రువపత్రాలు తదితర అంశాలను పరిశీలిస్తున్నట్లు ఎంవీఐ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వాహనదారులు తమ వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలను సక్రమంగా ఉంచుకోవడంతో పాటు పన్నులను గడువులోగా చెల్లించాలని ఆయన సూచించారు. ప్రజా రవాణా వాహనాల విషయంలో ప్రత్యేకంగా నిబంధనలు పాటించాల్సిన అవసరం ఉందని, పన్ను ల ఎగవేతకు పాల్పడితే ఉపేక్షిం చేది లేదని ఎంవీఐ హెచ్చరిం చారు. రానున్న రోజుల్లోనూ తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు.



# ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం ఉండకూడదు అర్జీదారులు పూర్తిగా సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారాలు అందించాలి

### పీజీఆర్ఎస్ అర్జీలపై అధికారులు మరింత బాధ్యతతో వ్యవహరించాలి రీ ఓపెన్, ఇంప్రాపర్ రెడ్రెసల్ కేసులను పూర్తిగా తగ్గించాలి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి

**నంది పత్రిక కర్నూలు బ్యూరో :** ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా, అర్జీదారులు పూర్తిగా సంతృప్తి చెందేలా నాణ్యతతో కూడిన పరిష్కారాలను అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" గ్రబఎశ్రీఅఎ +తీఅవఝుఅఎవ =వఎతీవంయిశ్రీ ూఎర్వఎ – ్రా+=ా) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రజల నుండి వివిధ సమస్యలకు సంబంధించిన వినతులు స్వీకరించి, వాటి పరిష్కారంపై అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజా సమస్యల పరిష్కారం ప్రభుత్వ యంత్రాంగం యొక్క ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. పీజీఆర్ఎస్ ద్వారా అందుతున్న ప్రతి అర్జీని అధికారులు అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, నిర్ణీత గడువులోగా సమర్థవంతంగా పరిష్కరించాలన్నారు. సమస్య పరిష్కారంలో జాప్యం ఉండకూడదని పేర్కొన్నారు. పిటిషనర్లకు అందించే ఎండార్స్‌మెంట్‌లు స్పష్టంగా, సులభంగా అర్థమయ్యే విధంగా ఉండాలని సూచించారు. సమస్యను వెంటనే పరిష్కరించడం సాధ్యం కాని పరిస్థితుల్లో, అందుకు గల కారణాలను పూర్తిగా వివరించి, తీసుకోబోయే చర్యలపై కూడా పిటిషనర్లకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి, వాస్తవ పరిస్థితులను తెలుసుకొని సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలకు న్యాయం జరిగేలా వ్యవహరించాలని సూచించారు. పీజీఆర్ఎస్‌లో నమోదవుతున్న "రీ ఓపెన్" మరియు "ఇంప్రాపర్ రెడ్రెసల్" కేసుల శాతాన్ని పూర్తిగా తగ్గించే దిశగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో నాణ్యత, పారదర్శకత మరియు బాధ్యతాయుత వైఖరి కనిపించాలన్నారు.



**ఎస్సీ, ఎస్టీ వర్గాల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు**

కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రత్యేక ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. భూముల సమస్యలు, గృహ స్థలాలు, ఉపాధి, సంక్షేమ పథకాలు, విద్య, పెన్షన్లు, రహదారులు తదితర అంశాలపై ప్రజలు వినతులు సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, అభ్యున్నతికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులైన లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు సమర్పించిన వినతులను సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం లేకుండా, శాఖలవారీగా పురోగతిని పర్యవేక్షిస్తూ సమస్యలు పరిష్కారమయ్యే వరకు అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటనారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ, రామసుబ్బయ్య, శివ ప్రసాద్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ ఉత్సవం సేవా శంకల్ప్ అభియాన్

### 7 అంగన్వాడీ సెంటర్స్ తనిఖీ చేసి అంగన్వాడీ టీచర్స్ మరియు ఆయాలు చేసిన సేవలను గుర్తించి అభినందించింది ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్ పర్సన్, నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కమ్మరి పార్వతమ్మ



**కర్నూలు సిటీ నందిపత్రిక** కల్లూరు మండలం, 48వ వార్డు వీకర్ సెక్షన్ కాలనీ అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన "అంగన్వాడీ ఉత్సవం – సేవా సంకల్ప్ అభియాన్" కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్ పర్సన్, నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కమ్మరి పార్వతమ్మ పాల్గొన్నారు. చైర్ పర్సన్ పార్వతమ్మ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారం, విద్యా బోధన, ఆరోగ్య సేవలు తదితర అంశాలను పరిశీలించారు. చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు అంగన్వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆమె పేర్కొన్నారు.అంగన్వాడీ కార్యకర్తలు అందిస్తున్న సేవలను అభినందించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయాలని సూచించారు. తల్లిదండ్రులు కూడా అంగన్వాడీ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

48 వ వార్డు 49 వ వార్డు లలో ఏడు అంగన్వాడీ స్కూల్ టీచర్లను, ఆయాలను

1).విజయలక్ష్మి,చాముండేశ్వరి 2). కేజియా,సుంకలమ్మ. 3). అభిజమ్మ , సుజాత.

4). లలిత, అంజలి. 5).రమీజాబీ,మద్దమ్మ. 6). మాధవి,సావిత్రి. 7). సరోజమ్మ, రమాదేవి. వారి సేవలకు కృతజ్ఞతగా శాలువ, పూలమాలలతో సత్కరించిన చైర్ పర్సన్ పార్వతమ్మ సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో 49వ వార్డు ఇన్చార్జి సుతారు రాఘవేంద్ర , అంగన్వాడీ స్కూల్ సూపర్వైజర్ వి.అనూష, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెడ్ మాస్టర్ సోమలింగా రెడ్డి, స్కూల్ అసిస్టెంట్ సుజాతమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు,స్థానిక పిల్లల తల్లితండ్రులు, తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ కారకులైన వేదాంతు లెర్నింగ్ సెంటర్ పై ఎంక్వయిరీ చేయాలి

### ఏఐఎస్ఎఫ్ నాయకులు జిల్లా కలెక్టర్ కు వినతి విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వేదాంతు లెర్నింగ్ సెంటర్ పై చర్యలు తీసుకోవాలి: ఏఐఎస్ఎఫ్

**కర్నూలు సిటీ నందిపత్రిక** కర్నూలు నగరంలోని వేదాంతు లెర్నింగ్ సెంటర్ లో విద్యార్థులకు హాస్టల్లో 15మంది పైన విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అవ్వడానికి కారకులైన యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలి సోమవారం సునయన అరిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి కి అఖిల



భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏ ఐ యస్ యఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి ఎస్. ఈరేష్ బి.రంగస్వామి మాట్లాడుతూ వేదాంతు లెర్నింగ్ సెంటర్ లో గత నెలలో రోజు నుంచి విద్యార్థులు అన్నం బాగోలేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

విద్యార్థుల ఆరోగ్య విషయం లో కళాశాల యాజమాన్యం వారు ఏ మాత్రం కూడా పట్టించుకోవడం లేదన్నారు. 1.10.2026 రోజున 15మంది విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ కావడంతో కళాశాల యాజమాన్యం తల్లిదండ్రులకి ఫోన్ చేసి మాయమాటలు చెప్పి, విద్యార్థులను ఇంటికి పంపారన్నారు. కళాశాల యాజమాన్యం వారు తల్లిదండ్రులకు కళాశాలతో పాటు హాస్టల్ వసతి కూడా ఉందని, చెప్పి తీరా చేరక హాస్టల్లో భోజనం పెట్టకుండా బయట హోటల్ క్యాంటీన్ నుంచి ఫుడ్ తీపిస్తూ, పభం గడుపుతున్నారు. ఫీజులు మాత్రం 2 లక్షల వరకు కట్టించుకోని విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కాలేజీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ని వారు కోరారు. కలెక్టర్ వెంటనే స్వదిస్తూ తక్షణమే పర్యవేక్షణ చేపట్టి కాలేజీలో ఫుడ్ పాయిజన్ అవడానికి కారకులైన వారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు ఏ ఐ యస్ యఫ్ నగర అధ్యక్షులు ఎస్. అభిషేక్, జిల్లా సమితి సభ్యులు వీరంజినేయులు, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు

## పరిశ్రమల స్థాపనలో వేగం పెంచాలి

### జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

**నంది పత్రిక కర్నూలు బ్యూరో :** జిల్లాలో పరిశ్రమల స్థాపన ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి పరిశ్రమల శాఖ అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ లో పరిశ్రమల స్థాపన పురోగతి పై కలెక్టర్ పరిశ్రమల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అమలులో ఉన్న




అన్ని రకాల భారీ పరిశ్రమలకు అవసరమైన అనుమతులను సకాలంలో మంజూరు చేసి, పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఏపిఐఐసి, పరిశ్రమల శాఖ, నెడ్ క్యాప్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులను ఆదేశించారు. పరిశ్రమల స్థాపనకు సంబంధించి కాలుష్య నియంత్రణకు అవసరమైన అన్ని రకాల అనుమతులను త్వరితగతిన మంజూరు చేయాలని కలెక్టర్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఓర్వకల్లు ఇండస్ట్రియల్ ఏరియాలో ఫార్మా పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన ఎన్విరాన్మెంటల్ క్లియరెన్స్‌లను త్వరగా మంజూరు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.ఫౌండేషన్ స్టోన్ వేయడానికి సిద్ధంగా ఉన్న పరిశ్రమలను గుర్తించి అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో ఏపిఐఐసి జెడ్ ఎం మధుసూదన్ రెడ్డి, పరిశ్రమల శాఖ అధికారి సంజీవ రాజు, తదితరులు పాల్గొన్నారు.

# విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం .

### ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమానికి 109 ఫిర్యాదులు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదుల పై త్వరితగతిన స్పందించి, పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించిన జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీయస్

**కర్నూలు సిటీ నందిపత్రిక** కర్నూల్ కొత్తపేటలోని కర్నూల్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి సోమవారం మొత్తం 109 ఫిర్యాదులు వచ్చాయి.



**వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని ...**

1) కాంట్రాక్ట్ బేసిస్ పై ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి, కర్నూలు కు చెందిన ఇనాయతుల్లా రూ. 3 లక్షలు తీసుకొని మోసం చేశాడని కర్నూలు మండలం, బి. తాండ్రపాడుకు చెందిన రమేష్ ఫిర్యాదు చేశారు. 2) కర్నూలు రైల్వేస్టేషన్ లో బంగారం ఇస్తామని చెప్పి రూ. 2 లక్షలు తీసుకొని , చిన్న చిన్న ఇత్తడి బిల్లలు ఇచ్చి మోసం చేసిన ఇద్దరు వ్యక్తుల పై చర్యలు తీసుకోవాలని నంద్యాల, బొమ్మల సత్రం కు చెందిన దయా శంకర్ ఫిర్యాదు చేశారు. 3) నా కుమారులు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని కర్నూలు ఓన్ టౌన్, సున్నం బట్టీ విధికి చెందిన నాగశేషమ్మ ఫిర్యాదు చేశారు. 4) ప్లాట్ అమ్మిస్తానని ఒక బ్రోకర్ , అగ్రిమెంట్ పత్రాలపై సంతకాలు చేయించుకుని డబ్బులు ఇస్తామని చెప్పి మోసం చేశాడని కోడుమూరు మండలం, పులకుర్తి గ్రామానికి చెందిన నడిపి రంగన్న ఫిర్యాదు చేశారు. 5) నా పై మరియు నా కుమారుల పై బెదిరింపులకు పాల్పడుతున్న వారి నుండి రక్షణ కల్పించాలని కర్నూలు, ఖడక్ పురా కు చెందిన జలీల్ అహ్మద్ ఫిర్యాదు చేశారు. 6) స్టేట్ రిపోర్టర్ అని, లాయర్ నని , లోన్లు ఇప్పిస్తామని చెప్పుకుంటూ ఎమ్మిగనూరు, డోన్, ఆదోనిలలో తిరుగుతూ గ్యాంగ్ తో డబ్బులు డిమాండ్ చేస్తూ క్రిష్ణగిరి మండం, కోటూరు కొండ, పులిచెర్ల గ్రామంలో ఉన్న నా పొలాన్ని విడిచిపెట్టాలని , నకిలి సర్టిఫికెట్లు , అగ్రిమెంట్లు సృష్టించి మోసాలకు పాల్పడుతున్న వ్యక్తి పై చర్యలు తీసుకోవాలని మంత్రాలయం మండలం, చిలకలడోణ గ్రామానికి చెందిన దాసరి మహేష్ ఫిర్యాదు చేశారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటి పై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ హామీ ఇచ్చారు.ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా , సిఐలు శివశంకర్, పార్థసారథి, మస్తాన్ వలి లు పాల్గొన్నారు.

## సామాజిక సేవలకు గుర్తింపు.. ఏఈ నాగరాజు గౌడ్‌కు డీఎస్పీ శ్రీనివాసులు అభినందనలు




**డోన్ : నంది పత్రిక అక్టోబర్ 5**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విజిలెన్స్ కమిటీ సభ్యుడిగా నామినేట్ అయిన ఏఈ నాగరాజు గౌడ్‌ను డోన్ డీఎస్పీ శ్రీనివాసులు అభినందించారు. ఈ సందర్భంగా ఆయనను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. డీఎస్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ.. తాను డోన్‌లో ఎస్సైగా పనిచేసినప్పటి నుంచి ఏఈ నాగరాజు గౌడ్‌ను పరిశీలిస్తున్నానని, దాదాపు 30 ఏళ్లుగా ఆయన నిర్వహిస్తున్న వివిధ సామాజిక సేవా కార్యక్రమాలను ప్రత్యక్షంగా చూస్తున్నానని తెలిపారు. ప్రజా సమస్యలపై స్పందిస్తూ, వినియోగదారుల హక్కుల పరిరక్షణ, సామాజిక చైతన్యం వంటి కార్యక్రమాల ద్వారా నాగరాజు గౌడ్ అందిస్తున్న సేవలు అభినందనీ యమన్నారు.ఆయన సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వ విజిలెన్స్ కమిటీ సభ్యుడిగా ఎంపిక చేయడం సంతోషకరమైన పరిణామమన్నారు. ఈ పదవిలో సమర్థవంతంగా సేవలందిస్తూ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని, భవిష్యత్తులో జాతీయస్థాయి పదవులు పొందాలని డీఎస్పీ శ్రీనివాసులు ఆకాంక్షించారు. తనను అభినందించిన డీఎస్పీ శ్రీనివాసులకు ఏఈ నాగరాజు గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. తన సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి ప్రోత్సహిస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

## హిందూ స్మశాన వాటికను అభివృద్ధి చేసి, కంచె ఏర్పాటు చేయాలని

### రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్‌కు వినతిపత్రం అందజేత

**నంద్యాల సిటీ బ్యూరో అక్టోబర్ 05 ( నంది పత్రిక )**

నంద్యాల పట్టణ పరిధిలోని పొన్నాపురం గ్రామం, బసవతారక నగర్ (పొన్నాపురం కాలనీ) పరిసరాల్లో ఉన్న హిందూ స్మశాన వాటికను సమగ్రంగా అభివృద్ధి చేయాలని, ఆక్రమణలను అరికట్టి రక్షణ కంచె (ఫెన్సింగ్) ఏర్పాటు చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్‌కు వినతిపత్రం సమర్పించారు. నంద్యాలలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో 22వ వార్డు టీడీపీ ఇంచార్జి షేక్ మహమ్మద్ రఫీ (మున్నా) ఆధ్వర్యంలో స్థానిక నాయకులు, స్మశాన వాటిక కమిటీ సభ్యులు మంత్రి ఫరూక్ ని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా షేక్ మహమ్మద్ రఫీ (మున్నా) మాట్లాడుతూ కాలనీలోని హిందూ స్మశాన వాటిక స్థలం ఆక్రమణలకు గురవుతోందని అన్నారు . రెవెన్యూ అధికారులతో పూర్తి స్థాయిలో సర్వే చేయించి, నిర్దేశిత స్థలాన్ని స్మశాన వాటికకు కేటాయించాలని కోరారు. చుట్టూ పటిష్టమైన కంచె నిర్మించడంతో పాటు తాగునీరు, విద్యుత్, అంతర్గత రహదా రులు వంటి ప్రాథమిక సౌకర్యాలు కల్పించి అభివృద్ధి చేయా లని మంత్రి ఫరూక్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలపై సాను కూలంగా స్పందించిన మంత్రి ఫరూక్, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనార్దన్ గౌడ్, ఖాజా శంకర్, మా భాష మరియు హిందూ స్మశాన వాటిక కమిటీ సభ్యులు జాకటి శేఖర్, పుట్టా నాగరాజు, రమేష్ అయ్య, శ్రీరాములు బాల్లవరం, ఎస్. శ్రీహరి, జి. వీరకుమార్, ఆర్. వెంకటరాయుడు, కె. శేషు గౌడ్, పున్నయ్య, నాగ మద్దిలేటి, ఎం. వెంకటరమణ, దాసరి వెంకటేశ్వర్లు, రమణ చాకలి, బాదుల్లా, ఓ. పామన్న, ఎన్. సుబ్బయ్య, కొత్తూరు ఎస్వీ ప్రసాద్, ఓ. అంకన్న, నాగేశం చాకలి, పుల్లయ్య, టి. బాలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# అంగన్వాడీ ఉత్సవంతో తల్లులు, చిన్నారుల ఆరోగ్యంపై అవగాహన

## పౌష్టికాహారం, పరిశుభ్రత, ఆరోగ్య సంరక్షణపై అవగాహన

### టీడీపీ కర్నూలు జిల్లా అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ

**కర్నూలు సిటీ నందిపత్రిక** దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ , రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు అనేక పౌష్టికాహార పథకాలను అమలు చేస్తున్నామని కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ తెలిపారు. సేవా సంకల్పం అభియాన్‌లో భాగంగా మండగిరి, ఇంద్రనగర్ అంగన్వాడీ కేంద్రాల్లో "అంగన్వాడీ ఉత్సవం పౌష్టికాహారం మరియు ఆరోగ్య అవగాహన కార్యక్రమం" కృష్ణమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్డీయే కూటమి నాయకులు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణమ్మ అంగన్వాడీ కేంద్రాల ప్రాముఖ్యతను వివరిస్తూ.. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉండటంతో పాటు చిన్నారుల ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం

అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న టేక్ హోమ్ రేషన్ (టీ హెచ్ ఆర్ )లో భాగంగా నెలకు అందించే పౌష్టికాహార వివరాలను వివరించారు.



- 3 కిలోల బియ్యం- 1 కిలో కందిపప్పు
- 450 గ్రాముల నూనె- 13 కోడిగుడ్లు - 2.5 లీటర్ల పాలు

అలాగే రోజువారీ పంపిణీలో భాగంగా గుడ్లు, పాలు క్రమం తప్పకుండా అందజేస్తున్నట్లు తెలిపారు.

ఆరోగ్యం పరిశుభ్రతపై అవగాహన గర్భిణులు తప్పనిసరిగా ప్రసవ పూర్వ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, బాలింతలు ప్రసవానంతర ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కృష్ణమ్మ సూచించారు. చిన్నారులకు సకాలంలో టీకాలు వేయించడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం,

పౌష్టికాహారం అందించడం ద్వారా ఆరోగ్యకరమైన భవిష్యత్తును నిర్మించవచ్చని తెలిపారు. చిన్నారుల ఆరోగ్యం, ఎదుగుదల, పరిశుభ్రతతో పాటు తల్లులకు అందుతున్న అంగన్వాడీ సేవలపై సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ లోకేశ్వరి, సూపర్‌వైజర్ భార్గవి, టీచర్ హైమవతి, మాజీ ఎంపీపీ మురళి, నాయకులు బాబురావు, బెస్త ఓంకార్, దేవేంద్ర, ఉపేంద్ర, అబ్దుల్, రేవన్ తదితరులు పాల్గొన్నారు.

# యువత రాజకీయాల్లోకి రావాలి:

### సాదుల పవన్ కుమార్



**నంగునూరు, సెప్టెంబర్ 05** యువత రాజకీయాల్లోకి రావాలని, దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని సిద్దిపేట జిల్లా యూవజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సాదుల పవన్ కుమార్ అన్నారు. నంగునూరు మండల కేంద్రంలో ఆయన ఆధ్వర్యంలో యువజన కాంగ్రెస్ మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాదుల పవన్ కుమార్ మాట్లాడుతూ.. మండల, గ్రామ స్థాయిలో యువజన కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో యువతను పార్టీ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయాలని అన్నారు. జిల్లాలో యువజన కాంగ్రెస్ నిర్మాణాన్ని పూర్తి చేసి, మండలాల వారీగా బలమైన నాయకత్వాన్ని తయారు చేయాలని చెప్పారు. యువజన కాంగ్రెస్ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని సాదుల పవన్ కుమార్ సూచించారు. యువజన కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షులు ఎండీ వాహబ్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని కోరారు. ముఖ్యంగా యువత కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. వివరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ చైర్మన్ రాశిద్, ఆత్మా కమిటీ జిల్లా డైరెక్టర్ అజ్మత్, జిల్లా మైనారిటీ నాయకులు ఆతిఫ్, యువజన నాయకులు మంగళారపు వెంకటేష్, సిరం బాను, సాయికుమార్,మహేష్ ,అఖిల్,నవీన్, రాజు, విగ్నేష్, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కర్నూల్ నగరం లో రైతాంగ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ విగ్ర ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాలని వినతి

### ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి సి. గురుశేఖర్



**కర్నూలు సిటీ నందిపత్రిక** కర్నూల్ పార్లమెంట్ సభ్యులు బస్తి పాటినాగరాజు ని పంచలింగాలలోని తన నివాసంలో మరియు జిల్లా కలెక్టర్ కార్యాలయం నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నందు జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమార్ కి ఏపీ రజక వృత్తిదారుల సంఘం కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సి.గురు శేఖర్, కర్నూల్ న్యూ సిటీ కార్యదర్శి సి. శేషాద్రి, జిల్లా కమిటీ సభ్యులు రేమట రామాంజనేయులు, జిల్లా అధ్యక్షులు సిహెచ్. శ్రీనివాసులు, ఓల్డ్ సిటీ కార్యదర్శి సి. జయమ్మ, జిల్లా కమిటీ సభ్యులు పుష్ప, ఎల్లయ్య, నగర నాయకులు మద్దిలేటి, రమేష్, రాజు, కలసి కర్నూల్ నగరంలో ఐలమ్మ విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని వినతి పత్రం ఇవ్వడం జరిగింది, ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి సి. గురుశేఖర్ మాట్లాడుతూ జిల్లాలో 40000 మంది రజకులు జీవనం కొనసాగిస్తున్నారు రైతాంగ సాయుధ పోరాట వీరనారి ఐలమ్మ విగ్రహం ఏర్పాటు కొరకు స్థలాన్ని కేటాయించాలని మీకు ఏపీ రజక వృత్తిదారుల సంఘం తరఫున విజ్ఞప్తి చేస్తున్నాము నిజాం నవాబులకు వ్యతిరేకంగా దున్నేవాడికే భూమి కావాలని రజక సామాజిక వర్గంలో పుట్టి బానిసత్వానికి వెట్టిచాకిరికి వ్యతిరేకంగా పోరాడిన వీరనారి ఎంతోమంది భూమిలేని వారికి భూమి హక్కు పొందేలా పోరాడిన వీర వనిత చాకలి ఐలమ్మ కావున చాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాటు చేసుకోవడం కొరకు అవకాశం కల్పించాలని వారు కోరారు.



# అమరావతి నగర్ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తాం.

### 23 లక్షల50 వేల రూపాయలు నిధులతో సిసి రోడ్లు నిర్మాణం

### మాజీ కౌన్సిలర్.లలితమ్మ



**ఆదోని నంది పత్రిక ప్రతినిధి** ఎమ్మెల్యే డాక్టర్ పివి పార్థసారథి గారి ఆదేశాల మేరకు మాజీ కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ ఆధ్వర్యంలో టిడిపి నాయకులు మహమ్మద్,జనసేన పట్టణ అధ్యక్షులు రేణువర్మ ముఖ్య అతిథులుగా పాల్గొని 23లక్షల 50వేల నిధులతో 295మీటర్లు నూతన సిసి రోడ్డు నిర్మాణము కొరకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ మాట్లాడుతూ గత కౌన్సిలర్ ఎన్నికల సందర్భంగా ప్రచారము కొరకు వచ్చినప్పుడు మా ప్రజలు సిసి రోడ్లు డ్రైనేజీలు లేక చాలా ఇబ్బందులు పడుతున్నామని అడగడం జరిగింది. మేము గెలిచిన తరువాత తప్పకుండా మీకు రోడ్లు డ్రైనేజీలు వేయిస్తామని మాట ఇచ్చామని కొన్ని కారణాల వలన ఆలస్యం అయిందని అమరావతి నగర్ ప్రజలు మిమ్మల్ని మన్నించాలి లలితమ్మ కోరారు. ఆలష్యం అయిన పర్వాలేదు మీరు ఇచ్చిన మాట నిలబెట్టుకుని పనులు ప్రారంభించారు మాకు చాలా సంతోషంగా ఉందని పూజకు హాజరైన మహిళలంతా లలితమ్మ కృతజ్ఞతలు తెలిపారు.

# మహా వరుణ యాగం వరుణ జపం నిర్వహణ.





**బేతంచెర్ల అక్టోబర్ 5 ( నంది పత్రిక ).** నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలం ఆర్ఎస్. రంగాపురం గ్రామ పొలిమేరలలో వెలసిన ప్రముఖ వైష్ణవ క్షేత్రం లక్షలాది మంది భక్తుల ఆరాధ్య దైవమగు శ్రీ మద్దులేటీ నరసింహ స్వామి మరియు శ్రీ మహాలక్ష్మమ్మ అమ్మ వారు కొలువై ఉన్న శ్రీ మద్దులేటీ స్వామి ఆలయంలో ఉప కమీషనర్ & దేవాలయ కార్య నిర్వహణ అధికారి ఎం. రామాంజనేయులు మరియు దేవాలయ ధర్మ కర్తల మండలి చైర్మన్ ఉన్నం ఎల్ల నాగయ్య ఆధ్వర్యంలో,ధర్మ కర్తల మండలి సభ్యులతో,దేవాలయ పురోహితులతో,ఆలయ సిబ్బందితో కలిసి అక్టోబర్ 6 వ తేది మంగళవారం ఉదయం 7 గంటల నుండి లోక కళ్యాణార్థం దేవాలయం నందు మహా వరుణ యాగం వరుణ జపం నిర్వహించ బడునని సోమవారం తెలిపారు.

# పోషకాహారం ప్రాధాన్యతపై అవగాహన



**మహానంది అక్టోబర్ 05 (నంది పత్రిక):-** మహానంది మండలం సీతారామపురం గ్రామంలోని అంగన్వాడి కేంద్రం -1లో 'అంగన్‌వాడీ ఉత్సవం' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అంగన్వాడి టీచర్ ఎస్. స్వర్ణ గౌరి గర్భవతులు, బాలింతలకు పోషకాహారం ప్రాధాన్యతపై ప్రత్యేక అవగాహన కల్పించారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చు అన్నారు. ఆరోగ్యకరమైన సమాజం కోసం తల్లులు, పిల్లలు ఎలాంటి పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎంపీపీ స్కూల్ హెచ్ ఎం.లక్ష్మి,మహిళా సంరక్షణ కార్యదర్శి దస్తగిరమ్మ, ఏఎన్ఎం బి.లక్ష్మి పాల్గొన్నారు.

# కర్నూల్ జిల్లా వాప్తంగా ఉన్నటువంటి అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలి.

### అఖిలభారత రైతు కూలి సంఘం , సిపిఐ నాయకులడిమాండ్

**నంది పత్రిక ఆదోని ప్రతినిధి** ఆదోని పట్టణం నందు సోమవారం ఆర్డీవోఆఫీస్ ఎదుట అఖిలభారత రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించి ఆర్డిఓ మేడం గారికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు ప్రసాద్, ఏఐకేఎస్ సిపిఐరైతు సంఘం నాయకులు కల్లుబావి రాజు మాట్లాడుతూ కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి 27 మండలంను 15 మండాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించడం చాలా దుర్మార్గమైన పరిస్థితి అని అన్నారు. ఎందుకంటే కరువు మండలాలుగా ప్రకటించక ముందు అన్ని మండలం రైతులకు ఖరీఫ్ నష్టపరిహారం అన్ని మండల రైతులకు వర్తిస్తాయని కలెక్టర్ సిరి మేడం గారే పత్రిక ప్రకటనలో తెలియజేయడం వల్లే ప్రతి ఒక్క రైతు ఇంట్లో డబ్బులు లేకపోయినా అపో,సాప్పో చేసి ఎకరాకు 2000 చొప్పున ఖరీఫ్ నష్టపరిహారం కట్టిన కేవలం 15 మండలాలు మాత్రమే కరువు మండలంగా ప్రకటించి 12 మండలాలను ఎందుకు కరువు మండలం గా ప్రకటించలేదని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ప్రసాద్ అన్నారు. కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి అధికారులు ప్రతి ఒక్క మండలంకు సర్వే చేయ కుండా సొంత నిర్ణయాలతో డ్రోన్ల సర్వే ద్వారా వర్షపా తాన్ని ఎలా నిర్ధారిస్తారని మండిపడ్డారు. తక్షణమే అధికారులు ఏ మండలమైతే కరువు ప్రాంతంగా ఉందో ఆ మండలంకు ప్రతి ఒక్క రైతు పొలాల్లోకి వెళ్లి సర్వే నిర్ధారణ చేసిన తర్వాతేనే కరువు మండ లంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అంతేకా కుండా రైతులు పంటలు పండించడానికి ప్రతి ఒక్క బ్యాంకులో రుణాలు తీసుకోవడం జరిగింది. ఆ రుణాలు రెండు లక్షల ఎక్కువ తీసుకున్నటువంటి ప్రతి ఒక్క రైతుకు రుణాల మాఫీ చేయాలని అదే విధంగా వలసలు వెళుతున్నటువంటి రైతులకు ఉపాధి హామీ పథకం కింద వందరోజుల పని దినాన్ని కల్పించాలి. అంతేకాకుండా ప్రతి ఒక్క రైతు ఎకరాకు 50 వేలు రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలి అన్నారు. తక్షణమే రైతాంగ సమస్యలను పరిష్కరించలేని ఎడల రైతులందరినీ ఐక్యమత్యం చేసుకొని ఉద్యమానికి శ్రీకారం చుడతామని అన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంకప్ప,జిల్లా ఉపాధ్యక్షులు నరసన్న,పి డి ఎస్ యు జిల్లా అధ్యక్షులు అఖండ జిల్ మండల అధ్యక్షులు మల్లికార్జున,గోవర్ధన్, వెంకటేష్,రవి,ఈరన్న, తదితర రైతులు పాల్గొన్నారు.



# తక్కువ ధరలకే మందులు అందుబాటులోకి రానున్నాయి.

### రుద్రవరంలో పశు ఔషధ విక్రయశాల నిర్మాణం



**రుద్రవరం ప్రతినిధి అక్టోబర్ 05 (నంది పత్రిక):** గొర్రెల పెంపకం దారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం మార్కెట్లో కంటే 50% ధరలకే మందులు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటుందని తొందర్లోనే తక్కువ ధరలకే మందులు అందుబాటులోకి రానున్నాయి. రుద్రవరంలోని ప్రాంతీయ పశువైద్యశాల దగ్గర పశు ఔషద విక్రయిశాలను నిర్మిస్తున్నట్లు ఏడిఏ మనోరంజన్ ప్రతాప్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పశువులు మూగజీవాల రైతులకు ప్రభుత్వం సబ్సిడీ కింద మందులు సరఫరా చేస్తుందని తెలిపారు. ప్రభుత్వ సరఫరా చేసే మందులలో పశు ఔషధ విక్రయశాల ద్వారా పశువులు మూగజీవాల రైతులకు మార్కెట్ ధరలకంటే 50% తక్కువ దరకే విక్రయించడం జరుగుతుందన్నారు. అతి త్వరలోనే ఈ పశువు ఔషధ విక్రయశాలలో నిర్మించడం కొరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని వారం 10 రోజుల్లో విక్రయిశాలను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. పశు ఔషధ విక్రయశాలను ప్రాథమిక గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం అధ్యక్షులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రుద్రవరం మండలంలో 8 ప్రాథమిక గొర్రెల పెంపకం దారుల సహకార సంఘాలు ఉన్నాయని, బీరవోలు, యల్లావత్తుల, శ్రీరంగాపురం, భూమా నాగిరెడ్డిపల్లె, టీ లింగందిన్నె, రుద్రవరం గ్రామాలలో ఈ సంఘాలు ఉన్నాయని తెలిపారు. ఈ సంఘాల అధ్యక్షులు సభ్యులు పశు ఔషధ విక్రయశాలలో మందులు కొనుగోలు కొనుగోలు చేసేందుకు మూగజీవాల రైతులకు వివరించడం జరుగుతుందని ఏడిఏ తెలిపారు.

# శాంతిరాం కళాశాల లో మనస్సును నియంత్రించే కళ అనే అంశంపై అవగాహన సదస్సు

**నంద్యాల ప్రతినిధి. అక్టోబర్ 05 . (నంది పత్రిక ):** శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాల (అటానమస్), నంద్యాలలోని బేసిక్ సైన్సెస్ విభాగం, ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ సహకారంతో విద్యార్థుల సమగ్ర వ్యక్తిత్వ వికాసాన్ని లక్ష్యంగా చేసుకుని "ఆర్ట్ ఆఫ్ మైండ్ కంట్రోల్" (మనస్సును నియంత్రించే కళ) అనే అంశంపై ఒకరోజు వ్యక్తిత్వ వికాస కార్యక్రమాన్ని సోమవారం సెమినార్ హాల్‌లో నిర్వహించింది. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం.వి. సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు విద్యా విషయాల్లో ప్రతిభ కనబరచడంతో పాటు తమ ఆలోచనలు, భావోద్వేగాలు మరియు ప్రవర్తనపై నియంత్రణ కలిగి ఉండటం ఎంతో అవసరమని తెలిపారు. ఆధునిక పోటీ ప్రపంచంలో విద్యార్థులు అనేక రకాల ఒత్తిళ్లను ఎదుర్కొంటున్న నేపథ్యంలో మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, సానుకూల ఆలోచనా విధానం మరియు భావోద్వేగ సమతుల్యతను పెంపొందించుకోవాలని సూచించారు. మనస్సును సక్రమంగా నియంత్రించగలిగిన వ్యక్తి తన లక్ష్యాలను స్పష్టంగా నిర్దేశించుకుని వాటిని సాధించే దిశగా ముందుకు సాగగలడని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బేసిక్ సైన్సెస్ విభాగాధిపతి డా. బి. శేషయ్య మాట్లాడుతూ, విద్యార్థుల వ్యక్తిగత, విద్యా మరియు వృత్తిపరమైన అభివృద్ధిలో మానసిక నియంత్రణ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. విద్యార్థులు తమలోని ప్రతిభను గుర్తించి, ప్రతికూల ఆలోచనలను అధిగమించి, సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని సూచించారు. ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం మరియు భావోద్వేగ సమతుల్యతను పెంపొందించుకోవడం ద్వారా విద్యార్థులు తమ సామర్థ్యాలను మరింత సమర్థవంతంగా వినియోగించుకోగలరని ఆయన తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య వనరుల వ్యక్తిగా శ్రీ హరి (జహ్నుద్వీప నితై దాస్) హాజరయ్యారు. ఆయన బాసరలో మెకానికల్ ఇంజినీరింగ్ పట్టభద్రుడు కాగా,సంస్థలో రెండు సంవత్సరాలు అసిస్టెంట్ ఇంజినీర్‌గా పనిచేసిన అనుభవం కలిగి ఉన్నారు. విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, మనస్సును నియంత్రించుకోవడం అనేది వ్యక్తిత్వ వికాసానికి మాత్రమే కాకుండా విద్యా, వృత్తి మరియు వ్యక్తిగత జీవితంలో విజయానికి కూడా అత్యంత ముఖ్యమైన అంశమని వివరించారు.



# శ్రీ మద్దులేటి స్వామి ఆలయంలో వరుణ యాగం.



**బేతంచెర్ల అక్టోబర్ 5 ( నంది పత్రిక ).** బేతంచర్ల మండలం ఆర్.ఎస్. రంగాపురం గ్రామ పరిధిలో వెలసిన శ్రీ మద్దిలేటి లక్ష్మి నరసింహ స్వామి దేవాలయం నందు అక్టోబర్ 6 వ తేది మంగళవారం నిర్వహించే వరుణ యాగం ప్రత్యేక పూజా కార్యక్రమంలో డోన్ నియోజక వర్గం శాసన సభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి పాల్గొంటారని సోమవారం ప్రకటన ద్వారా టిడిపి కార్యాలయం వారు తెలిపారు. కావున కూటమి నాయకులు, కార్యకర్తలు,ఈ కార్యక్రమాలకు హాజరై విజయవంతం చేయాల్సిందిగా టిడిపి కార్యాలయం వారు కోరారు.

# 8 రాష్ట్ర మహాసభలను, అక్టోబర్ 31 నవంబర్ 1వ తేదీ చిత్తూరులో జయప్రదం చేయండి.

## ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్ అసోసియేషన్




**కర్నూల్ సిటీ నంది పత్రిక** సోమవారం అంగన్వాడి జిల్లా కౌన్సిల్ సమావేశం, జిల్లా అధ్యక్షురాలు, ఎస్ చాందిని అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐ. లలిత, ఏఐటీయుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు యస్ . మునెప్ప లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గత 12 సంవత్సరాల నుండి, రాష్ట్ర ప్రభుత్వం ఏడు సంవత్సరాల నుండి, ఎలాంటి కనీస వేతనాలు ఇవ్వకుండా, గౌరవ వేతనాలు పెంచకుండా, పెరుగుతున్నటువంటి నిత్యవసర సరుకులు ధరలు, డీజిల్ గ్యాస్ పెట్రోల్ ధరలు, అనేక పర్యాయములు పెరుగుతూ, అంగన్వాడి టీచర్ల కుటుంబాలు గడవక, తీవ్ర నా ఆరోగ్యాలకు లోనై, అక్కడక్కడ చనిపోతూ, అక్కడక్కడ రాజీనామాలు చేస్తూ ఉన్నారు. ప్రజా సాధికార సర్వేలో, అంగన్వాడి వర్కర్స్ కి హెల్పర్స్ కు ప్రభుత్వ ఉద్యోగి అని నమోదు ఉన్నది, నమోదు ప్రకారం ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించండి, లేదా కనీస వేతనాలు నెలకు 32 వేల రూపాయలు ఇవ్వాలి. పెన్షన్, సంక్షేమ పథకాలన్నీ, అర్బన్ రూరల్ తేడా లేకుండా, అందరికీ వర్తింప చేయాలి. 2023వ సంవత్సరం చేసినటువంటి స్ట్రైక్ లో, వేతనాలు, 2024 సంవత్సరంలో పెంచుతామని హామీని, ప్రస్తుత ప్రభుత్వం, ఎలాంటి ప్రకటన చేయకుండా, నేటి వరకు అనేక పర్యాయములు, సంబంధిత మంత్రివర్యులను, శాఖ అధికారులను, ప్రత్యక్షంగా కలిసి చర్చించినప్పటికీ కూడా, నేటి వరకు ఎలాంటి వేతనాలు పెంచలేదు, సంక్షేమ పథకాలు పెన్షన్ కూడా పూర్తిస్థాయిలో రావడం లేదు. కావున తక్షణమే, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వేతనాలు పెంచాలి. లేనిపక్షంలో, అక్టోబర్ 31 నవంబర్ ఒకటో తేదీలలో, చిత్తూరులో అంగన్వాడి వర్కర్ & హెల్పర్స్ అసోసియేషన్ ఎనిమిదవ రాష్ట్ర మహాసభల లో భవిష్యత్ ప్రణాళిక రూపొందించి, సోదర సంఘాలు కలుపుకొని, నిరంతర ఉద్యమం, చేపడతామని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేయుచున్నాము. ఈ సమావేశంలో పత్తికొండ ప్రాజెక్టు కాంతమ్మను, జిల్లా సహాయ కార్యదర్శిగా, మంత్రాలయం ప్రాజెక్టు రత్నమ్మను, జిల్లా ఉపాధ్యక్షురాలుగా, మంత్రాలయం ప్రాజెక్టు సుశీలమ్మను, జిల్లా ఉపాధ్యక్షురాలుగా, జిల్లా కమిటీలోకి తీసుకోవడం జరిగింది. ఈ సమావేశంలో, ఆదోని జానకి, ఆస్పరి ప్రాజెక్టు నుండి నాగమణి ప్రమీల, తెర్నేకల్ సెక్టార్ నుండి, విజయలక్ష్మి విమల, వెల్దుర్తి ప్రాజెక్టు నుండి సంధ్యారాణి రేణుక షమీనా, జిల్లా కౌన్సిల్ సభ్యులు, వీరితోపాటు, ఆదోని ఆలూరు ఆస్పరి పత్తికొండ వెల్దుర్తి ప్రాజెక్టుల నుండి 50 మంది దాకా జిల్లా కౌన్సిల్ సభ్యులు హాజరయ్యారు.

# గ్రామ అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వం ధ్యేయం

**రాష్ట్రంలో పల్లెల అభివృద్ధికి రథసారథులుగా చంద్రన్న మరియు పవన్ కళ్యాణ్**

**ఏపీ స్టేట్ కురుబ కురుమ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప**



**ఆదోని నంది పత్రిక ప్రతినిధి** కర్నూలు జిల్లా ఆదోని మండలం మేజర్ పంచాయతీ పెద్ద హరివాణం గ్రామంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దాదాపు రెండు కోట్ల పైచిలుకు సిసి రోడ్లు డ్రైనేజీలో వేయించడం జరిగింది పల్లె పండుగ 1.0 కింద 75 లక్షలుపనులు జరిగినయి, అలాగే పల్లె పండుగ 2.0 కింద 90 లక్షలుఅభివృద్ధి పనులు జరిగినాయి, మరియు పల్లె పండుగ 3.0 కింద ప్రస్తుతం 45 లక్షలు రావడం తో పెద్ద హరివాణం గ్రామ రూపకల్పన మారబోతుంది, అంతేకాదు ఈశాన్య దిక్కులో ఉన్న రోడ్డు కూడా త్వరలోనే ప్రారంభిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు, అంతేకాదు వైసిపి పాలనలో ప్రారంభంలో నిలిచిపోయిన హెల్త్ సెంటర్ కు 25 లక్షలు శాంక్షన్ చేసి పూర్తి చేయడం జరిగిందిఅలాగే ఈ మేజర్ గ్రామంలో బీసీలు ఎక్కువ ఉన్నారని 25 లక్షలతో బీసీ మల్టీపర్పస్ కమ్యూనిటీ హాలకూడా శాంక్షన్ చేయడం జరిగింది,వచ్చే రెండు సంవత్సరంలో ఈ పెద్ద హరివాణం మేజర్ గ్రామం లో గ్రావెల్స్ లేని రోడ్లు నిర్మిస్తామని తెలిపినారు, మరియు ముఖ్యంగా పెద్ద హరివాణం గ్రామం నుంచి కర్ణాటకకు పోయే దాదాపు పది గ్రామాలకు (నాడంగ, అగసనూర్,రవిహాలు, బీరల్లి, గుబ్యాళ్, కొత్తలచింత, బొమ్మనాలు, హచ్చోల్లి, మరియు మొదలగు గ్రామాలకు ఒకే రోడ్డు ఉంది ఈ రోడ్డు ఆంధ్ర మరియు కర్ణాటక మధ్యలో ఉన్నందువలన దాదాపు పాతికేళ్ల నుంచి రైతులు పడుతున్న ఇబ్బందిని చూసి మన రాష్ట్ర ముఖ్యమంత్రి 1.5 కోట్లు శాంక్షన్ చేసి పెద్ద హరివాణం నుంచి ఆంధ్ర బార్డర్ (నాడంగ రోడ్డు) వరకు ఈరోజు రోడ్డు పనులు ప్రారంభించడంతో ప్రజలు ఆనందంతో చంద్రబాబు నాయుడు గారికి కృతజ్ఞతలు తెలిపినారు రాష్ట్రంలో ప్రతి పల్లెలు ఎంత అభివృద్ధి జరుగుతుందంటే గౌరవనీయులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు మరియు ఉప ముఖ్యమంత్రి పవన్ శ్రమ ఎంతో ఉంది, ఈ రాష్ట్రంలో ప్రతి గ్రామాలను స్వర్ణ గ్రామాలుగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా పనిచేస్తున్నారు. వాళ్లకు ఈ పల్లె ప్రజల తరపున ధన్యవాదాలు ఈ పల్లె పండుగ 3.0 కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బిపి బసవరాజు గారు సొసైటీ చైర్మన్ ఆది శేష రెడ్డి గారు జడ్పీ స్కూల్ చైర్మన్ బి పి ఐ అన్నగారు ఎల్ఎల్సి కెనాల్ చైర్మన్ గురులింగ గారు లక్ష్మమ్మ చెరువు చైర్మన్ కుప్పం సోమ గారు మాజీ ఎంపిటిసి ఎన్ నాగరాజుగారు కౌటెకల్ నాగప్ప గారు బిజెపి నాయకులు రంగనాథ రెడ్డి గారు బోయరాగప్ప గారు కటిక నర్సోజి రావు గారు జనసేన వీరేష్ యాదవ్ మరియు తెలుగుదేశం పార్టీ బిజెపి పార్టీ జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## మదాసి కురువ, మదారి కురువ కుల ధ్రువీకరణ పత్రాల సమస్య పరిష్కరించాలి.

**సమస్యలను సజ్జల రామకృష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లిన హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు మదాసి కురువ సుంకన్న.**



**కర్నూల్ సిటీ నంది పత్రిక** మాదాసి కురువ, మాదారి కురువ కుల ధ్రువీకరణ పత్రాల జారీకి సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కర్నూలు జిల్లాకు చెందిన మాదాసి కురువ, మాదారి కురువ ఎస్సీ హక్కుల పోరాట సమితి నాయకులు వైయస్ఆర్‌సీపీ స్టేట్ కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డిని కలిశారు. కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సతీష్ ఆధ్వర్యంలో వైయస్ఆర్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సజ్జలను కలిసి తమ సమస్యలను వివరించారు.మాదాసి కురువ, మాదారి కురువ కుల ధ్రువీకరణ పత్రాల జారీ విషయంలో ఎదురవుతున్న ఇబ్బందులను నాయకులు సజ్జల దృష్టికి తీసుకెళ్లారు. గతంలో జీవో నంబర్ 53 ద్వారా ఆర్డీవో నుంచి ఎమ్మార్వో వరకు ఉన్న ప్రక్రియను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రద్దు చేసిందని తెలిపారు. దీంతో కర్నూలు జిల్లాలో దాదాపు 4 లక్షల మంది కుల ధ్రువీకరణ పత్రాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు.ప్రభుత్వాలు మారుతున్నా తమ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించడం లేదని హక్కుల పోరాట సమితి నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలను సజ్జల రామకృష్ణారెడ్డి సావధానంగా విని, వైయస్ఆర్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని విధాలుగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మదాసి కురువ, మదారి కురువ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు సుంకన్న, ప్రధాన కార్యదర్శి కురువ శివప్రసాద్, జేఏసీ మాజీ చైర్మన్ రవికుమార్, ఎం కె వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద కొట్టాల గ్రామాభివృద్ధికి రూ. 67.04 లక్షలు కేటాయింపు: రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్

**జల జీవన్ మిషన్ అమరజీవి జలధార పథకం పనులకు ఘనంగా శంకుస్థాపన**

**నంద్యాల నియోజకవర్గంలో రూ. 749.21 లక్షలతో 22 తాగునీటి సరఫరా పనులు చేపడుతున్నట్లు వెల్లడి**



**నంద్యాల సిటీ బ్యూరో అక్టోబర్ 05 ( నంది పత్రిక )** గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ అన్నారు . నంద్యాల మండలం పెద్ద కొట్టాల గ్రామంలో గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుధ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "జల జీవన్ మిషన్ అమరజీవి జలధార" కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ పెద్ద కొట్టాల గ్రామ అభివృద్ధికి ప్రత్యేకంగా రూ. 67.04 లక్షల నిధులు కేటాయించినట్లు తెలిపారు. అలాగే నంద్యాల నియోజకవర్గ వ్యాప్తంగా తాగునీటి ఎద్దడిని శాశ్వతంగా పరిష్కరించేందుకు రూ. 749.21 లక్షల అంచనా వ్యయంతో 22 తాగునీటి సరఫరా పనులను చేపడుతున్నామని వివరించారు. ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పెద్ద కొట్టాల టిడిపి నాయకులు కొప్పుల శివ నాగిరెడ్డి , ఎమ్మార్వో శ్రీవాణి, ఎంపీడీవో సుగుణ శ్రీ , శీలం సుదర్శన్ రెడ్డి, ఎర్రబోతుల వెంకట సుబ్బారెడ్డి, నంద్యాల శివశంకర్ రెడ్డి, కాకనూరు దశరథరామిరెడ్డి, బొండిగ రామారావు, జనసేన పబ్బతి రవి , మధుసూదన్ యాదవ్, నాలి రాజేష్ యాదవ్, మండల కన్వీనర్ విశ్వనాథరెడ్డి, స్వామి నాయక్, బుగ్గ రాముడు, గోసుల నాగేశ్వరరావు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## వైసీపీ నాయకుని మేనకోడలి వివాహానికి హాజరైన శిల్ప భువనేశ్వర్ రెడ్డి



**వెలుగోడు అక్టోబర్ 05 (నంది పత్రిక):** వెలుగోడు పట్టణంలోని స్థానిక ఎస్.ఆర్. ఫంక్షన్ హాల్ నందు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు ఎస్. ఖాదర్ వలీ మేనకోడలి వివాహ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ వివాహ వేడుకకు శ్రీశైలం నియోజకవర్గ సమన్వయకర్త శిల్ప భువనేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కల్యాణ వేదికపై నూతన వధూవరులను ఆయన ఆశీర్వదించి, వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల నాయకులు తిరుపం రెడ్డి, ఇలియాస్ ఖాన్, లాలం రమేష్, షంషేర్ అలీ ఖాన్, వలితో పాటు పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు విశేష సంఖ్యలో పాల్గొని నూతన దంపతులకు ఆశీస్సులు అందజేశారు.

## డివైడర్‌లో చెత్తపై అధికారుల స్పందన.. షాపులకు నోటీసులు


నంది
చెత్తకుప్పగా మారినా డివైడర్ పట్టించుకోని అధికారులు..!



**పోరుమామిళ్ల, అక్టోబర్ 5 (నంది పత్రిక ):** పోరుమామిళ్ల పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ నుంచి గాంధీ బొమ్మ సెంటర్ వరకు ప్రధాన రహదారి మధ్యలోని డివైడర్‌లో చెత్త పేరుకుపోయిన విషయంపై నంది పత్రికలో వచ్చిన వార్తకు అధికారులు స్పందించారు. రంగసముద్రం పంచాయతీ సచివాలయం2 పరిధిలో పంచాయతీ సెక్రటరీ ప్రసాద్‌రావు, సచివాలయ సిబ్బంది చర్యలు చేపట్టారు.

**షాపు యజమానులకు నోటీసులు** డివైడర్ పరిసరాల్లో చెత్త వేయడం, నీరు నిల్వ ఉండేలా చేయడం, వ్యర్థ పదార్థాలు, మురుగు నీటిని రోడ్లపైకి వదలడం వల్ల ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్న నేపథ్యంలో సంబంధిత షాపు యజమానులకు నోటీసులు జారీ చేశారు.

**మూడు రోజుల్లోగా అపరిశుభ్రత తొలగించాలి** 1994 సంవత్సరం పంచాయతీ రాజ్ చట్టము సెక్షన్ 94 సబ్ సెక్షన్ 1(డి) కింద జారీ చేసిన నోటీసులో.. ఇళ్లు, షాపులు, ఖాళీ స్థలాలు, నూతులు, గోతులు, చిన్న చెరువులు, డ్రెయిన్లు తదితర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండటం, వ్యర్థ పదార్థాలు, మురుగునీరు రోడ్లపై వేయడం వల్ల ఇరుగుపొరుగు వారికి ఇబ్బందులు కలుగుతున్నాయని పేర్కొన్నారు. దీనివల్ల ప్రజారోగ్యానికి భంగం కలిగే అవకాశం ఉన్నందున నోటీసు అందిన మూడు రోజుల్లోగా నీటి నిల్వలు, అపరిశుభ్రతను తొలగించాలని సూచించారు.

**నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు** నోటీసులో పేర్కొన్న గడువులో సమస్యను పరిష్కరించని పక్షంలో సెక్షన్ 94 సబ్ సెక్షన్ (2) ప్రకారం గ్రామ పంచాయతీ ద్వారా అవసరమైన పనులు చేపట్టి, అందుకు అయ్యే ఖర్చును సంబంధిత వ్యక్తుల నుంచి వసూలు చేయడంతో పాటు పోలీసుల ద్వారా న్యూసెన్స్ కేసులు నమోదు చేసే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు.

**పరిశుభ్రతపై పర్యవేక్షణ అవసరం** ప్రధాన రహదారిపై చెత్త పేరుకుపోయిన అంశంపై వచ్చిన వార్తకు అధికారులు వెంటనే స్పందించి నోటీసులు జారీ చేయడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. డివైడర్‌లో పేరుకుపోయిన చెత్తను పూర్తిగా తొలగించడంతో పాటు, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

# మాలల ఐక్యత వర్ధిల్లాలి

**పోరుమామిళ్ల, అక్టోబర్ 5 ( నంది పత్రిక ):** వైయస్సార్ కడప జిల్లా పోరుమామిళ్ల పట్టణములో బుధవారం ఉదయం 10 గంటలకు బద్వేల్, మైదుకూరు నియోజకవర్గాలకు చెందిన మాల మహానాడు నాయకులు, సోదరులతో కలిసి విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు కొమ్ముతోటి పౌలు ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు.మాలలకు జరుగుతున్న అన్యాయాలు, వారికి రావాల్సిన హక్కులు, అందాల్సిన సంక్షేమ పథకాలు, భూ సమస్యలు, ఆర్థిక విధానాలపై సమావేశంలో చర్చించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బద్వేల్, మైదుకూరు నియోజకవర్గాలకు చెందిన దళిత నాయకులు, అంబేద్కర్ వారసులు, మాల ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర సెక్రటరీ, మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముత్యాల ప్రసాద్ రావు, రాయలసీమ మాల మహానాడు జిల్లా కన్వీనర్ మూరతోటి ఆలివర్, పోరుమామిళ్ల మండల యూత్ అధ్యక్షులు ఉల్లాజీ ప్రవీణ్ కుమార్ తెలిపారు.



## అహోబిలం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్న మాజీ పార్లమెంట్ సభ్యులు గంగుల ప్రతాపరెడ్డి



**ఆళ్లగడ్డ, ప్రతినిధి అక్టోబర్ 5 నంది పత్రిక** ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలంలో సోమవారం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని మాజీ పార్లమెంట్ సభ్యులు గంగుల ప్రతాపరెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ మర్యాదలతో మఠం ప్రతినిధి మాధవన్, ప్రధాన అర్చకులు వేణు గోపాలన్ స్వాగతం పలికారు . దర్శనానంతరం ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేసి సత్కరించారు. అహోబిలం ఆలయ పరిసరాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి ఆయన మఠం వారితో మాట్లాడడం జరిగింది. నంద్యాల బిజెపి నాయకులు రిషికేశవరెడ్డి, నాసారి వెంకటేశ్వర్లు పాల్గొనడం జరిగింది.

## క్రీడా పోటీల్లో వెలుగోడు జడ్పీహెచ్ఎస్ విద్యార్థుల ప్రతిభ




**వెలుగోడు (నంది పత్రిక):** వెలుగోడు పట్టణంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వివిధ క్రీడా పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాలిక్ ఖాన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.నందికొట్కూరు మండలంలోని నవనంది స్కూల్‌లో నిర్వహించిన కర్నూలు, నంద్యాల ఉమ్మడి జిల్లాల 70వ ఎస్‌జిఎఫ్ అండర్-14 జూడో ఎంపిక పోటీల్లో వెలుగోడు జడ్పీహెచ్ఎస్ విద్యార్థి షేక్ ఆస్రోజు ప్రథమ స్థానంలో నిలిచాడు. అలాగే నంద్యాలలో జరిగిన అండర్-19 విభాగంలో (72 కేజీలు) విద్యార్థిని బత్తూరు మహాదేవి విజయం సాధించింది. కాగా, ఈ ఇద్దరు విద్యార్థులు ఈ నెల 12, 13, 14 తేదీలలో తిరుపతిలో జరగనున్న రాష్ట్ర స్థాయి జూడో పోటీల్లో పాల్గొననున్నారు.మరోవైపు నంద్యాలలో నిర్వహించిన 70వ ఎస్‌జిఎఫ్ ఫెన్సింగ్ పోటీల్లో ఇదే పాఠశాలకు చెందిన జి. ఫైజాన్, షేక్ మొహమ్మద్ రిహాన్లు విశేష ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు.అలాగే పాణ్యం ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాల కబడ్డీ అసోసియేషన్ మీట్‌లో జి. హర్షవర్ధన్, సత్యనారాయణలు ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయికి అర్హత సాధించారు. వీరు ఈ నెల 29, 30, 31 తేదీలలో పశ్చిమ గోదావరి జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని హెచ్ఎం తెలిపారు. వివిధ క్రీడల్లో ప్రతిభ చూపి పాఠశాలకు, ప్రాంతానికి మంచి పేరు తెచ్చిన విద్యార్థులను హెడ్‌మాస్టర్ మాలిక్ ఖాన్, వ్యాయామ ఉపాధ్యాయులు (పిడిలు) మోహన్ కుమార్, ఫైజుల్ల,రంగన్నలతో పాటు పాఠశాల ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించారు.

## మహానంది క్షేత్రంలో నూతన సబ్ కలెక్టర్ మనిషా పూజలు



**మహానంది అక్టోబర్ 05 (నంది పత్రిక):-** మహానంది క్షేత్రంలో వెలసిన శ్రీ కామేశ్వరి సహిత మహానందీశ్వర స్వామివారిని నంద్యాల నూతన సబ్ కలెక్టర్ మనిషా దర్శించుకున్నారు. సోమవారం ఆలయానికి వచ్చిన ఆమెకు దేవస్థానం అధికారులు,తహశీల్దార్ రమాదేవి స్వాగతం పలికారు. సబ్ కలెక్టర్ మనిషా స్వామి అమ్మవార్లకు అభిషేకార్చనలు పూజలు నిర్వహించుకున్నారు. దర్శనం అనంతరం ఆలయ పర్యవేక్షకులు శశిధర్ రెడ్డి స్వామివారి శేషవస్త్రంతో సత్కరించగా,వేద పండితులు వేద ఆశీర్వచనం నడుమ తీర్థప్రసాదాలు అందజేశారు.

# సీఎం పేదలకు పట్టాలు ఎప్పుడు ఇస్తారు ,,,





## సిపిఐ జాతీయ కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే రామకృష్ణ

**కర్నూల్ సిటీ నంది పత్రిక** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ నగర సమితి ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు పేదోడి సొంతింటి కల నెరవేర్చడానికి కోసం సోమవారం ఉదయం 10 గంటలకు దీక్షలు ప్రారంభం చేయడం జరిగినది ఈ కార్యక్రమానికి నగర కార్యవర్గ సభ్యులు ఎంబీసన్న అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన సిపిఐ జాతీయ కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ కె రామకృష్ణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కే రామాంజనేయులు దేవర గుడి జగదీష్ ముఖ్య అతిథులుగా హాజరై ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు డబల్ ఇంజన్ సర్కారు గా చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం ప్రజలు అడగకుండానే పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్లు స్థలం ఇస్తామని ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా పేదోడి సొంతింటి కలను నెరవేర్చడంలో పూర్తిగా కూటమి ప్రభుత్వం విఫలం అయ్యిందని కర్నూలు నగరంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ నగర సమితి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి సిపిఐ పార్టీ జాతీయ కార్యదర్శి రామకృష్ణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కే రామాంజనేయులు దేవర గుడి జగదీష్ విమర్శించారు ఇప్పటికే ప్రభుత్వ స్థలాలలో గుడిసెలు వేసుకొని నివాసముంటున్న పేదలందరికీ పట్టాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు రాయలసీమ జిల్లాలోని ప్రజలను కేవలం ఓటు బ్యాంకు కే పరిమితం చేశారని ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నారని అసలే రాయలసీమ ప్రాంతం కరువుతో కొట్టుమిట్టాడుతుంటే వలస జీవులు పట్టణ ప్రాంతాలకు వెళ్లి జీవనోపాధి చూసుకోవాలంటే అద్దె ఇంట్లో ఉండాల్సిన పరిస్థితి నెలకొంది ఈ సమయంలో అద్దె కట్టలేక ఉపాధి లేక పేద బడుగు బలహీన వర్గాల జీవనో జీవన పరిస్థితులు ప్రశ్నార్ధకంగా మారింది ఈ వలసలకు ప్రధాన కారణం సొంత ఊర్లో కూడా ఒక సెంటు స్థలం లేనటువంటి పరిస్థితి 40 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం ఉన్నటువంటి చంద్రబాబు నాయుడు మాట ఇచ్చినటువంటి హామీలు నెరవేరుస్తాడు అని చెప్పి కల్లబొల్లి మాటలు నమ్మి పేద ప్రజలు గద్దెనెక్కిస్తే మరి పేద ప్రజలకు మొండి చేయి చూపించడం జరిగింది మరియు విజయవాడ విశాఖపట్నం ప్రాంతాలలో అరోకోరా స్థలాలు పట్టాలు పంపిణీ చేసి మా ప్రభుత్వం పేదలకు 24 వేల కుటుంబాలకు పట్టాలు పంపిణీ చేశామని గొప్పలు చెప్పుకుంటున్న మీరు రాయలసీమ నుండే ముఖ్యమంత్రి అయిన మీరు మరి ఈ ప్రాంత వాసులు మీకు పేదవాడు కనబడడం లేదా మరి ఇచ్చినటువంటి హామీ సొంతింటి కల నెరవేర్చే బాధ్యత మీకు లేదా అని రాయలసీమ ప్రాంతం ఏమైనా వేరే దేశమా ఇక్కడున్నటువంటి వారు ఆంధ్ర ప్రజలు కాదా అని ఎద్దేవా చేశారు అదేవిధంగా ఈ దీక్షా శిబిరాన్ని ప్రారంభించే కార్యక్రమంలో సిపిఐ పార్టీ సీనియర్ నాయకులు జగన్నాథం మాట్లాడుతూ పేదల కల నెరవేరాలంటే బాబుకు చెబుదాం జాబు రావాలంటే బాబు రావాలి అనే నినాదాలతోని గ్రామ గ్రామాలలో ప్రచారం చేసిన మీరు తర్వాత గ్రామీణ పట్టణ ప్రాంతాల పేదోడి సొంతింటి కలలపై నీళ్లు చల్లారని రెండు సంవత్సరాల తర్వాత కూడా ఆ ఉసెత్తకుండా ఎన్నికల సమయంలో అలివి కానీ పథకాలను హామీలను పేపర్ ప్రకటనలకే పరిమితమై పేద బడుగు బలహీన వర్గాల ప్రజల జీవన పరిస్థితి అంధకారంలో నెట్టు వేయబడింది దీన్ని దృష్టిలో ఉంచుకున్నటువంటి భారత కమ్యూనిస్టు పార్టీ గత నాలుగు సంవత్సరాల క్రితం ప్రభుత్వ స్థలాలలో పేదోడి సొంతింటి కల నెరవేర్చడానికి కోసం వెయ్యి మందికి స్థలాలు పంపిణీ చేసి పూర్తిగా గుడిసెలు వేసుకొని జీవన కొనసాగిస్తా ఉన్నారు ఇదైనా దృష్టిలో ఉంచుకొని వారు వేసుకున్న గుడిసెలకు పట్టాలు ఇవ్వండి అని విన్నవిస్తా ఉంది బడా కార్పొరేట్ వ్యక్తులకు ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలకు తక్కువ రేట్లకే ఎకరాలు ఎకరాలు కట్టబెడుతున్న మీరు పేదోడికి రెండు మూడు సెంట్లు స్థలం ఇవ్వడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని మీరు కట్టుకునే ఇళ్లలో కనీసం బాత్రూం అంతస్థలం పేదోడికిస్తే ఒక కుటుంబం తలదాచుకునేందుకు వస్తుందని ఇప్పటికైనా మీరు ఇచ్చినటువంటి హామీని నెరవేర్చాలని లేనిపక్షంలో భారత కమ్యూనిస్టు పార్టీ నగర సమితిగా ప్రజాప్రతినిధుల ఇల్లు ముట్టడిస్తామని వారు హెచ్చరించారు

ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ నగర కార్యదర్శి పి రామకృష్ణారెడ్డి సహాయ కార్యదర్శులు దంబళం శ్రీనివాసరావు సి మహేష్ నగర్ కార్యవర్గ సభ్యులు నాగరాజు భద్ర కుమారు సి కుమార్ అశోక్న నల్లన్న చదువుల రామయ్య కాలనీవాసులు అధిక సంఖ్యలో ఈ దీక్షలో పాల్గొనడం జరిగింది.

# విరూపాక్షి అరెస్ట్ అక్రమం

### అక్రమ కేసుపెట్టి 65 రోజులు జైలులో నిర్బంధించడం దుర్మార్గం

### అక్రమ కేసు ఎత్తివేసి - బేషరత్గా విడుదల చేయాలి సిపిఐ జాతీయ కార్యదర్శి కె రామకృష్ణ



**కర్నూలు సిటీ నంది పత్రిక** రాష్ట్ర ప్రభుత్వం ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి పై అక్రమ కేసు పెట్టి అతనితోపాటు 44 మందిని జైలులో 65 రోజులు నిర్బంధించడం దుర్మార్గమని, వెంటనే ఎమ్మెల్యేపై పెట్టిన కేసులు ఎత్తివేసి అతనిని బేశరత్తుగా విడుదల చేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం కర్నూలు సబ్ జైలులో ఉన్న ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షిని రామకృష్ణతోపాటు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి జగదీష్, కె రామాంజనేయులు, పీ రామచంద్రయ్య, కె జగన్నాథంలు నగర శివారులో ఉన్న పంచలింగాల సబ్ జైలు వద్ద ములాఖత్ అయ్యారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలనలో ఏ తప్పు చేయని ఎమ్మెల్యే విరూపాక్షిపై అక్రమ కేసుపెట్టి ఇంత దుర్మార్గంగా, ఘోరంగా 65 రోజులు జైలులో నిర్బంధించడం అన్యాయమన్నారు. ఇదిరాష్ట్ర ప్రభుత్వంకు అవమానమన్నారు, రాష్ట్రంలో సీనియర్ నాయకులు, అనుభవజ్ఞుడైన ముఖ్యమంత్రిగా ఉండగా ఏతప్పు చేయని మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచిన బీసీ ఎమ్మెల్యేని జైలులో నిర్బంధించడం ఏమిటని ప్రశ్నించారు. సీఎం ఎమ్మెల్యేని పిలిపించుకుని ఏమి తప్పు చేశావని ప్రశ్నించి తెలుసుకోకుండా ఇలా అన్యాయంగా నిర్బంధించడం చంద్రబాబు నాయుడుకి జీవితంలో ఒక మచ్చగా మిగులుతుందన్నారు. విరూపాక్షితోపాటు 44 మందిని జైలులో నిర్బంది c చడంను సీపీఐ ఖండిస్తుందన్నారు. రాష్ట్రంలో జర్నలిస్టులపై దాడులు పెరిగిపోయాయన్నారు. ఎమ్మెల్యేలు పెద్దఎత్తున అక్రమం ఇసుక రవాణా చేస్తున్నారని ఆరోపించారు. విరూపాక్షిపై గతంలో ఎప్పుడూ కేసులు లేవన్నారు. అటువంటి వ్యక్తిపై అక్రమ కేసులు పెట్టి నిర్బంధించడం పట్ల చంద్రబాబునాయుడు ప్రజలకు ఎటువంటి సందేశం ఇస్తున్నారని ప్రశ్నించారు. చంద్రబాబునాయుడు కు దీనిపై ఒక ఉత్తరం రాస్తానని వెంటనే ఎమ్మెల్యేపై పెట్టిన కేసును ఉపసంహరించుకుని విడుదల చేయాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. అనంతరం వైసీపీ నేతలు కాటసాని రాంభూపాల్ రెడ్డి, ఎస్వీ మోహన్ రెడ్డి ఆహ్వానం మేరకు వారి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నంద్యాల జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు సీపీఐ నంద్యాల జిల్లా సహాయ కార్యదర్శి బాబాపక్రుద్దీన్, కర్నూలు జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ మునెప్ప, ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్షులు నాగేంద్రయ్య, నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, నగర సహాయ కార్యదర్శులు సీ మహేష్, శ్రీనివాసరావు, ఏఐఎస్ఎఫ్ ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె శ్రీనివాసులు, రంగస్వామి సిపిఐ నాయకులు సుంకయ్య, రమేష్ బాబు, చంద్రశేఖర్, రామాంజి, రాముడు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, సీపీఐ, ప్రజాసంఘాల నాయకులు ఉన్నారు.

## తప్పుడు ఆరోపణలకు హైకోర్టు తీర్పుతో పాలకొలను గ్రామస్థులకు న్యాయం కాటసాని రామభూపాల్ రెడ్డి



**కర్నూల్ సిటీ నంది పత్రిక** ఓర్వకల్లు మండలం పాలకొలను గ్రామంలో డి ఆర్ డి ఓ కోసం సేకరించిన భూములకు విలువ ఆధారంగా చట్టబద్ధంగా రావాల్సిన పరిహారం అందకుండా కొందరు వ్యక్తులు తప్పుడు ఆరోపణలు, అభ్యంతరాలతో అడ్డంకులు సృష్టించారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. పరిహారం నిలిపివేయడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో నంద్యాల జిల్లా వైఎస్ఆర్సీపీ అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి సూచనలు, సలహాలతో గ్రామస్థులు హైకోర్టును ఆశ్రయించారు. న్యాయస్థానం గ్రామస్థులకు అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో వారి న్యాయపోరాటానికి విజయం లభించింది. హైకోర్టు తీర్పుతో సంతోషించిన గ్రామస్థులు కాటసాని రామభూపాల్ రెడ్డి ని సన్మానించి, కేక్ కట్ చేసి తమ ఆనందాన్ని పంచుకున్నారు. న్యాయం కోసం అండగా నిలిచినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కాటసాని రామభూపాల్ రెడ్డి మాట్లాడుతూ చట్ట ప్రకారం గ్రామస్థులకు రావాల్సిన హక్కులు, పరిహారం అందే వరకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. తప్పుడు ఆరోపణలతో అర్హులైన గ్రామస్థుల హక్కులను అడ్డుకోవడం సరికాదని, న్యాయం కోసం అవసరమైన ప్రతి సహాయాన్ని అందిస్తానని స్పష్టం చేశారు. న్యాయం ఆలస్యమైనా.. చివరికి న్యాయమే గెలుస్తుందనే దానికి ఈ హైకోర్టు తీర్పు నిదర్శనమని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కర్నూలు జిల్లా జనరల్ ఆక్టివిటీ సెక్రటరీ పాలకోలను రమేష్, నబి రసూల్ మహబూబ్ బాషా మద్దయ్య సామన్న అయ్యప్ప స్వాములు గ్రామ ప్రజలు మహిళలు తదితరులు పాల్గొన్నారు..

## "వైద్య విద్యను ఒత్తిడితో కాకుండా ఇష్టంతో, ఒక సవాలుగా స్వీకరించి ముందుకు సాగండి"... ఏడిఎంఇ, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డా.కె.చిట్టి నరసమ్మ



**కర్నూల్ సిటీ నంది పత్రిక** ప్రపంచ మానసక ఆరోగ్యదిన వారోత్సవాల సందర్భంగా సోమవారం కర్నూలు మెడికల్ కాలేజీలో అనస్థీషియా విభాగం ఆధ్వర్యం లో నిర్వహించిన మోర్టాలిటీ సమావేశం లో పీజీ వైద్య విద్యార్థులకు మానసిక ఆరోగ్యం, ఒత్తిడి నియంత్రణపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ వైద్య విద్య అనేది సవాళ్లతో కూడుకున్నదని, అయితే దానిని ఒత్తిడిగా కాకుండా ఇష్టంతో, ఒక సవాలుగా స్వీకరించి ముందుకు సాగాలని సూచించారు. ప్రతి విద్యార్థి తనకు కష్టంగా అనిపించే సబ్జెక్టులను ప్రత్యేకంగా గుర్తించి, వాటిపై ఆసక్తిని పెంచుకుని చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. వైద్య విద్యార్థులు అనవసరమైన ఒత్తిడికి గురికాకుండా మానసిక ప్రశాంతతను కాపాడుకోవాలని సూచించారు.ప్రస్తుతం అనేక మందిలో విటమిన్-డి, విటమిన్-బి12 లోపాలు కనిపిస్తున్నాయని, ఇవి శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. అవసరమైనప్పుడు వైద్యుల సలహాతో సంబంధిత విటమిన్ స్థాయిలను పరీక్షించుకోవడంతో పాటు, సమతుల్య ఆహారం తీసుకోవాలని, అవసరమైతే వైద్యుల సూచన మేరకు సప్లిమెంట్లు తీసుకోవాలని తెలిపారు.వైద్య విద్యార్థులు తమ చదువుతో పాటు తగిన విశ్రాంతి, ఆరోగ్యకరమైన ఆహారం, శారీరక వ్యాయామం, సానుకూల ఆలోచనా విధానానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె సూచించారు. మానసిక ఆరోగ్యం కూడా శారీరక ఆరోగ్యంతో సమానంగా ముఖ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అనస్తీషియా విభాగాధిపతి డాక్టర్ సుధీర్, ప్రొఫెసర్లు డా.విశాల, డా.రామ్ శివ నాయక్ , తదితర వైద్యులు, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ ఉత్సవం ఆరోగ్యంపై అవగాహన



**వెలుగోడు అక్టోబర్ 05 (నంది పత్రిక):** వెలుగోడు గ్రామంలోని అబ్బీరాజుకుంట అంగన్‌వాడీ సెంటర్‌లో అంగన్‌వాడీ ఉత్సవాల కార్యక్రమంలో భాగంగా పౌష్టికాహారం, ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భవతులకు, బాలింతలకు ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన పథకం గురించి సమగ్రంగా వివరించారు. అనంతరం తృణధాన్యాలు (ఫుల్ మిల్లెట్స్), మునగాకు యొక్క ప్రాముఖ్యతను తెలుపుతూ... మునగాకులో విటమిన్లు, ఫైబర్ అధికంగా ఉంటాయని, కాబట్టి దానిని రోజువారీ ఆహారంలో క్రమం తప్పకుండా ఉపయోగించాలని సూచించారు. అలాగే పౌష్టికాహారాన్ని ఎలా తయారు చేసుకోవాలో, సరిగ్గా ఎలా వాడాలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు అనిత బాయి, అంకలమ్మ, రామతులసమ్మలతో పాటు గర్భవతులు, బాలింతలు, పిల్లల తల్లులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## నందికొట్కూరులో డప్పు కళా ప్రదర్శన పోస్టర్ విడుదల



**కర్నూల్ సిటీ నంది పత్రిక** నంద్యాల జిల్లా నందికొట్కూరు నగరంలో నంద్యాల జిల్లా ఇంచార్జి వేల్పుల గోపాల్ మాట్లాడుతూ అంబేద్కర్ సర్కిల్ అంబేద్కర్ పూల మాల వేసి అనంతరం 75 వ పుట్టినరోజు సందర్భంగా 75 గంటల డప్పు కళాకారుల ప్రదర్శన తిరుపతి యస్ వి రామ స్టేడియం నందు జరుగుతున్న భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రజాసేవా సంకల్ప ప్రస్థానాన్ని పురస్కరించుకోని ఈనెల 7 వ తేదీ నుంచి 10 వ తేదీ వరకు తిరుపతిలో నిర్వహించనున్న 75 గంటల డప్పు కళాకారుల ప్రదర్శన వాల్ పోస్టర్లను ఆవిష్కరించడం జరిగింది డప్పు కళాకారుల కళా ప్రదర్శన ద్వార భారత ప్రధాని నరేంద్రమోదీ ప్రజాసేవా సంకల్పాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ఈకార్యక్రమం విజయవంతం చేయాలని ఆకాంక్షిస్తున్నామన్నారు ఈ కార్యక్రమంలో బిజెపి యస్ సి మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు రవీంద్ర సోము జ్యోతి కృష్ణ శివారెడ్డి రాముడు తదితరులు పాల్గొన్నారు.

## కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ని మర్యాదపురకంగా కలిసిన ఎమ్మిగనూరు నూతన డీఎస్పీ ఏ. శ్రీనివాసులు.



**కర్నూల్ సిటీ నంది పత్రిక** సోమవారం ఎమ్మిగనూరు డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఏ. శ్రీనివాసులు కర్నూలు టూ టౌన్ పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎమ్మిగనూరు సబ్ డివిజన్‌లో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ సూచించారు.

## నగరపాలక సంస్థకు 44 వినతులు.

### రెవిన్యూ ఆఫీసర్ సేతు మాధవ్.



**తిరుపతి బ్యూరో చీఫ్ అక్టోబర్ 5 నంది పత్రిక** నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 44 వినతులు వచ్చాయని రెవిన్యూ ఆఫీసర్ సేతు మాధవ్ తెలిపారు. సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫోన్ ద్వారా 20 మంది, కార్యాలయంకు నేరుగా వచ్చి 24 మంది వినతులు సమర్పించి తమ సమస్యలు తెలిపారు. శెట్టిపల్లి వద్ద తెలుగు గంగ పైప్ లైన్ లీక్ అవుతున్నది మరమ్మత్తులు చేయాలని, అండర్ గ్రౌండ్ లో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, వేశాలమ్మ గుడి వద్ద మ్యాన్ హోల్ లీకేజీ అరికట్టాలని, ప్రభుత్వ గృహం కోసం కట్టిన నగదు వాపస్ ఇవ్వాలని, దేవేంద్ర థియేటర్ సమీపంలోని స్మశానం వద్ద ఆక్సిడెంట్స్ జరక్కుండా సర్కిల్ ఏర్పాటు చేయాలని, అన్నమయ్య హోటల్ వద్ద వాహనాల పార్కింగ్ అరికట్టాలని, శ్రీనివాసం నుండి గరుడవారధి వరకు ఫుట్ పాత్ ఏర్పాటు చేయాలని, వృద్ధాప్య పింఛన్ ఇప్పించాలని, బ్యాంకు యూనియన్ కాలనీలో లో పార్కు సంరక్షణ, గేట్, ప్రహరీ గోడ మరమ్మత్తు చేయాలని, కస్తూరి బాయి సందులో త్రాగునీరు కలుషితం అవుతున్నది అరికట్టాలని కోరారు. ఈరోజు కార్యక్రమంలో మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, డి.ఈ.లు, రమణ, మహేష్, రాజు, ప్రసాద్, లలిత, మధు, శిల్ప, రెవిన్యూ అధికారి రవి, మేనేజర్ హాసీమ్, సర్వేయర్ గురువా రెడ్డి, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, మరియు సిబ్బంది పాల్గొన్నారు.



## సమస్యలు పరిష్కరించాలని మహానందిలో వీఆర్‌ఏలు ధర్నా

**మహానంది అక్టోబర్ 05 (నంది పత్రిక):-** మహానంది మండలంలోని గ్రామ రెవెన్యూ సహాయకుల(వీఆర్ఏ) జీవితాలు తలకిందులుగా మారాయని, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమ న్యాయమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వీఆర్‌ఏలు డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల సాధనకై వారు చేపట్టిన సమ్మెకు సీపీఐ నాయకులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏలు తమ ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం ముందుంచారు. వీఆర్‌ఏలకు వెంటనే పే స్కేల్ అమలు చేయాలని, అర్హులైన వారికి పదోన్నతులు (ప్రమోషన్స్) కల్పించాలని కోరారు. అలాగే చాలా కాలంగా నామినీలుగా పని చేస్తున్న వారిని పూర్తిస్థాయి వీఆర్‌ఏలుగా నియమించాలని, అర్హులైన కుటుంబాలకు కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



## రోడ్డు ప్రమాదం లో వ్యక్తి మృతి.



**బేతంచెర్ల అక్టోబర్ 5 ( నంది పత్రిక ).** బేతంచెర్ల మండలం బలపాలపల్లె గ్రామ నివాసి అగు జవ్వాజీ గోపాల్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడు సోమవారం బేతంచెర్ల నుండి బలపాల పల్లె కు మోటార్ బైకు పై వెళుతుండగా హైవే దాటే సమయంలో మోటార్ బైకును కారు ఢీ కొన్నది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గోపాల్ ను స్థానిక ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలిస్తుండగా ఆయన మార్గ మధ్యలోనే ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు కేసు నమోదు చేసి,దర్యాప్తు చేస్తున్నారు.

## కాటసాని నివాసానికి సీపీఐ రామకృష్ణ పాత రాజకీయ అనుబంధానికి మరోసారి గౌరవం



**కర్నూలు సిటీ నంది పత్రిక** కర్నూలు జిల్లా జైలులో ఉన్న వైసీపీ ఎమ్మెల్యే విరుపాక్షిని ములాకత్ ద్వారా కలిసిన అనంతరం సీపీఐ జాతీయ నాయకులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అనంతపురం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే రామకృష్ణ నంద్యాల జిల్లా వైఎస్‌ఆర్సీపీ అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి నివాసానికి విచ్చేశారు. ఆయనను కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా కాటసాని రామభూపాల్ రెడ్డి , రామకృష్ణ కొద్దిసేపు ఆత్మీయంగా మాట్లాడుకున్నారు. 1994 నుంచి 1999 వరకు ఇద్దరూ ఎమ్మెల్యేలుగా కలిసి పనిచేసిన నాటి రాజకీయ అనుబంధం, స్నేహాన్ని గుర్తుచేసుకుంటూ పరస్పరం యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. రాజకీయంగా భిన్న మార్గాల్లో ఉన్నప్పటికీ పాత రాజకీయ అనుబంధం, వ్యక్తిగత స్నేహానికి విలువ ఇస్తూ రామకృష్ణ కాటసాని నివాసానికి రావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## మహానంది క్షేత్రంలో వైభవంగా పల్లకి సేవ



**మహానంది అక్టోబర్ 05 (నంది పత్రిక):-** మహానంది క్షేత్రంలో వెలసిన శ్రీ కామేశ్వరి సహిత మహానందీశ్వర స్వామి వారికి సోమవారం సందర్భంగా వైభవంగా పల్లకి సేవ నిర్వహించారు. ముందుగా స్వామి అమ్మవార్ల ఉత్సవమూ ర్తులను పల్లకిలో కొలువుదీర్చి, ఆలయ వేద పండితులు,అర్చకులు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు.పూజలు అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తిశ్రద్ధలతో మేళతాళాలతో పల్లకి సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు,సిబ్బంది అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## నంద్యాలలో 7న భారీ 'సేవా జ్యోతి యాత్ర'

**భారతమాత ఆలయం నుంచి ప్రారంభం**

**వివేకానంద ఆడిటోరియంలో భారీ సభ**

**అనంతరం జిల్లా కార్యవర్గ విస్తృత స్థాయి భేటీ**

**మేధావులు, యువత, స్వచ్ఛంద సంస్థలు తరలిరావాలి**

**పిలుపునిచ్చిన జిల్లా అధ్యక్షులు అభిరుచి మధు,**



**నంద్యాల సిటీ బ్యూరో అక్టోబర్ 5 ( నంది పత్రిక )** సమాజంలో సేవాభావాన్ని విస్తృతం చేయడమే లక్ష్యంగా 'సేవా సంకల్ప అభియాన్' ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన నంద్యాలలో 'సేవా జ్యోతి యాత్ర'ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని అట్టహాసంగా, ఒక పండుగ వాతావరణంలో జరిపేందుకు బీజేపీ శ్రేణులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు.అక్టోబర్ 7న ఉదయం 9:00 గంటలకు నంద్యాలలోని భారతమాత దేవాలయం వద్ద ఈ సేవా జ్యోతి యాత్ర లాంఛనంగా ప్రారంభం కానుంది. అక్కడినుంచి కదం తొక్కుతూ సాగే భారీ ర్యాలీ రామకృష్ణ డిగ్రీ కళాశాలలోని వివేకానంద ఆడిటోరియం వద్దకు చేరుకుని ముగుస్తుంది. ఈ యాత్రలో స్వచ్ఛంద సేవా సంస్థలు, కళాశాలల విద్యార్థులు, క్రీడాకారులు, వైద్యులు, న్యాయవాదులు, మేధావులు, వివిధ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాలుపంచుకోనున్నారు. ర్యాలీ వివేకానంద ఆడిటోరియంకు చేరుకున్న అనంతరం అక్కడ భారీ సభను నిర్వహించనున్నారు. సేవా కార్యక్రమాల ఆవశ్యకతను వివరించనున్నారు. ఈ కార్యక్రమం పూర్తయిన వెంటనే అదే ప్రాంగణంలో విస్తృత స్థాయి జిల్లా కార్యవర్గ సమావేశం జరగనుంది. భవిష్యత్ కార్యాచరణ, సంస్థాగత అంశాలపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించనున్నారు. సేవా జ్యోతి యాత్రను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షులు అభిరుచి మధు, సేవా సంకల్ప అభియాన్ నంద్యాల జిల్లా కన్వీనర్ నిమ్మకాయల సుధాకర్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. జిల్లాలోని అన్ని మండల కమిటీలు, మోర్చాల నాయకులు, కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ ఉదయం 9 గంటలకల్లా తప్పనిసరిగా నంద్యాలకు చేరుకోవాలని సూచించారు. ప్రజలను, వివిధ సంస్థలను స్వయంగా కలిసి ఆహ్వానించాలని, భారీ సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని చారిత్రాత్మకం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

# వన్యప్రాణుల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన





**అడవుల పరిరక్షణతోనే పర్యావరణ సమతుల్యత**

**వన్యప్రాణులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్న అటవీశాఖ అధికారులు**

**డోన్ - నంది పత్రిక అక్టోబర్ 5** వన్యప్రాణుల వారం కార్యక్రమంలో భాగంగా డోన్ అటవీశాఖ ఆధ్వర్యంలో పాతపేట ఎంపీయూపీ పాఠశాలలో విద్యార్థులకు అడవులు, వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డోన్ రేంజర్ రవీంద్ర నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు అడవుల ప్రాధాన్యత, వన్యప్రాణుల సంరక్షణ ఆవశ్యకత, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అటవీశాఖ అధికారులు మాట్లాడుతూ అడవులు, వన్యప్రాణులు ప్రకృతి సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. అడవుల నరికివేత, వన్యప్రాణుల వేట, అక్రమ రవాణా వంటి చర్యల వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని వివరించారు. అడవులు అంతరించిపోతే వర్షపాతం తగ్గడంతో పాటు జీవవైవిధ్యానికి ముప్పు ఏర్పడుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించడంతో పాటు అడవుల పరిరక్షణలో భాగస్వాములు కావాలని సూచించారు. వన్యప్రాణులు జనావాసాల్లోకి వచ్చినప్పుడు వాటిని భయపెట్టడం, హాని చేయడం లేదా పట్టుకునే ప్రయత్నం చేయకుండా వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. వన్యప్రాణుల పట్ల విద్యార్థులు స్నేహపూర్వకంగా వ్యవహరించాలని, వాటి ఆవాసాలను కాపాడేందుకు సమాజంలో అవగాహన కల్పించాలని తెలిపారు. విద్యార్థులు పర్యావరణ పరిరక్షణను తమ బాధ్యతగా భావించి, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, మొక్కలను సంరక్షించడం, ప్రకృతి వనరులను పొదుపుగా వినియోగించడం వంటి మంచి అలవాట్లను అలవర్చుకోవాలని అధికారులు సూచించారు. పాఠశాల స్థాయి నుంచే పర్యావరణంపై అవగాహన పెంపొందించడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చన్నారు. అనంతరం విద్యార్థులకు అడవులు, వన్యప్రాణులు, జీవవైవిధ్యంపై పలు విషయాలను వివరించి, వాటి సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రవీంద్ర నాయక్, మౌలాలి, విష్ణు, కుమార్, భారతి, మహేశ్వరి, శకుంతల, సునీత, శివమ్మ తదితర అటవీశాఖ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం టిడిపి నంద్యాల జిల్లా అధ్యక్షురాలు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి




**కర్నూలు సిటీ నంది పత్రిక** ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరము అని టిడిపి నంద్యాల జిల్లా అధ్యక్షురాలు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి అన్నారు. పాణ్యం నియోజకవర్గానికి చెందిన 44 మంది లబ్ధిదారులకు రూ 24, 52, 218/- విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పాణ్యశీ ఎమ్మెల్యే, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గౌరు చరిత రెడ్డి యువ నాయకులు గౌరు జనార్దన్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారు. ఆపదలో ఉన్న పేదలకు సీఎం సహాయనిధి ఒక వరంలాంటిదనీ, అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది అని తెలిపారు. ఇప్పటివరకు లబ్ధిదారుల సంఖ్య 577 మందికి,5 కోట్ల 62 లక్షల 13 వేల 139 రూపాయలు (5,62,13,139) అందజేశామని తెలిపారు కార్యక్రమంలో లబ్ధిదారులు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్‌లో వీఆర్‌ల నిరసన: ఇతర రాష్ట్రాలతో పోలిస్తే అరకొర వేతనాలు సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్

**పోరుమామిళ్ల, అక్టోబర్ 5 (నంది పత్రిక ):**రాష్ట్రవ్యాప్తంగా గ్రామ రెవెన్యూ సహాయకుల (వి ఆర్ ఏ ) సమస్యలను తక్షణమే పరిష్కరించి, తమ న్యాయమైన డిమాండ్లకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తూ వీఆర్‌ఏలు చేపట్టిన శాంతియుత సమ్మె కొనసాగుతోంది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమ సంఘ నాయకులతో చర్చలు జరిపి న్యాయం చేయాలని పోరుమామిళ్ల మండల వీఆర్‌ఏల సమితి కోరింది.

**ఎన్నికల హామీలను గుర్తుచేసిన వీఆర్‌ఏ లు** 2024 ఎన్నికల ముందు పాదయాత్రలు, బహిరంగ సభల సందర్భంగా ఇచ్చిన హామీలను ఈ సందర్భంగా వీఆర్‌ఏ నాయకులు గుర్తుచేశారు. నారా లోకేష్ పాదయాత్ర: 2024లో కర్నూలులో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో తమ కష్టాలను వివరించగా, ప్రభుత్వం రాగానే వీఆర్‌ఏలకు అండగా ఉంటామని నారా లోకేష్ హామీ ఇచ్చారని తెలిపారు.

**చంద్రబాబు నాయుడు ప్రకటన:** బహిరంగ సభల్లో వీఆర్‌ఏల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారని పేర్కొన్నారు.

**పవన్ కళ్యాణ్ భేటీ & మేనిఫెస్టో:** మంగళగిరిలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను కలసి సమస్యలు వివరించినప్పుడు, తమ అంశాలను కూటమి మేనిఫెస్టోలో కూడా చేర్చారని విన్నవించారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందున, ఇచ్చిన హామీల ప్రకారం తక్షణమే చర్చలు జరిపి తమకు న్యాయం చేయాలని వీఆర్‌ఏలు విజ్ఞప్తి చేశారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏపీలో తీవ్ర వేతన వ్యత్యాసం (60% - 75% తక్కువ)



పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లోని వీఆర్‌ఏల వేతనాలు అత్యంత దయనీయంగా ఉన్నాయని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని నాయకులు డిమాండ్ చేశారు. వివిధ రాష్ట్రాల్లో గ్రామ స్థాయి రెవెన్యూ సిబ్బంది పొందుతున్న వేతనాల వివరాలు:ఆంధ్రప్రదేశ్ లో వీ ఆర్ ఏ లకు రూ. 10,500 మాత్రమే (అత్య ల్పం) తెలంగాణ లో రూ. 29,000 రూ.38,000 (అత్యధికం ) కర్ణాటక లో రూ.28,000 రూ.35,000 (అత్యధికం)మహారాష్ట్ర లో రూ.30,000 రూ.40,000 (అత్యధికం)పంజాబ్, పట్వారీ లో రూ.32,564 (అత్యధికం )రాజస్థాన్ । పట్వారీ లో రూ.24,000 । (అత్యధికం)ఇలా ఇతర రాష్ట్రాల్లో రూ. 24,000 నుండి రూ. 40,000 వరకు జీతాలు చెల్లిస్తుండగా, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం కేవలం రూ. 10,500 మాత్రమే ఇస్తున్నారని, ఇది ఇతర రాష్ట్రాల కంటే 60% నుండి 75% తక్కువ అని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వానికి పోరుమామిళ్ల మండల సమితి విజ్ఞప్తిరాష్ట్రంలోని వీఆర్‌ఏలందరి తరఫున ప్రభుత్వం తక్షణమే స్పందించి, వేతనాల పెంపుతో పాటు అన్ని రకాల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని పోరుమామిళ్ల మండల వీఆర్‌ఏ సంఘం డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో ప వైఎస్సార్ కడప జిల్లా, పోరుమామిళ్ల మండల అధ్యక్షురాలు సుజాత, ఉపాధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, వరాలు మరియు ఇతర వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

## అహోబిలం లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న భూమా జగత్



**ఆళ్లగడ్డ ప్రతినిధి అక్టోబర్ 5 నంది పత్రిక** ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ అహోబిల లక్ష్మీనరసింహస్వామి వారిని ఆళ్లగడ్డ టిడిపి యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి సోమవారం దర్శించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయనకు ఆలయ ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాలన్ ఘన స్వాగతం పలికారు అనంతరం స్వామివారికి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి ఆయనకు తీర్థప్రసాదాలు అందజేశారు టిడిపి నాయకులు గూడూరు సంజీవ రాయుడు ఎస్ ఎల్ వి రమణ టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు



# మహానందిలో వైభవంగా ప్రారంభమైన అర్చకుల శిక్షణ తరగతులు





**సంస్కృతి,సాంప్రదాయాల పరిరక్షణలో అర్చకులదే కీలక పాత్ర సీత డైరెక్టర్ ముక్తేశ్వరరావు**

**మహానంది అక్టోబర్ 05 (నంది పత్రిక):-** హైందవ సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణలో అర్చకులదే అత్యంత ప్రాధాన్యత కలిగిన పాత్ర అని రాష్ట్ర దేవాలయాల పాలన సంస్థ (సీత) డైరెక్టర్, మాజీ కమిషనర్ ముక్తేశ్వరరావు పేర్కొన్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన మహానంది లోని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కళ్యాణ మండపంలో అర్చకులకు 5 రోజుల పాటు నిర్వహించే ప్రత్యేక శిక్షణ కార్యక్రమం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని మహానంది దేవస్థానం చైర్మన్ నరాల చంద్రమౌళీశ్వర రెడ్డి, ఆలయ ఈవో శ్రీనివాస్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ చంద్రమౌళీశ్వర రెడ్డి మాట్లాడుతూ.. మన సనాతన ధర్మాన్ని, శాస్త్ర సాంప్రదాయాలను ఒక వారసత్వ సంపదగా కాపాడుకుంటూ, వాటిని యథాతథంగా భావి తరాలకు అందించాల్సిన గురుతర బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఆలయాల్లో నిత్యం నిర్వహించే ధూపదీప నైవేద్యాలు, ఇతర కైంకర్యాలను మరింత శుద్ధిగా, శాస్త్రోక్తంగా మరియు నియమబద్ధంగా నిర్వహించేందుకు ఈ ఐదు రోజుల శిక్షణా తరగతులు అర్చకులకు ఎంతగానో దోహదపడతాయని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో అర్చకులు పాల్గొన్నారు.

## ప్రొద్దుటూరులో జరిగే సీఎం సభకు మర్రిపల్లె నుండి కదిలిన టిడిపి నాయకులు



**ఆళ్లగడ్డ ప్రతినిధి అక్టోబర్ 5 నంది పత్రిక** ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆదేశాల మేరకు ఆళ్లగడ్డ మండలం మర్రిపల్లె గ్రామ టిడిపి నాయకుడు పత్తిపాపిరెడ్డి ఆధ్వర్యంలో ప్రొద్దుటూరులో నిర్వహించనున్న ముఖ్య మంత్రి కార్యక్రమానికి హాజరయ్యేందుకు మర్రిపల్లె నుండి టిడిపి నాయకులు కార్యకర్తలు ఉత్సాహంగా సిద్ధమై ప్రొద్దుటూరు కి బయలుదేరారు

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

# గిరిజన ఉత్పత్తులకు 'వనస్య'తో మెరుగైన మార్కెటింగ్

## స్థానిక ఉత్పత్తులకు మార్కెట్.. మహిళలకు స్థిరమైన ఆదాయం కల్పించడమే లక్ష్యం: కలెక్టర్ రాజకుమారి గణియా

**నంద్యాల బ్యూరో, అక్టోబరు 05(నంది పత్రిక):–** మహిళలు, గిరిజన మహిళలు, స్థానిక ఉత్పత్తిదారులు తయారు చేస్తున్న సహజసిద్ధమైన ఉత్పత్తులకు విస్తృత మార్కెటింగ్ అవకాశాలు కల్పించి, వారి జీవనోపాధిని మరింత బలోపేతం చేయడమే 'వనస్య ది ఎక్స్‌పీరియన్స్ సెంటర్' ప్రధాన ఉద్దేశమని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలు ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన 'వనస్య ది ఎక్స్‌పీరియన్స్ సెంటర్'ను కలెక్టర్ సందర్శించి, అక్కడ ప్రదర్శనకు, విక్రయాలకు ఉంచిన వివిధ ఉత్పత్తులను పరిశీలించారు. ఉత్పత్తుల తయారీ, ధరలు, విక్రయాలు, మార్కెటింగ్ విధానం తదితర అంశాలపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో మహిళలు చేపడుతున్న జీవనోపాధి కార్యక్రమాలకు అవసరమైన మార్కెటింగ్ సహకారం అందించడం ద్వారా వారికి స్థిరమైన ఆదాయ అవకాశాలను కల్పించవచ్చని తెలిపారు. స్థానికంగా తయారయ్యే నాణ్యమైన ఉత్పత్తులకు ప్రత్యేక మార్కెటింగ్ వేదిక అందుబాటులోకి రావడం వల్ల మహిళా సంఘాలు, గిరిజన మహిళలు, చిన్నతరహా ఉత్పత్తిదారులు తమ ఉత్పత్తులను విస్తృత మార్కెట్‌కు చేరువ చేయగలుగుతారని పేర్కొన్నారు. ఉత్పత్తి నుంచి మార్కెటింగ్ వరకు మహిళా ఉత్పత్తిదారులకు అవసరమైన సహకారం అందించి, 'వనస్య'ను సమర్థవంతమైన మార్కెటింగ్ వేదికగా అభివృద్ధి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.



రోజువారీ విక్రయాలకు మాత్రమే పరిమితం కాకుండా ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, విద్యాసంస్థలు తదితర ప్రాంతాల నుంచి పెద్ద మొత్తంలో ఆర్డర్లు వచ్చేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. జిల్లాలోని మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులకు మరింత ప్రోత్సాహం కల్పించేలా సోవెనీర్ లేదా గిఫ్ట్ ప్యాక్‌లను స్థానిక మహిళా ఉత్పత్తులతోనే రూపొందించాలని కలెక్టర్ సూచించారు. ఇందుకోసం ఉత్పత్తుల ఎంపిక, ప్యాకేజింగ్, ధరలను నిర్ణయించి, స్థిరమైన రేట్లతో ప్రత్యేక గిఫ్ట్ ప్యాక్ నమూనాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. వనస్య సెంటర్‌లో మహిళలు తయారు చేస్తున్న జ్యువెలరీ, జూట్ బ్యాగులు, పౌచ్‌లు, అలంకరణ వస్తువులు, ఇతర హస్తకళా ఉత్పత్తులు అందుబాటు ధరల్లో లభిస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాలు, సమావేశాలు, వివిధ ఈవెంట్లలో వేదిక అలంకరణకు ఉపయోగించే బొమ్మలు (డాల్స్), ఇతర అలంకరణ ఉత్పత్తులు కూడా మహిళా సంఘాల ద్వారా తయారు చేస్తున్నందున వాటిని విస్తృతంగా వినియోగించుకోవాలని సూచించారు. అలాగే అవసరానికి అనుగుణంగా జూట్ బ్యాగులు, పౌచ్‌లు తదితర ఉత్పత్తులను రెండు, మూడు రోజుల్లోనే ప్రత్యేక డిజైన్‌తో తయారు చేసి అందించే అవకాశం ఉందని తెలిపారు. మహిళా ఉత్పత్తులకు విస్తృత ప్రచారం కల్పించి, ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలు, విద్యాసంస్థల ద్వారా బల్క్ ఆర్డర్లు వచ్చేలా మార్కెటింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మెడికల్, పాలిటెక్నిక్ తదితర కళాశాలల్లో వనస్య ఉత్పత్తులపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ, అధికారిక కార్యక్రమాల్లో బొకేలు, షాల్స్‌కు బదులుగా స్థానిక మహిళా ఉత్పత్తులను ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. ప్రజలు స్థానిక ఉత్పత్తులను కొనుగోలు చేసి మహిళల జీవనోపాధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మనీషా, డీఆర్డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, మెప్మా పీడీ వెంకటదాసు, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి 15 రోజులకు ఇంజనీరింగ్ పనుల పురోగతిపై సమీక్ష

## భూ కేటాయింపులకు ఈ-ఫైల్ ద్వారా నిర్దేశిత విధానమే పాటించాలి పిల్లల ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్ తప్పనిసరిగా పూర్తి చేయాలి: కలెక్టర్ రాజకుమారి గణియా

**నంద్యాల బ్యూరో, అక్టోబరు 05(నంది పత్రిక):–** జిల్లాలో కొనసాగుతున్న ఇంజనీరింగ్ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, నిర్మాణాలు పూర్తయిన ప్రాజెక్టులను వినియోగానికి సిద్ధం చేసి సంబంధిత శాఖలకు అప్పగించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. పనుల పురోగతిని ప్రతి 15 రోజులకు ఒకసారి స్వయంగా సమీక్షిస్తానని తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరణ అనంతరం అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వివిధ శాఖల అభివృద్ధి పనులు, భూ కేటాయింపులు, ఇంజనీరింగ్ ప్రాజెక్టులు, ఆధార్ నవీకరణపై పలు కీలక సూచనలు చేశారు. ఏ శాఖకైనా భూమి అవసరమైతే సంబంధిత హెచ్ఓడీ లేదా ప్రిన్సిపల్ సెక్రటరీ ద్వారా ఈ–ఫైల్ రూపంలో కలెక్టర్‌కు రిక్విజిషన్ పంపించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కలెక్టర్ ఆదేశాల అనంతరం మాత్రమే జాయింట్ కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్ల ద్వారా భూ కేటాయింపు ప్రక్రియ చేపట్టాలని సూచించారు. 5 నుంచి 7 సంవత్సరాలు, 15 నుంచి 17 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్ తప్పనిసరిగా చేయించాలని కలెక్టర్ ఆదేశించారు.




జిల్లాలో సుమారు 52,133 మంది విద్యార్థులు బయోమెట్రిక్ అప్‌డేట్ చేసుకోవాల్సి ఉన్నందున, దసరా సెలవులను దృష్టిలో ఉంచుకుని పాఠశాలలను సమీప ఆధార్ కేంద్రాలు లేదా మొబైల్ కిట్లతో అనుసంధానం చేసి ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. జిల్లాలో అందుబాటులో ఉన్న 169 ఆధార్ కేంద్రాల వివరాలను చిరునామాలతో సహా డి ఈ ఓ లు లకు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. మాండేటరీ బయోమెట్రిక్ అప్‌డేట్ ఉచితంగా చేయాలని, ఇతర సేవలకు ప్రభుత్వం నిర్దేశించిన రుసుములనే వసూలు చేయాలని, అదనపు రుసుములు వసూలు చేసే కేంద్రాలపై చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఆళ్లగడ్డ లోని బాలసదనంలో నివసించే చంటి పిల్లల భద్రతకు ప్రాధాన్యత కల్పిస్తూ ఎలక్ట్రికల్, సివిల్ పనులను పూర్తి భద్రతతో చేపట్టాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బాలసుదన్ సమీపంలో ప్రమాదకరంగా ఉన్న పాత బావికి రక్షణ చర్యలు చేపట్టడంతో పాటు రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణం వంటి పనులను చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. పీఆర్, ఆర్‌డబ్ల్యుఎస్, ఈడబ్ల్యుఐడీసీ, సమగ్ర శిక్ష, మున్సిపాలిటీ తదితర శాఖలు సమన్వయంతో పనులను వేగవంతం చేయాలని సూచించారు. పెచ్చేరువు వద్ద టాయిలెట్, నీటి వసతులు పూర్తయినందున సోలార్ ప్యానెల్స్, విద్యుత్ సదుపాయాల ఏర్పాటుకు నెడ్క్యాప్ ద్వారా అంచనాలు సిద్ధం చేసి తదుపరి చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

# విద్యార్థుల హాజరు పై ప్రత్యేక దృష్టి సారించాలి

## నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి విద్య, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సమీక్షించిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

**నంద్యాల బ్యూరో, అక్టోబర్ 05(నంది పత్రిక):–** పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు శాతాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ విద్యా ప్రమాణాల మెరుగుదలకు చర్యలు చేపట్టాలని, బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి తిరిగి పాఠశాలల్లో చేర్పించేలా ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో అమలవుతున్న నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి యువతకు పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. సోమవారం కలెక్టర్ ఛాంబర్‌లో పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి మరియు శిక్షణ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించి వివిధ కార్యక్రమాల అమలు తీరు, పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థుల రోజువారీ హాజరును పకడ్బందీగా పర్యవేక్షించాలని, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం నిర్దేశించిన మిషన్ మార్చి-2027 లక్ష్యాల సాధనకు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు లీప్ (లీప్) యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునేలా అవగాహన కల్పించాలని, ఐవీఆర్ఎస్ (ఇవర్స్) విధానం ద్వారా పాఠశాలల పనితీరుపై ప్రజాభిప్రాయ సేకరణను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.



కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు అవసరమైన స్థల కేటాయింపు సమస్యలను పరిష్కరించడంతో పాటు, జవహర్ నవోదయ విద్యాలయ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలపై తదుపరి చర్యలు వేగవంతం చేయాలని తెలిపారు. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి వారి వయస్సుకు తగిన తరగతుల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని, సమగ్ర శిక్ష కార్యక్రమాల అమలులో నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. అనంతరం నైపుణ్యాభివృద్ధి, ఉపాధి మరియు శిక్షణ శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న వివిధ పథకాల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీ), దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన (డి డి యు –జి కే వై ), పీఎం సేతు (పీఎం –సేతు), నేషనల్ అప్రెంటిస్‌షిప్ ప్రమోషన్ స్కీమ్, ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ స్కీమ్, స్కిల్ పోర్టల్ రిజిస్ట్రేషన్లు, భవన నిర్మాణ మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమానికి సంబంధించిన బి ఓ సీ డబ్ల్యూ , ఓంకాప్ తదితర కార్యక్రమాల అమలు, పురోగతిపై సమీక్షించారు. ప్రభుత్వ పథకాల ద్వారా యువతకు నైపుణ్య శిక్షణ అందించడంతో పాటు, శిక్షణ పొందిన అభ్యర్థులకు పరిశ్రమలు, వివిధ సంస్థల్లో అప్రెంటిస్‌షిప్, ఇంటర్న్‌షిప్, ఉపాధి అవకాశాలు కల్పించేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. అర్హులైన యువతకు పథకాల ప్రయోజనాలు చేరేలా విస్తృత అవగాహన కల్పించాలని, పోర్టల్ రిజిస్ట్రేషన్లలో పురోగతి సాధించాలని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్ రెడ్డి, సమగ్ర శిక్ష పీఓ సుధాకర్ రెడ్డి, జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి సోమశివారెడ్డి, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి శ్రీకాంత్ రెడ్డి, ఎన్ఏసీ ఏ.డీ. సంతోష్, సీడాప్ జేడీఎం షాజహా తదితరులు పాల్గొన్నారు.

# ఖరీదైన మాల్‌కు వచ్చి ఇదేం పని?.. అందరి ముందు మహిళ పరువుపోయింది!

నోయిడాలోని అత్యంత ఖరీదైన డీఎల్ఎఫ్ మాల్ ఆఫ్ ఇండియా ఆదివారం సాయంత్రం కావడంతో జనంతో కిటకిటలాడుతోంది. చూడటానికి ఉన్నత కుటుంబానికి చెందిన ఓ జంట షాపింగ్ కోసం అక్కడి 'లీ మార్షే' స్టోర్‌లోకి అడుగుపెట్టింది. అంతా బాగానే ఉంది కానీ, కాసేపటికే కథ అడ్డం తిరిగింది. భర్త బిల్లింగ్ కౌంటర్ వద్ద ఉండగా, భార్య మాత్రం ఒంటరిగా బయటకు నడిచింది. ఆమె ప్రవర్తనలో ఏదో తేడా కనిపించడంతో స్టోర్ సిబ్బందికి అనుమానం కలిగింది. వెంటనే ఆమెను ఆపి, బ్యాగును తనిఖీ చేస్తామన్నారు. అందుకు ఆమె మొదట తీవ్రంగా నిరాకరించింది. దీంతో సిబ్బంది నేరుగా సీసీటీవీ ఫుటేజీని పరిశీలించగా అసలు విషయం బయటపడింది. ఓ కిలో నెయ్యి ప్యాకెట్, కిలో వంట నూనె బాటిల్‌ను ఆమె తన హ్యాండ్‌బ్యాగులో చాకచక్యంగా దాచిన దృశ్యాలు కెమెరాలో స్పష్టంగా రికార్డయ్యాయి. దీంతో సిబ్బంది వెంటనే ఆమె భర్తను పిలిపించి, జరిగిన విషయం చెప్పారు. మిగతా కస్టమర్ల ముందే ఇద్దరినీ మందలించారు. ఈ ఊహించని పరిణామంతో ఆ మహిళ పరువు పోయినట్టయింది. చివరకు ఆ వస్తువులకు ఆమె డబ్బు చెల్లించడంతో, ఇరుపక్షాలు రాజీకి వచ్చాయి. అయితే, అప్పటికే కొందరు ఈ ఘటనను తమ ఫోన్లలో వీడియో తీశారు. భద్రతా సిబ్బంది ఆమెను తీసుకెళుతుండగా, ఫోన్‌తో ముఖం కప్పుకుని నడుస్తున్న వీడియోలు కొద్దిసేపటికే సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. స్టోర్ సిబ్బంది కథనం ప్రకారం, ఆమె గత నెల రోజులుగా తమ స్టోర్‌కు వస్తోందని, అప్పటికే వేల రూపాయల విలువైన నెయ్యి, ఇతర సరుకులు దొంగిలించినట్లు సీసీటీవీ ఫుటేజీ ద్వారా గుర్తించామని ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై నెటిజన్లు భిన్నరకాలుగా స్పందిస్తున్నారు. ఇంత ఉన్నత కుటుంబానికి చెందిన మహిళ, నెయ్యి, నూనె వంటి నిత్యావసరాల కోసం దొంగతనం చేయడమేంటని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇది క్లెప్టోమేనియా (దొంగతనం చేసే మానసిక రుగ్మత) కావొచ్చని కొందరు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కారణం ఏదైనా, ఓ చిన్న దొంగతనం ఆమెను అందరి ముందు దోషిగా నిలబెట్టింది. ఖరీదైన మాల్‌లో జరిగిన ఈ దొంగతనం ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.



# శ్రీ చక్ర హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

## శ్రీశైలం నియోజకవర్గ ప్రజల సంక్షేమమే బుడ్డా రాజన్న లక్ష్యం : సింగిల్ విండో చైర్మన్ శాబుద్ధిన్ & స్పోర్ట్స్ క్లబ్ గౌరవ అధ్యక్షులు రేడియం నూర్




**నంది పత్రిక ఆత్మకూరు** ప్రతిఒక్కరూ ఆరోగ్య పరీక్షలు ఎప్పటికప్పుడు చేయించుకొని ఆరోగ్యంగా ఉండాలని తన నియోజకవర్గ ప్రజల సంక్షేమమే బుడ్డా రాజశేఖర్ రెడ్డి లక్ష్యమని ఆత్మకూర్ సింగిల్ విండో చైర్మన్ షాహబుద్దీన్ తెలిపారు. ఈ సందర్భంగా శ్రీశైలం శాసనసభ్యులు .బుడ్డా రాజశేఖర్ రెడ్డి సహకారంతో కర్నూలు శ్రీ.చక్ర హాస్పిటల్ వైద్యబృందం చే ఆత్మకూర్ స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా మరియు 86 బూత్ ఇంచార్జి వలి .మహబూబ్ ఆధ్వర్యంలో ఇస్లాంపేట ఏరియాలోని 86 బూత్ లో మెడికల్ క్యాంప్ కి ముఖ్య అతిధులుగా హాజరై ప్రారంభించారు. ఈ క్యాంప్ లో గుండెకి సంబందించిన ఈసీజీ , 2డి ఈ సి హెచ్ ఓ పరీక్షలు కంటికి సంబందించిన పరీక్షలు ఎముకల వ్యాధి సమస్యలకు పరీక్షలు నిర్వహించారు. ఈ యొక్క క్యాంప్ లో దాదాపు 200 మంది హాజరయ్యారు. ఆరోగ్య శ్రీ ద్వారా శ్రీ చక్ర హాస్పిటల్ వారు సేవలు అందించడం అభినందించదగ్గ విషయమన్నారు. హాస్పిటల్ చైర్మన్ విజయకుమార్ రెడ్డి నీ అభినందించారు. హాస్పిటల్ గుండె వ్యాధి వైద్యులు ఆంజనేయులు మాట్లాడుతూ షుగర్ బీపీ వ్యాధిగ్రస్తులు ప్రతి ఆరు నెలలకు ఒకసారి గుండె పరీక్షలు చేయించుకోవాలి అన్నారు. అన్ని రకాల పరీక్షలు చేసి సంబంధిత వ్యాధి గ్రస్తులకు ఉచిత మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తైక్వాండో గౌరవ అధ్యక్షులు నాయబ్.సయ్యద్.అసదుల్లా ,సాదిక్ ,పాన్మహమ్మద్ ,యువ కిరీటం ముసలిమడుగు మహబూబ్,గుండెవ్యాది నిపుణులు డాక్టర్ ఆంజనేయులు మేనేజర్.రాజేష్,ధర్మేంద్ర,ఈసీజీ టెక్నీషియన్ సురేఖ,భార్గవి కంటి వైద్య నిపుణులు ఫైజుల్ భాష,బావుజీ,ప్రసాద్ పాల్గొన్నారు.



# దొంగతనము కేసులో ముద్దాయి అరెస్టు



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు జిల్లా, ఆస్పరి మండలం, ములుగుందం గ్రామానికి చెందిన ఆవుల మృత్యుంజయుడు మరియు అతని తమ్ముడు అయిన ఆవుల ప్రభాకర్ అను వ్యక్తుల యొక్క జేసీబీ లను కర్నూలు టౌన్, నంద్యాల చెక్ పోస్ట్ వద్ద ఉంచగా, సదరు రెండు జేసీబీ లను 02.10.2026 వ తేదీ మరియు 03.10.2026 వతేదీ లలో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనము చేసినారు అని ఫిర్యాదులు ఇచ్చినారు. త్రీ టౌన్ పిఎస్ క్రైమ్ నెంబర్ 274 /2026 యు /సెక్షన్ 307 బి ఎన్ ఎస్ 2 క్రైమ్ నెంబర్ 276 / 2026యు / సెక్షన్ పై ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కర్నూల్ ×××– టౌన్ పోలీస్ స్టేషన్ నందు పై రెండు కేసులు నమోదు చేసి, కర్నూలు జిల్లా యస్ పి గారి ఉత్తరువుల మేరకు. కర్నూలు యస్ డి పి ఓ ఆధ్వర్యములో, కర్నూలు 3 టౌన్ సీఐ తన సిబ్బందిని ప్రత్యేక టీమ్ లుగా ఏర్పరచి, ముద్దాయిల కోసం వెతుకుతుండగా కర్నూలు టౌన్, బుధవారపేట, హబీబ్ ముబారక్ నగర్ కు చెందిన చిన్నపోగు పవన్ కుమార్ ఏ పవన్ 27 సంవత్సరాలు తండ్రి సి విజయ్ కుమార్ అను నతడు తాగుడుకు బానిస అయ్యి, జల్సాలు చేయడానికి మరియు మద్యము తాగడానికి డబ్బులు లేక దొంగతనము చేయాలి అని, దొంగతనము చేయు సమయములో తనకు ఎవరైనా అడ్డు వస్తే అతని వద్ద ఉన్న కత్తితో చంపి అయిన, గాయపరిచి అయిన లేదా బెధిరించి అయిన సరే దొంగతనము చేయాలి అని అనుకోని తన దగ్గర ఉన్న నకిలీ తాళము చెవితో నంద్యాల చెక్ పోస్ట్ వద్ద ఉన్న రెండు జేసీబీ లను దొంగతనము చేసినాడు అని, రెండవ జేసీబీ ని దొంగతనము చేసి నడుపుకుంటూ పోవు సమయములో నంద్యాల చెక్ పోస్ట్ నుండి నంద్యాలకు పోయే మార్గంలో ఉన్న కరెంట్ పోల్ లను గుద్ది, కరెంట్ పోల్ లను విరగొట్టినాడు అని తెలిసి సదరు ముద్దాయిని సోమవారం తన ఇంటి వద్ద అదుపులోనికి తీసుకొని అతని వద్ద నుండి

**రికవరీ ప్రాపర్టీ** 1. రెండు జేసీబీ లు 2.కత్తి 3. నకిలీ తాళము చెవి లను స్వాధీన పరుచుకోవడమైనది. పై రెండు కేసులు నమోదు చేసిన 24 గంటల లోపు కేసును చేధించి ముద్దాయి నుండి రెండు జేసీబీ లను రికవరీ చేసినందుకు గాను కర్నూలు యస్ డి పి ఓ కర్నూలు 3 టౌన్ సిఐ, పి . శేషయ్య ని మరియు వారి సిబ్బందిని యస్ పి అభినందించడమైనది.

# అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపుతాం

## ఆళ్లగడ్డ పట్టణ సీఐ రాము

**ఆళ్లగడ్డ ప్రతినిధి అక్టోబర్ 5** ఆళ్లగడ్డ పట్టణంలో శాంతి భద్రతల సంరక్షణ, అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపుతామని ఆళ్లగడ్డ టౌన్ సీఐ రాము హెచ్చరించారు. సోమవారం ఆయన నూతన టౌన్ సీఐ గా పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ రోజు ఆళ్లగడ్డ సీఐగా భాధ్యతలు స్వీకరించడం జరిగిందన్నారు. గతంలో ఆత్మకూరు సీఐ గా పని చేసినప్పుడు పోలీసు ఉద్యోగాల కోసం శిక్షణ ఇవ్వగా ఐదు మంది అభ్యర్థులకు పోస్టింగ్ రావడం జరిగిందన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలో కూడా మంచి క్రీడా మైదానం ఉండడంతో తాము భవిష్యత్తులో ఇక్కడ కూడా పోలీస్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇచ్చి తీర్చిదిద్దుతామని సిఐ రాము తెలిపారు. ప్రజలు కేసుల విషయంలో ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా తమను సంప్రదిస్తే న్యాయం జరుగుతుందని సిఐ రాము వివరించారు.

# విటమిన్ బీ12 సప్లిమెంట్లు వాడుతున్నా ఒంటబట్టట్లేదా? కారణం ఇదే!

విటమిన్ బీ12 లోపంతో బాధపడుతూ సప్లిమెంట్లు వాడుతున్నా ఫలితం కనిపించక చాలామంది ఇబ్బంది పడుతుంటారు. ఎంత మోతాదులో ట్యాబ్లెట్లు వేసుకున్నా రక్తపరీక్షల్లో బీ12 స్థాయిలు మాత్రం పెరగవు. దీనికి కారణం మనం తీసుకునే సప్లిమెంట్ల నాణ్యతలో లోపం కాదు, మన శరీరమే దానిని సరిగ్గా గ్రహించకపోవడమని తాజా అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ అంశంపై 'ది టైమ్స్ ఆఫ్ ఇండియా' ప్రచురించిన ఒక కథనం

# ప్రజా సంతృప్తి స్థాయిపై ప్రత్యేక దృష్టి సారించాలి

**రీఓపెన్ అర్జీలను మంగళవారం సాయంత్రంలోగా పరిష్కరించాలి**

**బియాండ్ ఎస్ఎల్ఏకు వెళ్లకుండా అర్జీలను సకాలంలో పరిష్కరించాలి**

**పిజిఆర్ఎస్‌కు 326 దరఖాస్తులు - రెవెన్యూ క్లినిక్స్‌లో 145 అర్జీలు**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

**నంద్యాల బ్యూరో, అక్టోబరు 05(నంది పత్రిక):-** ప్రభుత్వ సేవలపై ప్రజల్లో సంతృప్తి స్థాయిని మరింత పెంచేలా అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నాణ్యతతో పాటు అర్జీదారులతో అధికారులు వ్యవహరించే తీరు, స్పందించే విధానం కూడా ప్రజా సంతృప్తిపై ప్రభావం చూపుతుందని, దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీలను స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్ వివిధ అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ జి. సూరజ్ ధనుంజయ్, సబ్ కలెక్టర్ మనీషా, డీఆర్ఓ రాము నాయక్, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి ఉమామహేశ్వరి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలపై ప్రజా సంతృప్తి స్థాయిని తెలుసుకునేందుకు ప్రభుత్వం నేరుగా అర్జీదారులకు ఫోన్ చేసి వారి అభిప్రాయాలను సేకరిస్తోందన్నారు. అధికారులు అందించిన పరిష్కారంపై ప్రశ్నలు అడిగిన అనంతరం మాత్రమే అర్జీదారులు తమ స్పందనను నమోదు చేసేలా వారికి సరైన అవగాహన కల్పించాలని సూచించారు. పీజీఆర్ఎస్‌లో అర్జీదారులతో అధికారులు, సిబ్బంది మాట్లాడే విధానం, వారి ప్రవర్తన, స్పందించే తీరు వంటి అంశాలపై కూడా అభిప్రాయాలను సేకరిస్తున్నందున ప్రతి అధికారి ప్రజల పట్ల మర్యాదపూర్వకంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు సంబంధించి సుమారు 30 అర్జీలు రీఓపెన్ అయ్యాయని వాటన్నింటినీ మంగళవారం సాయంత్రం లోగా పూర్తిస్థాయిలో పరిష్కరించాలని సంబంధిత అధికా రులను ఆదేశించారు. అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏకు వెళ్లడం వల్ల జిల్లా ర్యాంకింగ్‌పై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉన్నందున, ప్రతి అర్జీని నిర్దేశిత గడువులోగా పరిష్కరించేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. భవిష్యత్తులో అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏకు వెళ్లకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.



**రెవెన్యూ క్లినిక్స్ ద్వారా భూ సమస్యల పరిష్కారానికి చర్యలు**

భూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెవెన్యూ క్లినిక్స్‌ను సమర్థవంతంగా వినియోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు. రెవెన్యూ క్లినిక్స్ ద్వారా మొత్తం 145 దరఖాస్తులు స్వీకరించినట్లు ఆమె వివరించారు. వాటిలో రెవెన్యూ, గ్రామ/వార్డు సచివాలయ సేవలకు సంబంధించి 5, అడంగల్ సవరణలకు 14, చుక్కల భూముల క్రమబద్ధీకరణ, 22-ఏ భూములకు సంబంధించి 7, అసైన్డ్ భూములు, భూ ఆక్రమణలకు సంబంధించి 56, రెవెన్యూ కోర్టు విచారణలు/ఆర్ఓఆర్‌కు సంబంధించి 28, సర్వే, రీ-సర్వేలకు సంబంధించి 32, దేవాదాయ, వక్ఫ్ భూములకు సంబంధించి 3 దరఖాస్తులు ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు.

**పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి స్వీకరించిన కొన్ని అర్జీలు**

1)రుద్రవరం మండలం నర్సాపురం గ్రామానికి చెందిన బద్రి వెంకయ్య సర్వే నంబర్ 787/1ఎలో తనకు 3.95 సెంట్ల భూమి ఉందని, పొలానికి రహదారి సౌకర్యం లేదని, రహదారి ఏర్పాటు చేయడంతో పాటు సర్వే నంబర్‌కు సబ్ డివిజన్ చేయాలని కోరుతూ కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు.

2)మిడ్తూరు మండలం వీపనగండ్ల గ్రామానికి చెందిన చౌట్కూరు శేషిరెడ్డి సర్వే నంబర్ 441లో తనకు 7 ఎకరాల 13 సెంట్ల భూమి ఉందని, రీ-సర్వేలో 6 ఎకరాల 9.16 సెంట్లు మాత్రమే నమోదైందని, మిగిలిన భూమిని కూడా సర్వే చేసి హక్కును కల్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు.

3)బేతంచర్ల మండలం కొలుమలపల్లె గ్రామానికి చెందిన జి. నాగభూషణం సర్వే నంబర్లు 122/1, 122/2, 122/3లోని భూములకు కొలతలు నిర్వహించి, క్షేత్రస్థాయిలో హద్దులను నిర్ధారించి చూపించాలని కోరుతూ కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు.

# కూటమితోనే రాయలసీమ అభివృద్ధి

**జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత**





**ప్రొద్దుటూరు బ్యూరో చీఫ్ అక్టోబర్ 5 నంది పత్రిక** సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రంతో పాటు రాయలసీమ అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందుతోందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత తెలిపారు. రాయలసీమకు పెద్ద ఎత్తున పరిశ్రమల రాకతో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు స్థానికంగానే లభించనున్నాయన్నారు. ప్రొద్దుటూరులో రూ.30,156 కోట్లతో అమరజీవి జలధార ప్రాజెక్టు పనులకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సోమవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత మాట్లాడుతూ, ఒకప్పుడు రాళ్లు తేలిన రాయసీమలో కూటమి పాలనలో నేడు రైజింగ్ సీమగా ఆవిర్భవిస్తోందన్నారు. రాయలసీమ జిల్లాలను పారిశ్రామిక, ఇంధన హబ్‌గా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఇటీవలే రూ.లక్ష కోట్లతో హార్టీకల్చర్ హబ్ పనులకు శ్రీకారం చుట్టామన్నారు. రాయలసీమలో భారీ పరిశ్రమల ఏర్పాటుతో యువతకు స్థానికంగానే పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశకాలు లభిస్తున్నాయన్నారు. సూపర్ సిక్స్ సహా పలు సంక్షేమ పథకాలను అమలు చేయడమే కాకుండా అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టామన్నారు. పల్లె పండుగ పేరుతో రాష్ట్రంలో మారు మూలగ్రామాల్లోనూ సైతం రహదారులు నిర్మిస్తున్నామన్నారు. ఇప్పుడు రూ.30 వేల కోట్లతో అమరజీవి జలధార కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ఈ ప్రాజెక్టుతో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి నివారించడమే లక్ష్యమన్నారు. ప్రతి ఒక్కరికీ రోజుకు 55 లీటర్ల పరిశుద్ధమైన నీటిని అందించడమే లక్ష్యంగా అమరజీవి జలధార కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మంత్రి సవిత తెలిపారు.

# అమరావతి ఎకనామిక్ రీజియన్ లోని పశ్చిమగోదావరి జిల్లా ఆర్థికాభివృద్ధికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలి.

**జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ**



**భీమవరం బ్యూరో చీఫ్ అక్టోబర్ 5 నంది పత్రిక**సోమవారం కలెక్టరేట్లోని వశిష్ట సమావేశ మందిరంలో జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్ కల్పశ్రీ ఎకనామిక్ గ్రోత్ పై సంబంధిత శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, అమరావతి ఎకనామిక్ రీజియన్‌లో భాగంగా పశ్చిమగోదావరి జిల్లాలో ఆర్థికాభివృద్ధి, ఉపాధి అవకాశాలు, పెట్టుబడులు పెంపొందించేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని సంబంధిత శాఖల అధికారులకు తెలిపారు.అమరావతి ఎకనామిక్ రీజియన్‌లోని తొమ్మిది జిల్లాల్లో పశ్చిమగోదావరి జిల్లా కూడా ఒకటని తెలిపారు. జిల్లాలో అందుబాటులో ఉన్న వనరులు, వ్యవసాయం, ఉద్యానవన, పర్యాటక, పరిశ్రమలు తదితర రంగాల్లో ఉన్న అవకాశాలను సమర్థవంతంగా వినియోగించుకుని ఆర్థికాభివృద్ధిని మరింత వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.ఈ నెల 8,10 వ తేదీలలో అమరావతి ఎకనామిక్ రీజియన్ కు సంబంధించి ప్రత్యేక బృందం జిల్లాలో క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించనున్న నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు అవసరమైన సమాచారంతో సిద్ధంగా ఉండాలని సూచించారు. 9వ తేదీన కలెక్టరేట్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.వ్యవసాయం, ఉద్యానవన, పర్యాటకం, పరిశ్రమలు, ఇతర అనుబంధ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ జిల్లాలో ఆర్థిక వృద్ధికి దోహదపడే రంగాలను గుర్తించాలని తెలిపారు. ప్రతి శాఖ తమ పరిధిలో చేపట్టాల్సిన కార్యక్రమాలు, పెట్టుబడులు ఆకర్షించే అవకాశాలు, ఉపాధి కల్పన, మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించిన అంశాలను పొందుపరిచి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి శివ పార్వతి,జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు మంగపతి రావు, జిల్లా చేనేత జౌళి శాఖ కే అప్పారావు, విద్యాశాఖ అధికారి అనిల్ కుమార్, టూరిజం శాఖ అధికార, డిఆర్డిఏ పిడి ఎం ఎస్ ఎస్ వేణుగోపాల్ తదితర శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పి జి ఆర్ ఎస్ ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలి





**పెండింగ్ ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి**

**పి జి ఆర్ ఎస్ 159, రెవిన్యూ క్లినిక్ 38**

**-జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**

**భీమవరం బ్యూరో చీఫ్ అక్టోబర్ 5 నంది పత్రిక** ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో స్వీకరించిన ఫిర్యాదులను పెండింగు లో లేకుండా నిర్ణీత గడువులో సత్వరమే నాణ్యమైన పరిష్కారం అందించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ పి జి ఆర్ ఎస్ సమావేశ మందిరంలో ఫిర్యాదులపై సంబంధిత శాఖల అధికారులతో శాఖల వారీగా ఆమె సమీక్షించారు. జిల్లాలో పెండింగ్ లో ఉన్న ఫిర్యాదులు పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత చూపాలన్నారు.ముఖ్యంగా రెవెన్యూ , పంచాయతీ రాజ్, ఇరిగేషన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, సర్వే వివిధ శాఖలకు సంబంధించిన ఫిర్యాదులు ఎక్కువ పెండింగు లో ఉన్నందున వాటిపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా, పి జి ఆర్ఎస్ ద్వారా అందిన ప్రతి ఫిర్యాదును బాధ్యతగా స్వీకరించి, క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని ఆమె అన్నారు. సమస్య పరిష్కారం కాని పక్షంలో అందుకు గల కారణాలను ఫిర్యాదుదారునికి తెలియజేయాలని అన్నారు. పి జి ఆర్ ఎస్ ద్వారా ప్రజలకు అందుతున్న సేవలపై సి ఎం ఓ పర్యవేక్షణ చేస్తోందని, ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించే అధికారుల పై చర్యలు తీసుకుంటామని ఆమె అన్నారు. ప్రతి శాఖకు సంబంధించిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరుపై ప్రతి అధికారి క్షుణ్ణంగా తెలుసుకొని పథకాల అమలును ప్రజలకు వివరించాలన్నారు. కిందిస్థాయి సిబ్బంది పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ కె ఆర్ కల్పశ్రీ, డి ఆర్ ఓ పి. గ్లోరియా, జిల్లా కలెక్టరేట్ కె ఆర్ ఆర్ సి డిప్యూటీ కలెక్టర్ బి పి ప్రభాకర రావు, జిల్లా పి జి ఆర్ ఎస్ నోడల్ అధికారి వై. దోసిరెడ్డి, డ్వామా పిడి కె సి హెచ్ అప్పారావు, జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి పీజీ ఆర్ ఎస్ 159, రెవిన్యూ క్లినిక్లు 38 ఫిర్యాదులు స్వీకరించారు.

**వాటిలో కొన్ని ఫిర్యాదులు ఇలా ఉన్నవి** భీమవరం మండలం చిన్నఅమిరం గ్రామంలో ఆర్ అండ్ బి రహదారి మార్జిన్లో జరుగుతున్న సి సి డ్రైన్ నిర్మాణంలో అనేక అవకతవకలు జరుగుచున్నవి వెంటనే విచారణ చేసి పనులు సక్రముగా జరిగేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. ఆచంట మండలం భీమలాపురం గ్రామం నుండి గుబ్బల సత్యనారాయణ తన 27 సెంట్లు వ్యవసాయ భూమికి ఆన్లైన్లో నందు 25 సెంట్లు మాత్రమే చూపిస్తుంది దస్తావేజు ప్రకారం సరిచేయాలని కోరారు.

వీరవాసరం మండలం కొణితవాడ గ్రామం నుండి ఏ నీలాద్రి రాజువారికి గల భూమి సర్వీస్ ఇనాం భూముల నుండి తొలగించుటకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇరగవరం మండలం తూర్పు విప్పర్రు గ్రామం నుండి కట్టుంగ సూర్యనారాయణ, ఎస్ ఎన్ 96-3ఏ -2 ఎందు 22 సెంట్లు ఎస్ ఎన్ 92-6 బి ఎందు 36 సెంట్లు భూమి ఆన్లైన్ యందు

మా అన్నగారైన కట్టుంగ సత్యనారాయణ పేరున చూపిస్తున్నది. సరిచేసి మొత్తం 79 సెంట్లు భూమి ఆన్లైన్లో తన పేరున మార్చాలని కోరారు. భీమవరం మండలం తాడేరు గ్రామం నుండి కందగడ్డల నాగకృష్ణ విభిన్న ప్రతిభావంతుడు ముద్ర లోను మంజూరయ్యేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, వయోవృద్ధుల సంక్షేమం ట్రిబ్యునల్ మెంబరు మేళం దుర్గాప్రసాదు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# విద్యార్థినిలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

**- ఏఎస్ఐ షేక్ నూర్ అహమ్మద్**



**కొత్తపల్లి - నంది పత్రిక :** విద్యార్థినిలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని శక్తి టీం ఏఎస్ఐ షేక్ నూర్ అహ్మద్ అన్నారు సోమవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయలో " శక్తీ టీం " సిబ్బంది పాములపాడు ఏఎస్ఐ షేక్ నూర్ అహమ్మద్, హోం గార్డ్ సుప్రియలు కేజీబీవీ స్కూల్ ఇన్చార్జి ప్రిన్సిపాల్ శ్యామల ఆధ్వర్యంలో 230 మంది విద్యార్థినీలకు " శక్తీ యాప్ అవేర్నెస్ " ప్రోగ్రామును నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన " శక్తి యాప్ " గురించి మరియు శక్తి యాప్ వాట్సాప్ నంబర్ 7993485111 గురించి తెలుపుతూ, మహిళల రక్షణకై ఏర్పాటు చేసిన పోక్సో చట్టం, బాల్య వివాహాల నిషేధ చట్టం, చిన్న పిల్లలపై నేరాలు జరగకుండా ఆపుటకు 1098 ఫిర్యాదు చేయవలన్నారు 18 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేయకూడదని అట్లా ఎవరయినా చేస్తునట్లయితే 112, 1098 కి ఫోన్ చేసి చెప్పాలన్నారు అలాగే విద్యార్థినీలు చదువు మీద ధ్యాస పెట్టి బాగా కష్టపడి చదివి మీ జీవితాలను తీర్చిదిద్దుకోవాలన్నారు చదువు ఒక్కటే మిమ్మల్ని సమాజంలో గౌరవాన్ని, మర్యాదను, హుందాతనాన్ని తీసుకొచ్చి మీ తలరాతలను మారుస్తుందన్నారు మీకు ఏ సమస్య వచ్చినా మీ తల్లిదండ్రులకు గానీ, మీ టీచర్లకు గానీ తెలిపి పరిష్కరించుకోవాలనే గానీ తొందరపడి ఎటువంటి అఘాయిత్యాలకు పాల్పడకూడదన్నారు



# బ్యాంకుల్లో నగదు ఫుల్.. ఒక్కరోజులో రూ.2.10 లక్షల కోట్లు లాగేసిన ఆర్బీఐ!

బ్యాంకింగ్ వ్యవస్థలో భారీగా ఉన్న అదనపు నగదును 'రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' (ఆర్బీఐ) వెనక్కి తీసుకుంది. సోమవారం నిర్వహించిన రెండు ఓవర్‌నైట్ 'వేరియబుల్ రేట్ రివర్స్ రెపో' (వీఆర్ఆర్ఆర్) వేలం ద్వారా బ్యాంకుల నుంచి ఏకంగా రూ.2,10,192 కోట్లను ఆర్బీఐ వెనక్కి లాగింది. బ్యాంకింగ్ వ్యవస్థలో నగదు లభ్యత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో దాన్ని నియంత్రించేందుకు ఈ చర్య చేపట్టింది.మొదటి వేలంలో రూ.2 లక్షల కోట్లను తీసుకునేందుకు ఆర్బీఐ నోటిఫై చేయగా.. బ్యాంకులు రూ.2,10,688 కోట్లకు బిడ్లు దాఖలు చేశాయి. ఇందులో రూ.2,00,050 కోట్లను ఆర్బీఐ స్వీకరించింది. సగటు వడ్డీ రేటు 5.24 శాతంగా నమోదైంది.రెండో వేలంలో మాత్రం బ్యాంకుల నుంచి స్పందన తక్కువగా వచ్చింది. రూ.50 వేల కోట్లను తీసుకునేందుకు ఆర్బీఐ అవకాశం కల్పించగా.. కేవలం రూ.10,142 కోట్లకు బిడ్లు వచ్చాయి. వచ్చిన మొత్తం బిడ్లను ఆర్బీఐ స్వీకరించింది.ప్రస్తుతం బ్యాంకింగ్ వ్యవస్థలో అదనపు నగదు భారీగా ఉంది. అక్టోబర్ 4 నాటికి ఈ మిగులు లిక్విడిటీ సుమారు రూ.5.16 లక్షల కోట్లుగా ఉన్నట్లు ఆర్బీఐ గణాంకాలు చెబుతున్నాయి. గత రెండు నెలలుగా ఆర్బీఐ పలుమార్లు వీఆర్ఆర్ఆర్ వేలాలు నిర్వహిస్తూ ఈ అదనపు నగదును తగ్గిస్తోంది. స్వల్పకాలిక రుణ మార్కెట్‌లో వడ్డీ రేట్లు రెపో రేటుకు దగ్గరగా ఉండేలా చూడటం కూడా దీని లక్ష్యం.విదేశాల్లో ఉన్న భారతీయులు బ్యాంకుల్లో జమ చేసిన ఎఫ్‌సీఎన్ఆర్(బీ) డిపాజిట్లతో పాటు.. నెలాఖరులో ప్రభుత్వం జీతాలు, పెన్షన్ల కోసం చేసే చెల్లింపులు కూడా బ్యాంకుల్లో నగదు లభ్యతను పెంచాయి. లిక్విడిటీ ఇంకా ఎక్కువగానే ఉండటంతో.. రానున్న రోజుల్లోనూ వీఆర్ఆర్ఆర్ వంటి చర్యలను ఆర్బీఐ కొనసాగించే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.

**వీఆర్ఆర్ఆర్ అంటే ఏమిటి?** వీఆర్ఆర్ఆర్ అంటే 'వేరియబుల్ రేట్ రివర్స్ రెపో'. బ్యాంకుల దగ్గర అవసరానికి మించి నగదు ఉన్నప్పుడు.. ఆ అదనపు డబ్బును కొంతకాలం ఆర్‌బీఐ వద్ద ఉంచుకునే విధానమే వీఆర్ఆర్ఆర్. ఇందుకు ఆర్‌బీఐ బ్యాంకులకు వడ్డీ చెల్లిస్తుంది. వడ్డీ రేటు ముందే నిర్ణయించకుండా వేలం ద్వారా ఖరారు చేస్తారు. దీంతో బ్యాంకింగ్ వ్యవస్థలో అదనంగా ఉన్న నగదు కొంతకాలం మార్కెట్ నుంచి బయటకు వెళుతుంది. తద్వారా స్వల్పకాలిక వడ్డీ రేట్లను నియంత్రించేందుకు ఆర్‌బీఐకి వీలు కలుగుతుంది.

**డబ్బు ఎలా వెనక్కి తీసుకుంటుంది?** ఆర్‌బీఐ ముందుగా వీఆర్ఆర్ఆర్ వేలాన్ని ప్రకటిస్తుంది. ఎంత మొత్తాన్ని తీసుకోవాలనుకుంటుందో చెబుతుంది. బ్యాంకులు తమ దగ్గర ఉన్న అదనపు నగదులో ఎంత మొత్తాన్ని ఇవ్వగలవో, ఏ వడ్డీ రేటుకు ఇవ్వాలనుకుంటున్నాయో బిడ్లు వేస్తాయి. ఆర్‌బీఐ ఎంపిక చేసిన బిడ్లను స్వీకరించి ఆ మొత్తాన్ని తాత్కాలికంగా తన వద్దకు తీసుకుంటుంది. గడువు ముగిసిన తర్వాత అసలు మొత్తాన్ని వడ్డీతో కలిపి బ్యాంకులకు తిరిగి చెల్లిస్తుంది. అంటే ఆర్‌బీఐ బ్యాంకుల డబ్బును శాశ్వతంగా తీసుకోదు.. కొంతకాలం తన వద్ద ఉంచుకుని లిక్విడిటీని నియంత్రిస్తుంది.





# సి. బెళగల్ మండలంలో కరువు కనిపించలేదా సి.ఎం గారు?

## సిపిఐ ఆధ్వర్యంలో సి బెళగల్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి తహాశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాచేసిన సిపిఐ

**కర్నూలు సిటీ నందిపత్రిక** సి బెళగల్ మండలంలో ఏర్పడినటువంటి కరువు కూటమి ప్రభుత్వానికి గాని మండల అధికార యంత్రాంగానికి కానీ కనిపించలేదా అని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ప్రశ్నించింది. సి బెళగల్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి తక్షణ కరువు సహాయక చర్యలు చేపట్టాలని ఎకరానికి 50 వేల రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని బ్యాంకులో రైతులు తీసుకున్న అప్పులన్నీ రద్దు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో సి.బెళగల్ తాహాశీల్దార్ కార్యాలయం ఎదుట గంటపాటు ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బి.కృష్ణ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బి.రాజు సిపిఐ జిల్లా సమితి సభ్యులు శేషు కుమార్ సిపిఐ నియోజకవర్గ నాయకులు

**దూల్ల భాస్కర్ శివశంకర్ గౌడ్ లు మాట్లాడుతూ** ఈ సంవత్సరం తీవ్రమైన వర్షాభావ పరిస్థితులు వల్ల జూన్ నెలలో కురిసిన అరకొర వర్షాలకి వర్షాలు కురుస్తాయి సకాలంలో పంటలు పండుతాయని ఆశాభావంతో రైతులు పత్తి,వేరుశనగ, సద్ద,జొన్న కంది, ఉల్లి ఇతర పంటలను వేయడం జరిగిందని జూన్ మాసం నుంచి సెప్టెంబర్ మాసం 20వ తేదీ వరకు అసలు వర్షమే కురవలేదని ఈ పరిస్థితుల్లో రైతులు వేసిన విత్తనాలు చాలావరకు మొలకెత్తముందే భూమిలో ఎండిపోయాయని అరకొరగా మలిచినటువంటి మొక్కలు ఎదుగుదల లేక దిగుబడి రాలేదని వారన్నారు. ఈ పంటలన్నీ సాగు చేయడానికి విత్తడానికి రైతుకు కూలీలు సేద్యం ఖర్చు ఎరువులు విత్తనాలు తీసుకోవడానికి ఎకరానికి 50 వేల నుంచి లక్ష రూపాయల వరకు ఖర్చయిందని అప్పులు చేసి పెట్టుబడి పెట్టినటువంటి రైతుకు చేసిన అప్పులకు వడ్డీలు కట్టే పరిస్థితి నేడు లేదని వారన్నారు ఈ పరిస్థితుల్లో రైతుకు తీవ్ర నిరాశ మిగిలిందని ఎంతో ఆశతో పంట సాగు కోసం రైతు శ్రమిస్తే రైతు కష్టం బూడిదలో పోసిన పన్నీరులా మారిందని రైతుకి ఇంత కష్టం వచ్చినా కళ్ళ ఎదుట స్పష్టంగా కరువు కనిపిస్తున్న కూటమి ప్రభుత్వం మరియు సి.బెళగల్ మండల అధికారులు కల్లుండి చూడలేని కబోదుల్లా మారిపోయారని పై అధికారులకు నివేదికలు కూడా ఈ మండలంలో ఉన్న వాస్తవ పరిస్థితులను అందించలేదని వారి విమర్శించారు ఈ సంవత్సరం వర్షాలు లేక పైనుంచి తుంగభద్ర నదిలో కూడా నీళ్లు ఉన్న పరిస్థితి లేదని మొత్తం తుంగభద్ర నాదే ఎండిపోయిందని వారన్నారు.ఈ సందర్భంలోనే కర్నూలు జిల్లాలో ముఖ్యమంత్రి మరియు ముఖ్యమంత్రి తనయుడు నారా లోకేష్ అధికారిక హోదాలో పర్యటన చేసినప్పటికీ ఏ ఒక్క రైతు పొలంలోకి వెళ్లి కూడా పంటలను పరిశీలించలేదని ఈ జిల్లాలో ఉన్న మంత్రి



మరియు ఎమ్మెల్యేలు అందరూ నిద్రపోతున్నారా అని వారన్నారు పశువులకు పశు గ్రాసం కూడా లేదని పనులు లేక పొట్ట చేత పట్టుకొని వలసలకు సుదూర ప్రాంతాలకు ప్రజలు వెళ్తున్నారని గ్రామాలకి గ్రామాలు ఖాళీ అవుతున్న అధికారులకు నాయకులకు ఎందుకు పట్టడం లేదని వారు ప్రశ్నించారు తక్షణమే మండల అధికారులు స్పందించి జిల్లా అధికారులకు నివేదికలు అందించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకొని ముఖ్యమంత్రిగా దృష్టికి విషయం తీసుకెళ్లి తక్షణమేసి సి. బెళగల్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించేందుకు కృషి చేయాలని లేని పక్షంలో స్థానిక ఎన్నికల్లో ప్రజలే కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్తారని సి. బెళగల్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించేంతవరకు భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ తో కలిసి వచ్చే అన్ని పార్టీలను, ప్రజా, కుల సంఘాలు ను కలుపుకొని ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు గడ్డం నాగరాజు బాబురావు మధు మల్లికార్జున సి.బెళగల్ నాయకులు స్థానిక సి బెళగల్ నాయకులు ఫకీర్ చిన్న నాగన్న రవి బాలు రైతులు వ్యవసాయ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ ఎమ్మార్పీఎస్ 13వ వార్షికోత్సవ సభ కరపత్రాలు విడుదల



**నంది పత్రిక కర్నూలు బ్యూరో :** ఏపీ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 13వ వార్షికోత్సవ మహాసభకు సంబంధించిన కరపత్రాలను సోమవారం విడుదల చేశారు. కలెక్టరేట్ లో ఏపీ ఎంఆర్పిఎస్ నాయకులు బైరాపురం రాజు మాదిగ మాట్లాడుతూ 2026 అక్టోబర్ 12వ తేదీన బనగానపల్లెలో జరగబోయే ఏపీ ఎంఆర్పిఎస్ 13వ వార్షికోత్సవ మహాసభను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాదిగల హక్కుల సాధన సామాజిక న్యాయం, చర్మ కళాకారులు, డప్పు కళాకారుల సంక్షేమం కోసం ఏపీ ఎంఆర్పిఎస్ నిరంతర పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. ఈ వార్షికోత్సవ మహాసభను విజయవంతం చేసేందుకు మాదిగ ప్రజానీకం, మాదిగ విద్యార్థులు, విద్యార్థినిలు, చర్మ డప్పు కళాకారులు, ఏపీ ఎంఆర్పిఎస్ మహిళ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున రావాలని పిలుపునిచ్చారు.ఈ సభకు ప్రతి గ్రామం నుంచి మాదిగ సోదరులు సోదరీమణులు యువత విద్యార్థులు భారీ సంఖ్యలో హాజరై ఐక్యతను చాటాలని హక్కుల సాధన కోసం సమిష్టిగా ముందుకు సాగాలని కోరారు. అక్టోబర్ 12 నిర్వహించనున్న మహా బహిరంగ సభను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బైరాపురం రాజు, ఆంజనేయ మాదిగ, రెడ్డి పోగు రాజశేఖర్ మీసాల బాబు, మీసాల దాసు, నాగరాజు వెంకటాద్రి తదితర ఏపీ ఎమ్మార్పీఎస్ కర్నూలు జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# అందమైనఅక్షర-శిల్పం

బుచ్చిబాబు 1946 లో వ్రాసిన కథ 'నన్ను గురించి కథ వ్రాయవూ?'. ఈ కథలో ప్రధానమైన పాత్రలు రెండు. ఒకటి కథను పాఠకుడికి చెప్పిన 'నేను'. రెండవది 'కుముదం' అనే స్త్రీ. ఈ 'నేను'కు ఇరవైయేళ్ళ వయసులో కథ మొదలవుతుంది. కుముదానికి అప్పుడు పద్దెనిమిదేళ్ళు. అప్పటికే కుముదానికి పెళ్ళయింది. కథ ముగిసే నాటికి 'నేను' ముప్ఫై నాలుగేళ్ళ వయసువాడు. అప్పటికీ అవివాహితుడే. కుముదానికి ముప్ఫై రెండేళ్ళు.మనలో చాలామంది మధ్య తరగతి జీవితాలు, పుట్టుక నుంచి గిట్టేదాకా మూస పోసినట్లు ఒకే రకంగా, ఒకే విధమైన రోజువారీ పనులతో, కొత్తదనమేమీ లేకుండా వుంటాయి కనుక, జీవితానికి అలా ఒక అర్థమంటూ లేకుండా బతకడమే తప్ప, మరే అర్థమూ లేదు అన్నది కథలోని ఇరువురు ప్రధాన పాత్రల మధ్య జరిగిన సంభాషణకు ముఖ్య విషయం."ఎక్కడో ఎప్పుడో పుట్టడం, ఎవరో ఎవర్నో ఒప్పగిస్తే వారిని పెళ్ళాడడం, ఎందుకో తెలీకుండా పిల్లల్ని కనడం, ఎప్పుడో ఎక్కడో చచ్చిపోవడం. ఇది చాలామంది చేస్తున్నది. దీన్ని గురించి కథగా చెప్పుకునేందుకు ఏముంది ప్రత్యేకత? వ్యక్తిత్వం లేని ఈ జీవితాలు ప్రశాంతాన్ని పొందుతున్నాయి. కాని, అది బురద గుంటలో పురుగు పొందే ప్రశాంతత" అంటాడు కథలో 'నేను' పాత్ర."నాకేదో చెప్పాలనుంది. ఎట్లా చెప్పాలో తెలీడం లేదు. నేను చదువుకున్న దాన్ని కాదు", "సూర్యుడూ, చంద్రుడూ ఎప్పుడూ చూస్తూంటాను. కాని, ప్రతిసారి ఎందుకో క్రొత్తగా కనబడతాయి. మంచినీళ్ళు రోజూ త్రాగుతా. కాని ప్రతిసారి ఎంతో క్రొత్తగా వుంటాయి", "నువ్వు జీవితాన్ని పరిశీలిస్తావు. నేను అనుభవిస్తాను" అంటుంది కుముదం పాత్ర.కథాంతంలో, కుముదం న్యుమోనియాతో పోరాడుతూ హాస్పిటల్లో ఉండగా చూడడానికి వెళ్ళిన అతడు 'అనుకోకుండా' తన చేతిని ఆమె చేతిపై ఆనించబోగా, వెంటనే చేతిని లాగి దుప్పటిలో దాచేసుకుని "నువ్వెందుకు పెండ్లి చేసుకోలేదో నాకు తెలుసు నాకోసం," అంటుంది కుముదం.కుముదం ఆ మాటలు కథలో అతడికి ఒక జ్ఞానోదయం! ఈ జ్ఞానోదయం అతడి ప్రపంచాన్ని తలక్రిందులు చేసి అతని జీవిత పరమావధినే తారుమారు చేసిందని ఒప్పుకుంటాడు. అదే కుముదం సాధించిన విజయం, ఆమె ప్రత్యేకత. ఆ ప్రత్యేకతే 'ఆమె గురించి కథ వ్రాయించేలా' చేసిందని పాఠకుడికి రచయిత చివరలో చెప్పిన మాట.కథాంతంలో కుముదం మాటల వలన అతడికి కలిగిన జ్ఞానోదయం రెండు సంగతులను చెప్పింది: ఒకటి 'అతడు తనను ప్రేమిస్తున్నాడు' అన్న అభిప్రాయంలో కుముదం వుంది. రెండు 'తాను కుముదాన్ని ప్రేమిస్తున్నాడు' అన్న అభిప్రాయంలో అతడు లేడు.ఈ అయోమయం అసలుకు ఎవరిది? మొదటి నుంచి చూసుకుంటూ వస్తే: పదేళ్ళ వయసులో, ఆటలలో భాగంగా, "నన్ను గురించి కథ చెప్పవూ?" అని అతడిని అడిగింది కుముదం. అదే కుముదం పద్దెనిమిదేళ్ళ వయసులో "నన్ను గురించి కథ వ్రాయవూ?" అని అడిగింది. కుముదం వ్యక్తం చేసిన ఆ కోరిక గురించి "తన వ్యక్తిత్వాన్ని గుర్తుంచుకుని, దాని ప్రభావాన్ని ఇతరులకి తెలియచెయ్యాలన్న స్త్రీని మొట్టమొదట కుముదంలో చూడగలిగాను. ఆమె ఒక జీవి. ప్రత్యేకమైన ఉనికి గలది. ఆమెని తొలగిస్తే ప్రపంచంలో కొంత పవిత్రమైన ఖాళీ ఏర్పడుతుంది" అంటాడతను.

కుముదం అందమైనది కాదు. అసాధారణ స్త్రీ కాదు. అయితే, కొన్ని సందర్భాలలో మాత్రం జీవితానికి సంబంధించిన గంభీరమైన సంగతులను సైతం సులభంగా అర్థం చేసుకుని వ్యాఖ్యానించగల స్త్రీ వలె కనపడుతుంది:"మనం ప్రకృతికి దాస్యం చెయ్యడం తప్పదు. దాస్యం నేను సహించలేను. కానీ, అది తప్పదనుకుంటాను", "ప్రపంచాన్ని మనం ఏదేనా కోరి ఆశిస్తే దాన్ని ఇవ్వదు. మనం దేన్నీ ఆశించకుండా, దూరంగా వుండి చెయ్యగలిగిన పని చేస్తుంటే ప్రపంచం మన పాదాల ముందు వాల్తుంది", "నేను నువ్వైతే ఏం చేద్దునో తెలుసా? నదీ తీరాన్న చిన్న తాటాకు పాక కట్టుకుంటాను. అందులో కూర్చుని, ఊరికే చదువు నేర్పుతానని చాటింపు వేయిస్తాను. మొదట ఏ పదిమంది పొలం కాపులో వస్తారు. సాయంత్రం వాళ్ళకి బోధించడం మొదలెడతాను. ఇరుగు పొరుగు నుంచి అనేకమంది కర్షకులు, కూలివాళ్ళు చదువు కోసం వస్తారు. ఉత్త చేతుల్తో రాకుండా, ఒకరు వుప్పు, చింతపండు, ఒకరు పాలు అలా నాకు కావల్సిన వాటిని వాళ్ళే సిద్ధం చేస్తారు. వారు నా శిష్య బృందం. వాళ్ళ కష్ట సుఖాలు పంచుకుంటా. వారి తగాదాలకు తీర్పు చెపుతా. అంతే. అప్పుడు నా జీవితం వృథా అనుకోను". ఇదీ కుముదం.ఉద్యోగం సద్యోగం లేకుండా, అర్థంలేని భావుకత్వపు ఆలోచనలలోను, ఆచరణ సాధ్యం కాని ఆదర్శవాదంలోను కొట్టుకుపోతున్నట్లుగా కనిపించే అతని జీవితానికి ఒక దిశను చూపడానికి ప్రయత్నించింది కుముదం. అతడు కుముదం మాటలను ఖాతరు చెయ్యడు. కథ చివరలోనూ అదే స్థితిలో ఉంటాడు తప్ప మార్పేమీ వుండదు. వ్యర్థంగా జీవితాన్ని గడుపుతూ వచ్చి, చివరలో, కుముదం చేయి ముట్టుకోబోతాడు. ఆమె అంగీకరించదు. ఇక అదే ఆఖరి ప్రయత్నంగా "నువ్వెందుకు పెండ్లి చేసుకోలేదో నాకు తెలుసు నా కోసం", "నాకు నిర్విచారం. ఈ ప్రపంచం నాదైతేగా విచారానికి. నువ్వు మాత్రం...."

మాట పూర్తికాకుండానే కళ్ళు మూసింది ఆమె. మరణానికి ముందు కుముదం మాటల ప్రభావంతోనే ఆమె గురించి కథ రాయడం జరిగినదనడానికి సూచనగా, కథాంత వాక్యంలో "నా ప్రపంచాన్ని తలక్రిందులు చేసి నా జీవిత పరమావధినే తారుమారు చేసిన కుముదాన్ని గురించి ఏం కథ వ్రాయను?" అని ఉత్ప్రేక్షిస్తాడు అతడు. కథ మొదలు నుండి కుముదంలో ఏ ప్రత్యేకత లేదంటూనే, కుముదంను గురించి ఏది చెప్పినా ఉత్ప్రేక్షలనే అలంకారాన్ని జత చేసి తప్ప చెప్పడు. కథలో అది ఒక ప్రయత్నపూర్వక వైరుధ్యం. కథ ఆద్యంతం అలంకారికంగా సాగించిన శ్లేష! కథ చదవడం ముగియగానే ఒక్క సందేహం కలుగుతుంది. ఈ కథలోని కుముదం అర్ధాంతరంగా చనిపోకుండా, డెబ్భై ఎనభై ఏళ్ళు నిండుగా బతికి, ముసలితనంతో చనిపోయి ఉంటే ఏమై ఉండేది? ఏమీ అయి ఉండేది కాదని, అసలు కథే ఉండేది కాదని ఆ ప్రశ్నకు సమాధానం దొరుకుతుంది. కథలో తాను సాధించి చూపాలనుకున్న సౌందర్యాన్ని కరుణరసభరితంగా చూపడం కోసం, వేరే మార్గం కనపడక,

కథను అలా ముగించక తప్పలేదేమో అనిపిస్తుంది. నిపుణుడైన శిల్పి చేతిలో శిల అందమైన శిల్పంగా మలచబడి ఆనందాన్ని కలిగిస్తుంది. అలా మలచబడడంలో అందమైన శిల్పంగా మారడం తప్ప, జీవితాన్ని నిర్వచించి చెప్పే కొత్త అర్థము గాని, విలువ గాని ఉండవు. 'నన్ను గురించి కథ వ్రాయవూ?' కథ కూడా ఎవంటిదే ఒక అందమైన అక్షర శిల్పం.

# రేగడగూడూరు అంగన్వాడీ కేంద్రాల్లో ఘనంగా "అంగన్వాడీ ఉత్సవం"



**వెలుగోడు అక్టోబర్ 05 (నంది పత్రిక):** వెలుగోడు మండలం రేగడ గూడూరు గ్రామంలోని 4వ మరియు 6వ నంబర్ అంగన్వాడీ కేంద్రాల నందు "అంగన్వాడీ ఉత్సవం" కార్యక్రమాన్ని సోమవారం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మహిళలు, పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ పౌష్టికాహారం మరియు చిరుధాన్యాల (మిల్లెట్స్) ప్రాధాన్యత గురించి అంగన్వాడీ టీచర్లు సమగ్ర అవగాహన కల్పించారు. రోజువారీ ఆహారంలో చిరుధాన్యాలను భాగం చేసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు, రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు పౌష్టికాహార లోపాన్ని నివారించే పద్ధతులను ప్రతి ఒక్కరికీ సవివరంగా వివరించారు. ఈ అంగన్వాడీ ఉత్సవంలో గ్రామానికి చెందిన గర్భవతులు, బాలింతలు, పిల్లల తల్లులు, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు మరియు చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కోడుమూరు, నాగలాపురం పోలీస్ స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీ చేసిన ... కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్

## రాబోయే ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలి




**కర్నూలు సిటీ నందిపత్రిక** కోడుమూరు, నాగలాపురం పోలీస్ స్టేషన్లను కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు.ఈ సందర్భంగా రాబోయే ఎన్నికల నిర్వహణ, గ్రామాల సందర్శన, ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు తీసుకుంటున్న చర్యలపై పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు.నేరాల నివారణకు ప్రత్యేక దృష్టి సారించాలని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల సమస్యలను పరిష్కరించి సత్వర న్యాయం అందించాలని ఆదేశించారు. ఈ తనిఖీలలో ఎస్పీ తో పాటు కోడుమూరు సీఐ తబ్రేజ్, కోడుమూరు ఎస్సై డి.వై. స్వామి, నాగలాపురం ఎస్సై అఖిల్ పాల్గొన్నారు.

# అమెరికాలో భారత సంతతి ప్రొఫెసర్లపై నెగెటివ్ పోస్ట్.. వికటించిన వైనం!

సోషల్ మీడియాలో ఒకరిని కించపరచాలని చేసే ప్రయత్నాలు ఒక్కోసారి ఎలా బెడిసికొడతాయో చెప్పడానికి అమెరికాలో జరిగిన ఈ ఘటనే తాజా ఉదాహరణ. అమెరికాలోని ఒక యూనివర్సిటీలో పనిచేస్తున్న భారత సంతతి ప్రొఫెసర్లను లక్ష్యంగా చేసుకుని పెట్టిన ఒక నెగెటివ్ పోస్ట్, చివరికి వారి ప్రతిభను, ముఖ్యంగా ఐఐటీల ప్రతిష్ఠను ప్రపంచానికి చాటిచెప్పేలా మారింది.వివరాల్లోకి వెళ్తే, అమెరికాలోని మోంటానా స్టేట్ యూనివర్సిటీలో పనిచేస్తున్న భారత సంతతి ప్రొఫెసర్ల జాబితాను 'ఆయిల్‌ఫీల్డ్ రాండో' అనే ఎక్స్ యూజర్ పోస్ట్ చేశాడు. భారత విద్యావేత్తల ఉనికిని విమర్శించడమే ఈ పోస్ట్ వెనుక ఉన్న ఉద్దేశంగా కనిపించింది. ఈ జాబితాలో అగ్రికల్చరల్ ప్రాసెస్ ఇంజినీరింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శివాలీ బెనర్జీ పేరు కూడా ఉంది.అయితే, ఊహించినదానికి భిన్నంగా ఈ పోస్ట్ కింద నెటిజన్లు స్పందించారు. విమర్శలకు బదులుగా ప్రశంసల వర్షం కురిపించారు. ముఖ్యంగా, డాక్టర్ శివాలీ బెనర్జీ ప్రతిష్ఠాత్మక ఐఐటీ బాంబే నుంచి పీహెచ్‌డీ పొందారని తెలుసుకుని, ఆమె ప్రతిభను కొనియాడారు. ఐఐటీ బాంబే వంటి అత్యున్నత విద్యాసంస్థలో చదివిన వారు తమ యూనివర్సిటీలో ఫ్యాకల్టీగా ఉండటం గర్వకారణమని చాలామంది కామెంట్ చేశారు. ఈ సందర్భంగా నెటిజన్లు ఐఐటీల ప్రాముఖ్యతను గుర్తుచేశారు. భారత విద్యార్థులకు అమెరికాలోని ఐవీ లీగ్ యూనివర్సిటీల కంటే ఐఐటీలలో సీటు సంపాదించడం చాలా కష్టమని, అలాంటి సంస్థల నుంచి వచ్చిన గ్రాడ్యుయేట్లు ఏ యూనివర్సిటీకైనా ఆస్తి వంటివారని పేర్కొన్నారు. సుందర్ పిచాయ్, సంజయ్ మెహ్రోత్రా వంటి ఎందరో ఐఐటీ గ్రాడ్యుయేట్లను అమెరికన్ కంపెనీలే స్వయంగా నియమించుకుంటాయని గుర్తుచేశారు. మొత్తానికి, భారత సంతతి ప్రొఫెసర్లను లక్ష్యంగా చేసుకుని పెట్టిన నెగెటివ్ పోస్ట్, చివరికి భారతీయ మేధోసంపత్తికి, ఐఐటీల ఖ్యాతికి అద్దం పట్టేలా మారింది.

# బాధాసర్వదష్టుల సాహితీ బంధువు

"ఆ కూలిన ఇంటిలో ఏడుస్తున్నదెవరు? ఆమెకేమైంది?" అని అడిగాడు ఉపాధ్యాయుడు అఘోరనాథుడు. అందుకు తరగతిలో ఒక 11 ఏళ్ళ బాలుడు సమాధానమిస్తూ, "ఆమె ఒక పేదరాలు. ఇళ్లలో పాచిపని చేస్తూ గుడ్డి భర్తను చూసుకునేది. నిన్న రాత్రి ఆ భర్త పోయాడు. ఒంటరిదైపోయింది. అందువల్ల కుమిలి కుమిలి ఏడుస్తూ ఉంది. వీరు గొప్పింటి వారిలాగా దుఃఖాన్ని బిగ్గరగా ప్రదర్శించరు మాస్టర్ ముషాయ్!" అంటూ వయస్సుకు మించిన అనుభవజ్ఞునిలా, దుఃఖ నిర్వచనం చేశాడు. అప్పుడు అఘోరనాథుడు మనస్సులో "దుఃఖపు భిన్న రూపాల్ని గమనించగలిగిన ఈ బుడతడు పెద్దవాడయ్యాక మానవ మనస్తత్వ పరిశీలనలో ప్రసిద్ధికెక్కుతాడు" అని అనుకున్నాడు. బెంగాలీ సాహిత్య వినీలాకాశంలో చల్లని పున్నమి చంద్రునిలా భాసిల్లి, బాధిత హృదయాల కన్నీటి గాథలను కరుణ రసాత్మకంగా చిత్రీకరించిన శరత్ చంద్ర ఛటర్జీయే ఆ బాలుడు. ఒక్క బెంగాలీలనే కాక అన్ని దేశ భాషల పాఠక జన హృదయాలను కదిలించి, ద్రవింపజేసి మహా రచయితగా నీరాజనాలందుకున్నాడు.శరత్ తన కథల్లో జీవితపు అనేక విషయాలతోపాటు నైతిక మాతృత్వం అనే ఉన్నత భావనకు హృద్యంగా జీవం పోశాడు. స్త్రీ జీవితం సార్థకం, పరిపూర్ణం అయ్యేది సొంత బిడ్డలను కని, మాతృత్వాన్ని అనుభవించడమని చాలామంది భావిస్తారు. ఎంతోమంది స్త్రీలు కూడా అలానే ఆలోచించే మనోధర్మానికి భిన్నంగా శరత్ తన రచనల్లో మాతృత్వం అనేది రక్తసంబంధానికి మాత్రమే పరిమితమైనది కాదు, ఎవరైతే పేగుబంధంలేని ఇతరుల పిల్లలపై కూడా మమత, ప్రేమ, అప్యాయతలను కురిపిస్తారో వారు నిజమైన మాతృత్వపు మధురిమలను ఆస్వాదిస్తారని చెబుతాడు. ఇలాంటి మాతృత్వం నుండి పెల్లుబికే మమకారం స్వార్థం నుండి జనించినది కాదు. దీని వెనుక మంచీచెడుల, న్యాయాన్యాయాల స్పృహ ఉంటుంది.ఒకోసారి మనుష్యుల మధ్య భావోద్వేగాలు చెలరేగి, వివేకాన్ని కోల్పోయి, పరుషంగా మాట్లాడడం, అనుచితంగా ప్రవర్తించడం జరుగుతుంది. అది కొన్ని సందర్భాలలో తీవ్ర పర్యవసానాలకు దారితీస్తుంది. శరత్ రాసిన 'బిందుగారబ్బాయి' కథలో పెద్ద కోడలు కొడుకును, చిన్న కోడలు తన సొంత బిడ్డగా ప్రేమిస్తుంది. ఆ పిల్లాడి పెంపకం విషయంలో కోడళ్ళు ఒకరినొకరు కోపంతో గట్టిగా వాదించుకొని, పంతాలకుపట్టింపులకుపోయి, వేర్వేరు కాపురాలు పెడతారు. ఆ తరువాత వారిద్దరూ పశ్చాత్తాపం చెందినప్పుడు, పెద్ద కోడలుతో ఆమె భర్త ఇలా అంటాడు: "క్షమించడం నీవు నేర్చుకొనకపోతే నీ పెద్దరికానికి విలువేముంది?" ఇతరులను క్షమించ గలిగేవారే నిజంగా పెద్దవారని శరత్ అభిప్రాయం. 'శ్రీకాంత్' నవలను శరత్ ఆటో బయోగ్రఫీయని చాలామంది భావిస్తారు. ప్రపంచ ప్రఖ్యాతి చెందిన సాహితీవేత్త రోమారోలా, ఆ నవల మొదటి భాగం చదివి ప్రపంచ సాహితీ అగ్రగణ్యుల్లో శరత్ ఒకరని, నోబెల్ బహుమతికి అర్హుడని ప్రకటించాడు. ఈ నవలలో అన్నదా దీదీ, రాజ్యలక్ష్మి, అభయ, కమలలత ప్రధాన స్త్రీ పాత్రలు. ఒక్కొక్కరిది ఒక విషాద కథ. హిందూ ధర్మ శాస్త్రాల ప్రకారం పతియే ప్రత్యక్ష దైవం. ఆ పతి దుష్టుడు, దుర్మార్గుడు, హంతకుడైనప్పటికీ అతని వెంట నడవాలి. ఈ నీతి సూత్రాన్ని మనోవాక్కాయకర్మగా నమ్మిన అన్నదా దీదీ, హంతకుడై పారిపోయి, తిరిగి పాములుపట్టే వాని వేషంలో వచ్చిన భర్త వెంట వెళ్ళిపోతుంది. ఎవడితోనో లేచిపోయిందనే అపవాదుతో సమా జానికి దూరంగా వెలివేయబడుతుంది. అష్టకష్టాలు అనుభవిస్తుంది. భర్త పాము కాటుకు బలై మరణించిన తరువాత ఎవరికి కనిపించకుండా పోతుంది. ఇక్కడ శరత్, ఒకవైపు మత శాస్త్రాలు బోధించే స్త్రీ పాతివ్రత్యానికి (జష్ఘురఖ్ఎ) ఎక్కువ ప్రాధాన్యతనిచ్చే సమాజంలో స్త్రీత్వం (ఇశీఖఅష్త్రశీీస) విలువను గుర్తించడం లేదని విచారిస్తాడు. మరో పాత్ర అభయను అగ్నిసాక్షిగా వివాహమాడిన భర్త ఆమె మానాన వదలివేసి ఉద్యోగానికై బర్మా వెళ్ళిపోతాడు. ఆమె అదే గ్రామానికి చెందిన రోహిణీ బాబును తోడు తీసుకొని భర్తను వెతుక్కుంటూ బర్మా వెళు తుంది. అప్పటికే ఆ భర్త బర్మా స్త్రీని పెళ్లిచేసుకొని ఉంటాడు. అలా అభయ రావడాన్ని సహించలేని భర్త ఆమెను చాలా హింసిస్తాడు. భరించలేక అభయ తిరిగి రోహిణీబాబు వద్దకు వచ్చి ఉంటుంది. అది చూసి దిగ్భ్రాంతికి గురైన శ్రీకాంతబాబుతో అభయ "నేను కేవలం భార్యను అయినంత మాత్రాన ఆయన అనుమతి లేకుండా ఇంత సుదూరం రావడానికి సాహసించాను. వచ్చి ఆయన ఆనందానికి భంగం కలిగించాను. స్త్రీలలో ఇంతటి సాహసాన్ని ఏ పురుషుడు సహించలేడు. అందుకు శిక్ష ఇది" అని, కుడిభుజంపై పైట కొంగును తొలగించి చూపుతుంది. కొరడాతో కొట్టిన దెబ్బకు లోతుగా చీరుకుపోయి ఉంటుంది. "ఇలాంటి దెబ్బలు నీకు చూపలేని చోట్ల చాలా ఉన్నాయి. నా భర్త అతని బర్మా భార్యతో సుఖంగా జీవించుగాక! అందుకు నాకు అభ్యంతరం లేదు. అయితే నిన్ను ఒక విషయాన్ని అడగాలనుకుంటున్నాను. ఒక భర్త కొరడా బలంతో భార్యకుగల అన్ని హక్కులను కాలదన్ని, చీకటి రాత్రిలో ఆమెను ఒంటరిగా ఇంట్లోనుండి బయటకు గెంటివేస్తే, వేద మంత్రాల శక్తి వల్ల మాత్రమే ఆమె తన బాధ్యతలకు, విధులకు కట్టుబడి ఉండాలా?....ఈ అర్థం, పర్థం లేని మంత్రాలు ఉచ్చరించిన వెంటనే గాలిలో కలిసిపోయాయి.

# జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓ అక్టోబర్ 21న ప్రారంభమయ్యే అవకాశం

రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన జియో ప్లాట్‌ఫామ్స్ ప్రతిష్ఠాత్మక ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)కు రంగం సిద్ధమవుతోంది. ముకేశ్ అంబానీ నేతృత్వంలోని ఈ డిజిటల్ సంస్థ అక్టోబర్ రెండో అర్ధభాగంలో ఐపీఓకు వచ్చే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు. వాటి ప్రకారం అక్టోబర్ 21న ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ ప్రారంభమై.. అక్టోబర్ 23న ముగిసే అవకాశం ఉంది. అయితే ఈ తేదీలను జియో ప్లాట్‌ఫామ్స్ అధికారికంగా ధ్రువీకరించలేదు.

**రూ.38 వేల కోట్ల వరకు సమీకరణ?** జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓ ద్వారా రూ.37,00038,000 కోట్ల వరకు సమీకరించే అవకాశం ఉందని సమాచారం. అయితే సమీకరణ మొత్తం అంచనాల కంటే తక్కువగా ఉండొచ్చని కొన్ని ధ్రువీకరణ లేని వర్గాలు చెబుతున్నాయి. ఐపీఓ పరిమాణం, ధరల శ్రేణి, కంపెనీ విలువపై జియో ప్లాట్‌ఫామ్స్ ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని సమాచారం. సెబీకి జియో ప్లాట్‌ఫామ్స్ జూన్‌లో డ్రాఫ్ట్ పేపర్లు దాఖలు చేసింది. ఆగస్టు 28న మార్కెట్ నియంత్రణ సంస్థ తుది పరిశీలనలను పూర్తి చేసి ఐపీఓకు మార్గం సుగమం చేసింది. వచ్చే వారం పెట్టుబడిదారుల స్పందన, మార్కెట్ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ధరల శ్రేణిపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయి.

**దేశంలోనే అతిపెద్ద ఐపీఓ?** అంచనా వేసిన రూ.37,00038,000 కోట్ల సమీకరణ జరిగితే జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓ భారత మార్కెట్‌లో ఇప్పటివరకు జరిగిన అతిపెద్ద ఐపీఓగా నిలిచే అవకాశం ఉంది. ప్రస్తుతం ఈ రికార్డు హ్యుందాయ్ మోటార్ ఇండియా పేరిట ఉంది. ఆ సంస్థ 2024లో రూ.27,870 కోట్ల ఐపీఓను తీసుకొచ్చింది. అయితే జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓ పరిమాణంపై తుది నిర్ణయం ఇంకా వెలువడలేదు.

**అక్టోబర్ 19న యాంకర్ బుక్?** ఐపీఓ అక్టోబర్ 21న ప్రారంభమై 23న ముగిస్తే.. యాంకర్ ఇన్వెస్టర్ల కోసం అక్టోబర్ 19న బుకింగ్ ప్రారంభమయ్యే అవకాశం ఉంది. అక్టోబర్ 20న దసరా సందర్భంగా మార్కెట్‌కు సెలవు ఉండటమే ఇందుకు కారణం. అదే షెడ్యూల్ కొనసాగితే అక్టోబర్ 28న జియో ప్లాట్‌ఫామ్స్ షేర్లు ఎన్ఎస్ఈ, బీఎస్ఈల్లో లిస్ట్ అయ్యే అవకాశం ఉంది. అయితే ఈ షెడ్యూల్‌ను స్వతంత్రంగా ధ్రువీకరించలేదని సంబంధిత నివేదిక స్పష్టం చేసింది.

**ఐపీఓ సొమ్ము ఎక్కడికి?** జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓ పూర్తిగా కొత్త షేర్ల జారీ (ఫ్రెష్ ఇష్యూ) రూపంలో ఉండనుంది. అంటే సమీకరించిన నిధులు కంపెనీకే అందుతాయి. ప్రస్తుత వాటాదారులు తమ షేర్లను విక్రయించే ఆఫర్ ఫర్ సేల్ ఇందులో ఉండదని సమాచారం. సమీకరించే మొత్తంలో గణనీయమైన భాగాన్ని రుణాల చెల్లింపునకు వినియోగించే అవకాశం ఉంది. రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ వద్ద ఉన్న సుమారు రూ.27,500 కోట్ల రుణాన్ని పూర్తిగా లేదా కొంతమేర తీర్చేందుకు ఈ నిధులను ఉపయోగించాలని జియో ప్లాట్‌ఫామ్స్ భావిస్తున్నట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. మిగిలిన నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనున్నారు.




**రిటైల్ ఇన్వెస్టర్లకు ఎంత?** ప్రతిపాదిత నిర్మాణం ప్రకారం ఐపీఓలో 50 శాతం వాటాను రిటైల్, హై నెట్‌వర్త్ వ్యక్తిగత పెట్టుబడిదారులకు కేటాయించనున్నారు. మిగిలిన 50 శాతం సంస్థాగత పెట్టుబడిదారులకు కేటాయించే అవకాశం ఉంది. రిటైల్, హెచ్ఎన్ఐ విభాగంలో రూ.2 లక్షల వరకు విలువైన షేర్లకు దరఖాస్తు చేసే రిటైల్ ఇన్వెస్టర్లకు 35 శాతం కేటాయించనున్నట్లు ప్రతిపాదిత నిర్మాణం సూచిస్తోంది.

**విదేశీ ఇన్వెస్టర్ల నుంచి మంచి స్పందన**జియో ప్లాట్‌ఫామ్స్ ఇప్పటికే విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులతో సమావేశాలు నిర్వహించినట్లు సమాచారం. వారి స్పందన ప్రోత్సాహకరంగా ఉందని కంపెనీకి సంబంధించిన వర్గాలు చెబుతున్నాయి. దేశీయ పెట్టుబడిదారుల ఆసక్తి కూడా అంచనాలను మించిందని తెలుస్తోంది. అయితే ఇటీవల ఈక్విటీ మార్కెట్లలో నెలకొన్న అస్థిరతను జియో ప్లాట్‌ఫామ్స్ నిశితంగా గమనిస్తున్నట్లు సమాచారం. ఐపీఓ ధర, విలువ నిర్ణయంలో మార్కెట్ పరిస్థితులు కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది.

**టెలికాం కంపెనీ మాత్రమే కాదు!** పెట్టుబడిదారులు జియో ప్లాట్‌ఫామ్స్‌ను కేవలం టెలికాం సంస్థగా మాత్రమే చూడటం లేదు. మొబైల్ కనెక్టివిటీతో పాటు హోమ్ బ్రాడ్‌బ్యాండ్, ఎంటర్‌ప్రైజ్ టెక్నాలజీ, డిజిటల్ సేవలు, అంతర్జాతీయ వ్యాపార అవకాశాల్లోనూ సంస్థ విస్తరిస్తోంది. రిలయన్స్ జియో ఇన్ఫోకామ్‌కు మార్చి 31 నాటికి 52.44 కోట్ల మంది వినియోగదారులు ఉన్నట్లు కంపెనీ వెల్లడించింది. దీంతో దేశంలో అత్యధిక చందాదారులు కలిగిన టెలికాం ఆపరేటర్‌గా జియో కొనసాగుతోంది.

**5జీలోనూ భారీ స్థాయి**జియో ప్లాట్‌ఫామ్స్ ప్రకారం సంస్థకు 26.85 కోట్ల 5జీ వినియోగదారులు ఉన్నారు. చైనా వెలుపల అతిపెద్ద స్టాండలోన్ 5జీ ఆపరేటర్‌గా జియో ఉందని కంపెనీ పేర్కొంది. అంతేకాకుండా చైనా వెలుపల ప్రపంచంలోనే అతిపెద్ద ఫిక్స్‌డ్ వైర్‌లెస్ యాక్సెస్ (ఫిడబ్ల్యూఏ) సేవల సంస్థగా కూడా జియో నిలిచిందని తెలిపింది. ఈ విభాగంలో సుమారు 1.5 కోట్ల మంది వినియోగదారులు ఉన్నారు. ఇది అమెరికాకు చెందిన టి-మొబైల్ వినియోగదారుల సంఖ్యకు సుమారు 1.5 రెట్లు అని కంపెనీ పేర్కొంది.

**పెట్టుబడిదారుల చూపు జియోపైనే..** ఐపీఓ తేదీ, ధరల శ్రేణి, కంపెనీ విలువ, మొత్తం సమీకరణ వంటి కీలక అంశాలపై ఇంకా తుది ప్రకటన రావాల్సి ఉన్నప్పటికీ.. జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓపై మార్కెట్‌లో భారీ ఆసక్తి నెలకొంది. భారీ వినియోగదారుల ఆధారం, 5జీ విస్తరణ, డిజిటల్ సేవలు, బ్రాడ్‌బ్యాండ్, ఎంటర్‌ప్రైజ్ వ్యాపారాల నేపథ్యంలో ఈ ఐపీఓ దేశీయ మార్కెట్‌లో కీలక ఘట్టంగా మారే అవకాశం ఉంది.

# అసలు 'జంతర్ మంతర్' అంటే ఏంటి ? పేరు చెబుతున్న కథ ఇదే!

**జంతర్ మంతర్ అంటే లెక్కల కోసం ఉపయోగించే పరికరం**

**సంస్కృత పదాల నుంచి వచ్చిన పేరు**

**ఐదు జంతర్ మంతర్‌లు నిర్మించిన సవాయి జైసింగ్-2**

**ప్రస్తుతం మనుగడలో నాలుగు జంతర్ మంతర్‌లు మాత్రమే**

**ఎక్కువ పరికరాలు జైపూర్ జంతర్ మంతర్‌లో**

దేశంలో ఏదైనా పెద్ద సమస్యపై నిరసన చేపట్టాలంటే ముందుగా గుర్తొచ్చే ప్రదేశాల్లో జంతర్ మంతర్ ఒకటి. ఢిల్లీలోని ఈ ప్రాంతం ఎన్నో ఆందోళనలు, నిరసనలకు వేదికగా నిలిచింది. కానీ.. అసలు జంతర్ మంతర్ అంటే ఏంటి? ఈ పేరుకు నిరసనలతో సంబంధం ఏమైనా ఉందా? తెలుసుకుందాం..

**పేరు వెనుక ఆసక్తికరమైన అర్థం** 'జంతర్' అనే పదం సంస్కృతంలోని 'యంత్ర' నుంచి వచ్చింది. దాని అర్థం పరికరం లేదా సాధనం. 'మంతర్' అనే పదం 'మంత్రణ' నుంచి వచ్చింది. అంటే లెక్కించడం లేదా పరిశీలించడం.అంటే 'జంతర్ మంతర్'కు సులభంగా చెప్పాలంటే 'లెక్కలు చేసేందుకు ఉపయోగించే పరికరం' అని అర్థం. ఈ పేరు ఆ కట్టడాలకు సరిగ్గా సరిపోతుంది. ఎందుకంటే అక్కడి నిర్మాణాలను సమయం, గ్రహాల కదలికలు, నక్షత్రాల స్థానం వంటి విషయాలను లెక్కించేందుకు ఉపయోగించేవారు. అంతే తప్ప నిరసనలతో ఆ ప్రాంతానికి ఎలాంటి సంబంధం లేదు.

**ఈ నిర్మాణాల వెనుక ఉన్నది ఎవరు?**1724 నుంచి 1730 మధ్య జైపూర్ మహారాజు సవాయి జైసింగ్-2 దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఐదు ఖగోళ పరిశీలనా కేంద్రాలను నిర్మించారు. వీటినే 'జంతర్ మంతర్' అని పిలిచారు. అక్కడ ఒక్క పరికరం కూడా ఉండదు. ఖగోళ పరిశీలనకు వేర్వేరు పనులు చేసే ఎన్నో భారీ నిర్మాణాలు ఉంటాయి. వాటి ఆకారాలు కూడా సాధారణంగా కనిపించవు. పెద్ద పెద్ద రేఖాగణిత ఆకృతులు, గోడలు, వంపులు కనిపిస్తాయి. ఇవన్నీ శాస్త్రీయ లెక్కల కోసం ప్రత్యేకంగా రూపొందించారు.ఆ కాలంలో ఉన్న ఖగోళ పరికరాలు చిన్నవిగా ఉండటంతో కచ్చితమైన కొలతలు తీసుకోవడం కష్టమని జైసింగ్ భావించారు. అందుకే వాటి కంటే పెద్దవి, బలమైనవి నిర్మించారు. నేటికీ అవి అద్భుతమైన నిర్మాణాలుగా నిలిచాయి.



**ఇప్పుడు ఎక్కడెక్కడ ఉన్నాయి** ప్రస్తుతం భారత్‌లో నాలుగు జంతర్ మంతర్‌లు ఉన్నాయి. అవి జైపూర్, ఢిల్లీ, ఉజ్జయిని, వారణాసి నగరాల్లో ఉన్నాయి. ఢిల్లీలోని జంతర్ మంతర్ 1724లో పూర్తయింది. తర్వాత జైపూర్‌లో మరింత పెద్ద పరిశీలనా కేంద్రాన్ని నిర్మించారు. వారణాసి, ఉజ్జయినిలోనూ జంతర్ మంతర్‌లు ఏర్పడ్డాయి. మరో జంతర్ మంతర్ మధురలో ఉండేది. 1857కు ముందు అక్కడి కోటతో పాటు దానిని కూడా కూల్చివేశారు. అందుకే అది ఇప్పుడు కనిపించదు.

**ఒక్కో జంతర్ మంతర్ ఒక్కోలా!**అన్నింటిలోనూ ఖగోళ లెక్కలకు సంబంధించిన సూత్రాలు ఒకటే. కానీ నిర్మాణ పరిమాణం, వాడిన వస్తువులు, ఆకృతులు మాత్రం ప్రాంతాన్ని బట్టి మారాయి. అందుకే ఏ రెండు జంతర్ మంతర్‌లు కూడా అచ్చం ఒకేలా కనిపించవు. జైపూర్, ఢిల్లీ జంతర్ మంతర్‌లు ఎక్కువగా ప్రసిద్ధి చెందాయి. జైపూర్‌లో అత్యధిక సంఖ్యలో, రకరకాల ఖగోళ పరికరాలు ఉన్నాయి. అయితే కాలక్రమంలో ఈ ప్రాంతాల చుట్టూ భారీ భవనాలు పెరిగాయి. దీంతో ఆకాశాన్ని వీక్షించేందుకు అక్కడి పరికరాలకు అవసరమైన మేర స్థలం అందుబాటులో లేదు. అందుకే వాటితో గతంలోలా కచ్చితమైన ఖగోళ పరిశీలనలు ఇప్పుడు సాధ్యం

# మా అనుమతి లేదు'.. ఫారమ్-6పై సుప్రీంకోర్టు షాకింగ్ కామెంట్స్

**ఫారమ్-6 మార్పులకు అనుమతి ఇవ్వలేదని సుప్రీంకోర్టు స్పష్టీకరణ**

**మార్పు ఎవరు చేశారో తెలుసుకుంటామన్న సీజేఐ**

**రికార్డులు చూశాకే పూర్తిస్థాయి విచారణ ఉంటుందని వెల్లడి**

**ఫారమ్-6ను సవరించలేదని ఈసీ స్పష్టీకరణ**

**'సర్' కోసం అదనపు డిక్లరేషన్ మాత్రమే చేర్చామని వెల్లడి**

కొత్త ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఉపయోగించే ఫారమ్-6లో చేసిన మార్పులపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సవరించిన ఫారమ్-6కు తాము అనుమతి ఇవ్వలేదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. ఈ వ్యవహారాన్ని పూర్తిగా పరిశీలిస్తామని చెప్పారు.

ఫారమ్-6లో అసలు మార్పు జరిగిందా? జరిగితే ఎవరు చేశారు? అనే విషయాలను తేల్చాల్సి ఉందని కోర్టు తెలిపింది. దీనికి సంబంధించిన రికార్డులు తమ ముందుకు వచ్చిన తర్వాతే అంశాన్ని లోతుగా పరిశీలిస్తామని సీజేఐ చెప్పారు. "సవరించిన ఫారమ్-6ను మేం ఆమోదించలేదు. ఇది స్పష్టం" అని జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు.

అయితే ఫారమ్-6ను సవరించలేదని ఎన్నికల సంఘం చెబుతోంది. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ (సర్) కోసం కొత్త ఓటర్లకు అదనపు డిక్లరేషన్ మాత్రమే జత చేశామని వివరిస్తోంది. ఈ అదనపు ప్రకటనను జులైలో చేర్చారు. ఇందులో తల్లిదండ్రులు లేదా తాత, అమ్మమ్మల పాత ఓటరు జాబితా వివరాలను అనుసంధానించాల్సి ఉంటుంది.ఫారమ్-6 రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టర్స్ రూల్స్-1960లో భాగం. ఈ నిబంధనల్లో మార్పులు చేయాలంటే అధికారికంగా సవరణ చేయాల్సి ఉంటుంది. సెప్టెంబరు 29న తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సాకేత్ గోఖలే ఈ అంశాన్ని లేవనెత్తారు. ఫారమ్-6 మార్పులకు సంబంధించి ఎన్నికల సంఘం నుంచి ఎలాంటి ప్రతిపాదన తమ వద్ద లేదని న్యాయశాఖ ఆర్టీఐ సమాధానంలో చెప్పినట్లు ఆయన తెలిపారు.



ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఒంటరిగానే నిర్ణయాలు తీసుకున్నారా? అనే అంశంపైనా సుప్రీంకోర్టు విచారణ జరుపుతోంది. గత 10 నెలల్లో 'సర్'కు సంబంధించిన నిర్ణయాలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి పలుమార్లు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు ఇటీవల ఓ కథనం వెలువడిన విషయం తెలిసిందే.

# పాఠకుడిని చేరలేని నేటి కవిత

కేవలం కవులమనిపించుకోవాలన్న వ్యామోహం తప్ప తగిన నేపథ్యం, అవగాహన లేని వాళ్ళు ఎగబడటం వల్ల వచన కవితా ప్రక్రియ నిరర్థకమవుతోంది. ఛందోబందోబస్తులు, వ్యాకరణ నియమాలు మొదలైన సంకెళ్లను తెంచుకొని విషయాన్ని సూటిగా పారదర్శకంగా పాఠకుల కందించాలనే లక్ష్యంతో వచన కవిత ఆవిర్భవించింది. అయితే అది అతి సులభమైన ప్రక్రియ అనే అభిప్రాయంతో ఔత్సాహిక కవులు ఉత్సహపడటం వల్ల మౌలిక ప్రయోజనాన్ని, సాహిత్య గౌరవాన్ని కోల్పోతుంది. ఆధునిక కవితలు రాయడానికి నవ్య కవిత్వం చదివితే చాలు అనే కొందరు అతివాదుల ఉపన్యాసాలు కూడా యువకవులను పెడదోవ పట్టిస్తున్నాయి. ఏ కాలంలోనైనా కవికి ప్రతిభ, సృజనాత్మక శక్తి, భాష మీద అధికారం అవసరం. కొందరు ప్రసిద్ధ కవులు కూడా పాశ్చాత్య కవిత్వ ప్రభావంతో ప్రయోగాలు చెయ్యడం వల్ల ఆధునిక తెలుగు కవితల్లో మార్మికత, అస్పష్టత చోటు చేసుకుంటున్నాయి. "నా తల్లో పాదాలు మొలుస్తాయి/ పాదాల్లోంచి తోటలు లేస్తాయి/ తోటల్లోంచి సముద్రాలు వీస్తాయి..." ఇలాంటి కవితలు ఎవరికి అర్థమవుతాయి? ఏ ప్రయోజనాన్ని సాధిస్తాయి? ప్రాచీన కవిత్వంలో సంస్కృత పదబాహుళ్యం, అర్థం కాని సంధులూ సమాసాలూ వున్నాయని నిరసించి ఆధునిక కవిత్వాన్ని ఆదరించే సాహితీ ప్రియులకివి ఆశాభంగాలు కావా? "కవిత్వంలో అబ్‌స్క్యూరిటీ కొన్ని సందర్భాలలో ఉండొచ్చును.. అది ట్రాన్సపరెంట్ చీకటై ఉండాలి, నిన్ను పలకరించాలి" అనే తిలక్ నిర్వచనానికి ఇలాంటివి మింగుడుపడవు.రాసినవాళ్ళే తమ ఉద్దేశ్యాన్ని, అన్వయాన్ని స్పష్టంగా వివరించలేని కొన్ని వచన కవితల కంటే సామాజిక చైతన్యం విషయంలో మినీ కవితలు, గజళ్లు, ఉద్యమ కవితలు మేలనిపిస్తున్నాయి. ఇంకా తెలుగువారి ఆస్తి అయిన పద్యాలను కూడా నిర్లక్ష్యం చెయ్యడం సరికాదు. వేమన, సుమతి వంటి శతకాల్లోని పద్యాలు, పౌరాణిక నాటకాల్లోని పద్యాలు, జాషువా కరుణశ్రీ వంటి వారి కలాలు జాలువార్చిన పద్యాలు తెలుగు వారి నోళ్లలో నానడం లేదా? ఆ మాటకొస్తే వ్యాపార ప్రధానాలైన సినిమాల్లోని పాటలు కూడా నిరక్షరాస్యులను సైతం ప్రభావితం చెయ్యడం లేదా? జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత సి. నారాయణరెడ్డి తను సినిమాలకు రాసిన పాటలు అనుషంగికాలని ప్రకటించినా, అవి ఆయన కావ్యాలకు మించిన ప్రయోజనాన్ని ప్రచారాన్ని పొందాయి. అలాగే 'వెలుగునీడలు' చిత్రం కోసం శ్రీశ్రీ రాసిన "కల కానిది, విలువైనది, బ్రతుకు..." అనే పాట ఆత్మహత్యకు పూనుకున్న ఒక వ్యక్తిని బతికించడం కంటే ఏ సాహిత్య ప్రక్రియకైనా విలువైనదేముంటుంది. 'మురళీకృష్ణ' చిత్రంలో ఆత్రేయ రాసిన "అనుకున్నామని జరగవు అన్నీ, అనుకోలేదని ఆగవు కొన్ని, జరిగేవన్నీ మంచికని, అనుకోవడమే మనిషి పని..." వంటి సందేశాలు ఎంతమంది ఆశోపహతుల్ని ఓదార్చవు? 'పెళ్ళిపుస్తకం' చిత్రానికి ఆరుద్ర రాసిన పాటలో "అడుగడుగున తొలి పలుకులు గుర్తు చేసుకో, తడబడితే పొరబడితే తప్పుదిద్దుకో" అనే పంక్తులు దాంపత్య జీవితంలోని అపశ్రుతులను చక్కదిద్దే ఆణిముత్యాలు కావా? ఇవి సినిమా పాటల ప్రభావానికి చెందిన కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఈనాడు ఎన్నో సాహిత్య సంస్థలు నవలల, కథల పోటీలతో పాటు కవితల పోటీలు కూడా నిర్వహించి ఉత్తమ కవితలకు బహుమతులు అందచేస్తున్నాయి. ఈ తరుణంలో అవకాశాలను అందిపుచ్చుకుని వచనక కవితా ప్రక్రియ లక్ష్యాన్ని ప్రయోజనాన్ని యువతరం కవులు నిలుపుతారని ఆశిద్దాం.

# ఇండియాలో 'ఐఏఎస్ సింగం'.. ఇప్పుడు న్యూయార్క్‌టైమ్స్‌లో 'రాక్‌స్టార్'!

**తూకారాం ముండేకు న్యూయార్క్‌టైమ్స్‌లో అరుదైన గుర్తింపు**

**ఫ్రంట్ పేజీలో 'రాక్‌స్టార్'గా అభివర్ణన**

**భారత్‌లో ఇప్పటికే ముండేకు ప్రత్యేక గుర్తింపు**

**'ఐఏఎస్ సింగం'గా ముండేకు పేరు**

**రెస్టారెంట్లపై ఆకస్మిక తనిఖీలు, ప్రముఖ ఫుడ్ బ్రాండ్లపై చర్యలు**

కఠిన చర్యలతో ఇప్పటికే దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న ఐఏఎస్ అధికారి తూకారాం ముండే పేరు ఇప్పుడు అంతర్జాతీయ మీడియా వేదికపై మార్మోగింది. మహారాష్ట్ర ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్‌గా పరిశుభ్రత నిబంధనలు పాటించని రెస్టారెంట్లు, ఫుడ్ స్టోర్లపై కొరడా ఝుళిపిస్తున్న ముండేను 'ది న్యూయార్క్ టైమ్స్' ఏకంగా 'రాక్‌స్టార్'గా అభివర్ణించింది. ఆ పత్రిక ఫ్రంట్ పేజీలోనే ఆయనపై ప్రత్యేక కథనం ప్రచురించడం విశేషం. న్యూయార్క్ టైమ్స్ "ఇన్ ఇండియా, ఏ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఈజ్ ఏ రాక్‌స్టార్" అనే శీర్షికతో ముండేపై కథనం ప్రచురించింది. "డైనర్స్ రెవర్ హిమ్ అండ్ ఓనర్స్ ఫియర్ హిమ్" అంటూ ఆయనకు వినియోగదారుల్లో ఉన్న అభిమానాన్ని, రెస్టారెంట్ యజమానుల్లో ఉన్న భయాన్ని ప్రస్తావించింది. వెబ్ కథనంలో ఆయన్ను 'ఫుడ్ సేఫ్టీ సెలబ్రిటీ'గా పేర్కొంది. ఆకస్మిక తనిఖీలతో ముండే ఇప్పటికే దేశంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. రెస్టారెంట్లు, ఫుడ్ షాపులు, గోదాములు, క్విక్ కామర్స్ డార్క్ స్టోర్లలో తనిఖీలు నిర్వహిస్తూ నిబంధనలు ఉల్లంఘించిన సంస్థలపై చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఆయనకు 'ఐఏఎస్ సింగం' అనే పేరు కూడా వచ్చింది.'డొమినోస్', 'పిజ్జా హట్' ఔట్‌లెట్లలో తనిఖీల సందర్భంగా వంటగదుల్లో బొద్దింకలు, గడువు ముగిసిన ఉత్పత్తులు గుర్తించడంతో వాటిని తాత్కాలికంగా మూసివేశారు. ముంబయిలోని కొన్ని ప్రముఖ పాతకాలపు ఫుడ్ బిజినెస్‌ల లైసెన్సులపైనా తాత్కాలిక సస్పెన్షన్ వేటు పడింది. క్విక్ కామర్స్ సంస్థలు బ్లింకిట్, జెప్టోకు చెందిన డార్క్ స్టోర్లలోనూ తనిఖీలు జరిగాయి. అక్కడ బల్లులు, బొద్దింకలు, గడువు ముగిసిన ఆహార పదార్థాలు ఉన్నట్లు అధికారులు గుర్తించినట్లు కథనాలు వెలువడ్డాయి. రెస్టారెంట్ యజమానులపై చర్యలు తీసుకుంటున్న ముండే.. పరిశుభ్రమైన ఆహారం కోరుకునే వినియోగదారుల్లో మాత్రం ప్రత్యేక అభిమానాన్ని సంపాదించుకున్నారు. ఇప్పుడు ఆ గుర్తింపే అంతర్జాతీయ స్థాయికి చేరింది. భారత్‌లో 'ఐఏఎస్ సింగం'గా పేరొందిన ఆయనను న్యూయార్క్ టైమ్స్ 'రాక్‌స్టార్'గా అభివర్ణించడం ఆసక్తికరంగా మారింది.

# లండన్-షికాగో విమానంలో ఎమర్జెన్సీ.. నిమిషాల్లో 28,000 అడుగులు కిందకు

**బ్రిటిష్ ఎయిర్‌వేస్ విమానంలో ఎమర్జెన్సీ**

**ఐర్లాండ్ మీదుగా వెళుతుండగా ఘటన**

**7700 ఎమర్జెన్సీ కోడ్ యాక్టివేట్**

**విమానాన్ని 9,000 అడుగులకు దించిన వైనం**

**కారణం ఇంకా వెల్లడించని బ్రిటిష్ ఎయిర్‌వేస్**




లండన్ నుంచి అమెరికాలోని షికాగోకు వెళుతున్న బ్రిటిష్ ఎయిర్‌వేస్ విమానంలో సోమవారం అత్యవసర పరిస్థితి తలెత్తింది. ఐర్లాండ్ మీదుగా ప్రయాణిస్తున్న సమయంలో విమానం ఎమర్జెన్సీ ప్రకటించింది. వెంటనే పైలట్లు 7700 ఎమర్జెన్సీ కోడ్‌ను యాక్టివేట్ చేసి.. విమానాన్ని 37,000 నుంచి సుమారు 9,000 అడుగుల కిందకు దించారు. నిమిషాల్లో ఏకంగా 28,000 అడుగులు కిందకు రావడం గమనార్హం.

ఫ్లైట్ ట్రాకింగ్ వెబ్‌సైట్ ఫ్లైట్‌రాడార్24 ప్రకారం.. బ్రిటిష్ ఎయిర్‌వేస్ విమానం బీఏ295 అట్లాంటిక్ మీదుగా ప్రయాణిస్తుండగా ఎమర్జెన్సీ అలర్ట్ వచ్చింది. బోయింగ్ విమానం ఒక్కసారిగా కిందికి దిగడం, ఎమర్జెన్సీ కోడ్ పంపడంతో ఒక్కసారిగా ఉత్కంఠ నెలకొంది.7700 కోడ్‌ను విమాన సిబ్బంది సాధారణ అత్యవసర పరిస్థితిని సూచించేందుకు ఉపయోగిస్తారు. ఈ కోడ్ వచ్చినప్పుడు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ నుంచి విమానానికి ప్రాధాన్య సహాయం అందుతుంది. అయితే అత్యవసర పరిస్థితికి కారణం ఏంటో ఈ కోడ్ ద్వారా తెలియదు. సాంకేతిక సమస్య, ప్రయాణికుడికి వైద్య అత్యవసర పరిస్థితి లేదా ఇతర కారణాలతోనూ ఈ కోడ్‌ను ఉపయోగించవచ్చు.బీఏ295 ఘటనకు అసలు కారణాన్ని బ్రిటిష్ ఎయిర్‌వేస్ వెంటనే వెల్లడించలేదు. విమానం పరిస్థితి, ఆ తర్వాతి ప్రయాణ మార్గంపై మరిన్ని వివరాలు రావాల్సి ఉంది.ఇటీవల ఫ్లైదుబాయ్ విమానం ఎఫ్‌జెడ్1073లో జరిగిన ఘటన తర్వాత మరో విమానం ఎమర్జెన్సీ ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది. అయితే బీఏ295 ఘటనకు, ఫ్లైదుబాయ్ ఘటనకు సంబంధం ఉన్నట్లు ప్రస్తుతానికి ఆధారాలు లేవు. సెప్టెంబర్ 30న ఎఫ్‌జెడ్1073 విమానంలో కాక్‌పిట్‌లో గొడవ జరిగినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో 7700తో పాటు 7500 కోడ్‌ను కూడా యాక్టివేట్ చేశారు. 7500 కోడ్‌ను విమానంలో చట్టవిరుద్ధ జోక్యం లేదా హైజాక్ పరిస్థితిని సూచించేందుకు ఉపయోగిస్తారు. ఆ విమానం సౌదీ అరేబియాలోని తబుక్‌కు మళ్లి సురక్షితంగా ల్యాండ్ అయింది. ఈ ఘటనపై యూఏఈ అధికారులు దర్యాప్తు చేపట్టారు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com